www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 9-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 71 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ.9.36 తదుపరి చతుర్దశి; నక్షత్రం: విశాఖ మ.3.31 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.7.56-9.42; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.08; అమృతఘడియలు: ఉ.6.32-8.18; రాహుకాలం: 7.30-9.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.45

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కృత్రిమ రక్తం.. ఎవరికైనా వాడొచ్చు..!



అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు
సాధారణ గది ఉష్ణోగ్రతలో రెండేళ్లపాటు
నిల్వ చేసే చాన్స్.. ఫ్రీజర్‌లో అయితే ఐదేళ్లు!
ఏ, బీ, ఓ.. అన్ని గ్రూపులవారికీ ఎక్కించొచ్చు
ప్రయోగాల్లో సత్ఫలితాలు
2030 నాటికి అందుబాటులోకి..

2





మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తొలిసారి.. తీన్మార్!

ముగ్గురితో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ.. ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులు

రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా కార్యక్రమం
గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, పీసీసీ చీఫ్, శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, నేతలు
9 నిమిషాల్లోనే ముగిసిన ప్రమాణ స్వీకారం
రేవంత్ క్యాబినెట్‌లో 14కు చేరిన మంత్రుల సంఖ్య
స్థానిక ఎన్నికల తర్వాత మిగిలిన 3 ఖాళీల భర్తీ!

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వచ్చిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు జరిగింది. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో.. తొలి విడతగా మూడింటిని భర్తీ చేశారు. మూడు బెర్తులనూ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికే కట్టబెట్టారు. ఈ మేరకు ముగ్గురు కొత్త మంత్రులు ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో.. గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణం చేశారు. మొదటిగా.. మంచిర్యాల జిల్లా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం వివేక్ ఇంగ్లిషులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలుగులో ప్రమాణం చేశారు. ఒక్కొక్క రుగా పత్రాలపై సంతకం చేసిన తొలుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మిగతా 13వ పేజీలో...

13

అసంతృప్తులకు చెక్!

విస్తరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన అధిష్ఠానం
ఒకటి బీసీ, రెండు ఎస్సీలకు కేటాయింపు.. సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి నారాజ్
బలహీనవర్గాలకు కేటాయింపుతో బయటపడలేని స్థితి
అసంతృప్తులకు మీనాక్షి నటరాజన్, మహేశ్ బుజ్జగింపు
మూడు పెండింగ్ బెర్తుల్లో ఒకటి మైనారిటీకి దక్కే చాన్స్

కలలో కూడా ఊహించలేదు

మంత్రి పదవి వస్తుందని అనుకోలేదు
సామాన్య కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ మంత్రిని చేసింది
మాదిగ జాతికి ప్రతినిధిగా అవకాశం కల్పించింది
1982 నుంచి పార్టీలో ఉన్నా.. ఎన్నో కష్టాలు పడ్డా
మంత్రిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
'ఆంధ్రజ్యోతి'తో కొత్త మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

13

ప్రజాసేవకు మరో అవకాశం

కాకా ఆశయాలను కొనసాగిస్తా
ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేస్తా
సింగరేణికి కొత్త గనుల కోసం కృషి చేస్తా
ఏ శాఖ ఇవ్వాలో సీఎం నిర్ణయిస్తారు: వివేక్

నేడో, రేపో శాఖల కేటాయింపు

ఎవరికీ కేటాయించని శాఖలు ఇచ్చే చాన్స్
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తొలిసారి ప్రాతినిధ్యం

13

స్థానిక పోరు తర్వాత పునర్వ్యవస్థీకరణ?

జూలైలోనే స్థానిక ఎన్నికలు!
ఆగస్టు 15 కల్లా పూర్తి
ఎన్నికల్లో పనితీరును బట్టి పునర్వ్యవస్థీకరణలో అవకాశం

14

ఏపీ ఈఏపీసెట్‌లో మనోళ్లకు ర్యాంకులు

ఇంజనీరింగ్‌లో అనిరుధ్‌రెడ్డికి మొదటి, ఎస్. త్రిశూల్‌కు ఎనిమిదో ర్యాంకు
అగ్రి, ఫార్మసీలో షణ్ముఖ నిషాంత్‌కు 2వ, వై.షణ్ముఖ్‌కు నాలుగో ర్యాంకు
తెలంగాణ తరహాలో సీట్లు స్థానికులకే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం

14



డెమొక్రాట్లకు నిధులిస్తే తీవ్ర పరిణామాలు

మస్క్‌కు అమెరికా అధ్యక్షుడి హెచ్చరిక
ఆయనతో బంధం ముగిసినట్టేనన్న ట్రంప్

2



లాస్ ఏంజెలెస్‌కు నేషనల్ గార్డ్ దళాలు

2 వేల మందిని మోహరించిన ట్రంప్
ట్రంప్‌వి రెచ్చగొట్టే చర్యలు
కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ విమర్శ

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా

ఎన్నికైన 24 గంటలు గడవకముందే నిర్ణయం
హరి హర వీరమల్లు కోసం థియేటర్లు ఖాళీగా పెట్టుకున్నామన్న టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ వ్యాఖ్యలతో దుమారం
తమ ఇమేజ్‌ను డ్యామేజ్ చేశారంటూ టాలీవుడ్ అగ్ర హీరోల ఆగ్రహం
అందుకే రాజీనామా అంటూ ప్రచారం

10



హైదరాబాద్ చేరుకున్న ప్రభాకర్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు జూబ్లీహిల్స్ ఠాణాలో విచారణ
ప్రభాకర్‌రావుకు శంషాబాద్‌లో కస్టమ్స్ అధికారి స్వాగతం
సీరియస్‌గా తీసుకున్న హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. కేసు నమోదవ్వగానే.. క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లిన ప్రభాకర్‌రావు 14 నెలలుగా అక్కడే ఉండిపోయిన విషయం తెలిసిందే.! కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు ఆయన పాస్‌పోర్టును రద్దు చేయించారు. సుప్రీంకోర్టు ఆయన పాస్‌పోర్టును పునరుద్ధరించి, వెనక్కి వచ్చేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాస్‌పోర్టు పునరుద్ధరణ జరిగిన మూడ్రోజుల్లో ప్రభాకర్‌రావు సిట్ విచారణకు

మిగతా 12వ పేజీలో...

మాగంటికి కన్నీటి వీడ్కోలు

ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

నివాళులర్పించిన సీఎం రేవంత్, భట్టి, నేతలు
కన్నీటి పర్యంతమైన మాజీ సీఎం కేసీఆర్
ఆస్పత్రి నుంచి మహాప్రస్థానం వరకు మాగంటి కుటుంబం వెంట కేటీఆర్, హరీశ్
మాగంటి కుమారుడి వెంట ఉన్న హిమాన్షు
చివరి చూపుకోసం భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు
అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



గోపీనాథ్ పాడె మోస్తున్న కేటీఆర్, హరీశ్; విలపిస్తున్న కేసీఆర్



హైదరాబాద్ సిటీ, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) కన్నుమూశారు. ఈ నెల 5న మధ్యాహ్నం తీవ్ర గుండెపోటుతో గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 5.45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. మాగంటి గోపీనాథ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు వాత్సల్యనాథ్, అక్షర నాగ, దిశిర ఉన్నారు. ఆయన మృతి విషయం తెలిసి బీఆర్ఎస్ శ్రేణులు, అనుచరులు, విత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన భార్య శైలిమ, తనయుడు హిమాన్షు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు పార్టీ నేతలు, అభిమానులు ఆస్పత్రికి చేరుకున్నారు. మాగంటి భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో మాదాపూర్ వసంత హైట్స్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. మాగంటి గోపీనాథ్ చివరి చూపు కోసం నేతలు, ప్రముఖులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి

మిగతా 3వ పేజీలో...

స్కూలు బీజేపీ.. కాలేజీ టీడీపీ..

ఉద్యోగం రాహుల్ దగ్గర!

నేను, కిషన్‌రెడ్డి కలిస్తే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుంది
దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో సన్నిహిత బంధాలు
మా ప్రభుత్వ నిర్ణయాల్లో దత్తన్న, పీజేఆర్ స్ఫూర్తి
ప్రస్తుతం జంట నగరాల్లో ఇలాంటి నేతల కొరత ఉంది
దత్తాత్రేయ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్
నేనీ స్థాయిలో ఉండడానికి దత్తాత్రేయే కారణం: కిషన్‌రెడ్డి
డైపర్లు మార్చినట్లు పార్టీలు మార్చేస్తున్నారు: వెంకయ్య
జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ: చంద్రబాబు
బాబు వల్లే హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్: కోమటిరెడ్డి
బీజేపీ కార్యకర్తలే నా ఆస్తి: బండారు దత్తాత్రేయ
వారికి చెవులున్నా వినపడవు.. నోరున్నా మాట్లాడరు
కిషన్‌రెడ్డిపై రాజాసింగ్ పరోక్ష విమర్శలు



దత్తాత్రేయ దంపతులతో గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తాను కలిస్తే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకతీతంగా కిషన్‌రెడ్డిని అప్పుడప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటానన్న ఆయన.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సరదా సంఘటనను రేవంత్‌రెడ్డి

మిగతా 12వ పేజీలో...



శుభాకాంక్షలు శుక్లా..

'మిషన్ ఆకాశ గంగ'లో భాగంగా రేపే ఐఎస్ఎస్‌కి బయల్దేరనున్న భారత వాయుసేన పైలట్ శుభాన్షు శుక్లా
యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురితో కలిసి!
ఎల్లుండి రాత్రి పదింటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి
రెండు వారాలపాటు అక్కడే ఉండి పలు ప్రయోగాల నిర్వహణ

న్యూఢిల్లీ, జూన్ 8: రోదసి నుంచి భారతదేశం ఎలా కనపడుతోందని అడిగితే.. 'సారే జహాసే అచ్ఛా' అంటూ జవాబిచ్చిన తొలి భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ వారసుడిగా ఆయన రోదసిలోకి వెళ్లిన నాలుగు దశాబ్దాల తర్వాత.. మరో భారతీయుడు అంతరిక్షంలో విహరించేందుకు సర్వం సిద్ధమైంది! అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'యాక్సియం స్పేస్' చేపట్టిన యాక్సియం 4 (యాక్స్-4) మిషన్‌లో భాగంగా.. భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా మంగళవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి వెళ్లనున్నారు. ఐఎస్ఎస్‌కు వెళ్లే

మిగతా 2వ పేజీలో...

కృత్రిమ రక్తం.. ఎవరికైనా వాడొచ్చు!

అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు

ట్రయల్స్‌లో సత్ఫలితాలు.. 2030కి అందుబాటులోకి

టోక్యో, జూన్ 8: రక్త దానం అంటే.. ప్రాణదానం చేయడమే! కానీ స్వచ్ఛందంగా రక్తం ఇచ్చే దాతల కొరత కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరీ ముఖ్యంగా అరుదైన బ్లడ్ గ్రూప్ కలిగిన వారు ఏదైనా ప్రమాదంలో గాయపడ్డా, శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సివచ్చినా.. వారి బ్లడ్‌గ్రూప్‌తో సరిపోలే రక్తం దొరక్క కన్నుమూస్తున్నారు!! ఈ క్రమంలోనే.. ఏ గ్రూపువారికైనా ఎక్కించగల కృత్రిమ రక్తాన్ని జపాన్‌లోని నారా మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. సాధారణంగా.. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని 42 రోజుల్లోగా వినియోగించాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే ఆ రక్తం పనికిరాదు. కానీ, అందులో ఉన్న హిమోగ్లోబిన్‌ను వాడుకునే వీలుంటుంది. అలా సేకరించే హిమోగ్లోబిన్‌ను లిపిడ్ షెల్స్‌లో ఉంచడం ద్వారా ఏ గ్రూపూ లేని ఎర్ర రక్త కణాలను తయారుచేసే విధానాన్ని వారు రూపొందించారు. ఈ విధానంలో తయారుచేసిన రక్తాన్ని ఎలాంటి పరీక్షా అక్కర్లేకుండా నేరుగా బాధితులకు ఎక్కించవచ్చు. మామూలుగా అయితే.. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచడానికి ప్రత్యేకమైన ప్రొటోకాల్స్ ఉంటాయి. ఆ రక్తాన్ని 1 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచాలి. కానీ.. ఈ కృత్రిమ రక్తాన్ని సాధారణ గది ఉష్ణోగ్రతలోనే రెండేళ్లపాటు ఏ ఇబ్బందీ లేకుండా నిల్వ ఉంచవచ్చని, అదే ఫ్రిజ్‌లో పెడితే ఏకంగా ఐదేళ్లపాటు నిల్వ చేయొచ్చని దీని రూపకర్తలు చెబుతున్నారు. కాగా.. 2022 నుంచి ఈ రక్తంపై ట్రయల్స్ ప్రారంభించారు. తొలి దశ పరీక్షల్లో భాగంగా 20 నుంచి 50 ఏళ్ల వయసున్న పురుష వలంటీర్లకు ఇంట్రావీనస్ పద్ధతిలో ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కించారు. కొద్దిమొత్తం రక్తంతో ప్రారంభించి.. కొంచెం కొంచెంగా పెంచుకుంటూ 100 మిల్లీలీటర్ల దాకా ఎక్కించారు. వలంటీర్లలో కొద్దిమందికి స్వల్ప దుష్ప్రభావాలు కనిపించాయి తప్ప.. వారి రక్తపోటులో ఎలాంటి తేడా రాలేదని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త సకాయ్ తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి మలిదశ ట్రయల్స్ మొదలుపెట్టి.. వలంటీర్లకు 100 మిల్లీలీటర్ల నుంచి 400 మిల్లీలీటర్ల దాకా రక్తాన్ని ఎక్కించి చూశారు. అయితే.. రక్తమార్పిడి అనేది కోట్ల మంది ప్రాణాలకు సంబంధించిన అంశం కాబట్టి ఈ ట్రయల్స్‌ను 2030 దాకా కొనసాగించి, కృత్రిమ రక్తం పూర్తిగా సురక్షితం అని నిర్ధారించుకున్నాకే అందరికీ అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు.. జపాన్‌కే చెందిన చువో యూనివర్సిటీ ప్రొఫెసర్ తెరుయుకి కొమత్సు కూడా ఇదే తరహా ప్రయోగాలు చేస్తున్నారు. శరీరంలోని అన్ని కణాలకూ అవసరమైన ఆక్సిజన్‌ను సరఫరా చేసే కృత్రిమ ప్రాణవాయు వాహకాలను తయారు చేసే పనిలో ఆయన ఉన్నారు. ఆల్బుమిన్‌లో పొదిగిన హిమోగ్లోబిన్‌ను ఉపయోగించి.. రక్తపోటును సమస్థితికి తీసుకొచ్చే అవకాశాలపైన, మెదడులో రక్తస్రావం, పక్షవాతం వంటి సమస్యలకు చికిత్సపైన ఆయన దృష్టి సారించారు.





భారత్-పాక్ మధ్య మధ్యవర్తిత్వానికి సిద్ధం

ఇరాన్ ప్రకటన.. స్వాగతించిన పొరుగు దేశం

న్యూఢిల్లీ, జూన్ 8: భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గేలా మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ఇరాన్ ప్రకటించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో శనివారం ఫోన్‌లో మాట్లాడిన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఈ విషయాన్ని తెలిపారు. పరస్పరం ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్న ఇరువురు నేతలు ముస్లిం దేశాల మధ్య ఐకమత్యం ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అనంతరం భారత్-పాక్ సంబంధాలపై మాట్లాడారు. 'ఉద్రిక్తతలు తగ్గి ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా ఇస్లామిక్ రాజ్యాల్లో శాంతి నెలకొనాలన్న సిద్ధాంతపర విధానంపై ఇరాన్ దృష్టి కేంద్రీకరించిన'ట్టు పెజెష్కియన్ తెలిపారు. భారత్-పాక్‌ల మధ్య చిరకాల శాంతి నెలకొనేలా జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ స్వాగతిస్తుందని, అందులో భాగంగా రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వ పాత్రను కూడా పోషించగలదని చెప్పారు. పాక్‌లో పర్యటించాలని షరీఫ్ కోరగా అందుకు ఆయన అంగీకరించారు. తర్వాత షరీఫ్ మాట్లాడుతూ భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతల్లో ఇరాన్ అనుసరిస్తున్న వైఖరిని ప్రశంసించారు. భారత్‌తో చర్చలు జరపాలనే తాము కోరుకుంటున్నామని, ఇరాన్ మధ్యవర్తిత్వం వహిస్తే స్వాగతిస్తామని తెలిపారు.

సుఖోయ్ కూల్చాం..ఎస్-400 ధ్వంసం చేశాం!

ఆగని పాక్ దుష్ప్రచారం.. మార్ఫింగ్ చిత్రాలతో హోరు

న్యూఢిల్లీ, జూన్ 8: మన దేశంలోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్-30ఎంకేఐ విమానంపై పాక్ క్షిపణి దాడి చేసిందా? గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ స్థావరంలో ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసిందా?.. ఆపరేషన్ సిందూర్ నిలిచి సుమారు నెల రోజులు అవుతున్నా.. పాకిస్థాన్ ఇంకా ఇలాంటి దుష్ప్రచారాన్ని ఆపలేదు. మార్ఫింగ్ చేసిన చిత్రాలు, ఎప్పటివో పాత ఫొటోల్లో కొంతభాగాన్ని చూపుతూ.. పాక్ దాడుల్లో భారత ఎయిర్‌బేస్‌లకు జరిగిన నష్టమంటూ.. ఆ దేశ మీడియా, సోషల్ మీడియా వేదికగా ప్రచారం హోరెత్తుతోంది. అవన్నీ ఉత్త అబద్ధాలేనని తాజాగా ప్రముఖ విశ్లేషకుడు డామియెన్ సిమన్ ఆధారాలతో సహా తేల్చేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ విమానాన్ని, ఎస్-400 వ్యవస్థను, భుజ్ ఎయిర్‌బేస్‌లో మరో ఎస్-400 వ్యవస్థను, నలియా, శ్రీనగర్ ఎయిర్‌బేస్‌లు, జమ్మూ విమానాశ్రయంలో రన్‌వేలను, నిర్మాణాలను ధ్వంసం చేసినట్టు పాక్ మీడియా చూపుతున్న చిత్రాలు మార్ఫింగ్ చేసినవని, కొన్ని పాత ఫొటోలని స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో ఆయా ఎయిర్‌బేస్‌లకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి.. అక్కడ ఎలాంటి నష్టం జరగలేదని వివరించారు.

ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే: షా

చెన్నై, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఆదివారం తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు. పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. అంతకుముందు అమిత్‌షా మదురైలోని సుప్రసిద్ధ మీనాక్షి, సుందరేశ్వరర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సామూహిక ఆత్మాహుతి చేసుకుంటాం

తమ నేత విడుదలకు మైతేయీ యువకుల డిమాండ్

ఇంఫాల్, జూన్ 8: భద్రతా బలగాలు, సీబీఐ అరెస్టు చేసిన అరంబాయ్ టెంగోల్(ఏటీ) నేత కరణ్ సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో సామూహికంగా ఆత్మాహుతి చేసుకుంటామంటూ మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మైతేయీ యువకులు ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి ఇంఫాల్‌లో రోడ్లపై టైర్లను తగులబెట్టి, రాస్తారోకో చేశారు. యువకులు తమ తలలపై పెట్రోల్ చల్లుకుని, ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసే కరణ్‌సింగ్ అదనపు ఎస్పీ మొయిరింగ్థమ్ అమిత్ ఇంటిపై దాడి చేసి, అతణ్ని అపహరించిన కేసులో నిందితుడు. ప్రభుత్వం కరణ్ సింగ్‌ను సస్పెండ్ చేయడంతో.. అరంబాయ్ టెంగోల్‌లో చేరారు. కరణ్‌సింగ్‌ను తొలుత భద్రతాబలగాలు అరెస్టు చేయగా.. ఆ తర్వాత సీబీఐ అదుపులోకి తీసుకుంది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా ఇంఫాల్(తూర్పు), ఇంఫాల్(పశ్చిమం), బిష్ణుపూర్, థౌబల్, కాక్చింగ్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించింది.

దేశంలో 6 వేలు దాటిన కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ , జూన్ 8: దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 6వేల మార్కును దాటి 6,133కు చేరుకుంది. గత 48 గంటల్లోనే ఏకంగా 769 కొత్త కేసులు నమోదయ్యాయి. అలాగే గత 24 గంటల్లో 6 మరణాలు సంభవించాయి. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి మరణాల సంఖ్య 65కు చేరుకుంది. ఇక దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉంది. కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సంసిద్ధతను పరిశీలించడానికిగాను మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది.



లాస్ ఏంజెలెస్‌కు నేషనల్ గార్డ్స్

న్యూఢిల్లీ, జూన్ 8: అక్రమ వలసదారులను గుర్తించేందుకు అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలతో అమెరికాలోని లాస్ ఏంజెలెస్ రణరంగంగా మారింది. నిరసనకారుల ఆందోళనలు రెండో రోజుకు చేరడంతో అధ్యక్షుడు ట్రంప్ శనివారం 2వేల మంది నేషనల్ గార్డ్ దళాలను నగరంలో మోహరించారు. లాస్ ఏంజెలెస్‌లో పెరుగుతున్న చట్టవిరుద్ధ చర్యలను అడ్డుకొని, సమస్యను పరిష్కరించడానికి ఈ బలగాలు కనీసం 60 రోజుల పాటు అక్కడే ఉంటాయని వైట్ హౌస్ తెలిపింది. హింసాకాండ ఇలాగే కొనసాగితే నావికా దళాన్ని రంగంలోకి దించుతామని రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ హెచ్చరించారు. లాస్ ఏంజెలిస్‌లో నేషనల్ గార్డ్ దళాల మోహరింపు నిర్ణయాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తప్పుబట్టారు. ట్రంప్ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

శ్వేతసౌధంలో మస్క్-బెసెంట్ డిష్యుం డిష్యుం

ట్రిలియన్ డాలర్ల ఆదా ఏమైంది?

- మస్క్‌ను నిలదీసిన అమెరికా ట్రెజరీ సెక్రటరీ బెసెంట్.. కోపంతో మస్క్ దాడి
- తిరిగి కొట్టిన బెసెంట్..మస్క్‌కు గాయం
- కొట్లాట వివరాలను వెల్లడించిన ట్రంప్ అనుచరుడు స్టీవ్



బెసెంట్

వాషింగ్టన్, జూన్ 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్; డోజ్ మాజీ అధిపతి ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు పొడచూపిన నేపథ్యంలో శ్వేతసౌధంలో జరిగిన దిగ్భ్రాంతికర ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ పరస్పరం కొట్టుకున్న విషయం బయటకొచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా అధ్యక్ష కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ట్రంప్ అనుచరుడు స్టీవ్ బ్యానన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' కథనంలో పేర్కొంది. శ్వేతసౌధంలో జరిగిన సమావేశం అనంతరం మస్క్, బెసెంట్ నడుచుకుంటూ వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. "నువ్వు ప్రభుత్వానికి ట్రిలియన్ డాలర్లు ఆదా చేస్తానని హామీ ఇచ్చావు. కానీ, ఇంత వరకు చేసిందేమీ లేదు. ఇంతకీ నువ్వేం చేస్తున్నట్లు? అని బెసెంట్.. మస్క్‌ను ప్రశ్నించారు. నువ్వో మోసగాడివి, పూర్తిగా మోసగాడివి అని ఆరోపించారు. ఆగ్రహంతో ఊగిపోయిన మస్క్.. ఒక్కసారిగా బెసెంట్‌పైకి దూసుకెళ్లారు. రగ్బీ ఆటగాడిలా తన కుడి భుజంతో బెసెంట్ పక్కటెముకలో గుద్దారు. వెంటనే బెసెంట్ కూడా మస్క్‌ను తిరిగి కొట్టారు. వారిద్దరినీ విడిపించేందుకు అక్కడున్నవారంతా ప్రయత్నించారు. తర్వాత మస్క్‌ను పశ్చిమ మార్గం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ట్రంప్.. 'ఇది చాలా దారుణం' అని వ్యాఖ్యానించారు" అని బ్యానన్‌ను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనంలో తెలిపింది. డోజ్ అధిపతిగా రాజీనామా చేసిన తర్వాత ట్రంప్‌తో కలిసి చివరిసారిగా విలేకరుల సమావేశంలో పాల్గొన్న సమయంలో మస్క్ కన్ను వాచి, నల్లగా మారింది. అయితే అది తన కుమారుడి వల్ల అయిన గాయమని మస్క్ పేర్కొనడం గమనార్హం. మస్క్-బెసెంట్ కొట్లాట విషయం బయటపడిన తర్వాత అందరూ అది శ్వేతసౌధంలో బెసెంట్ చేసిన గాయమేనని పేర్కొంటున్నారు.

డెమోక్రాట్లకు నిధులిస్తే చాలా తీవ్ర పరిణామాలు

మస్క్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జూన్ 8: ఒకప్పటి తన కీలక మద్దతుదారు, ఎన్నికల్లో ఆర్థికంగా అండదండలు అందించిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో సంబంధం ముగిసిందని అంగీకరించారు. తన ప్రత్యర్థులైన డెమొక్రాట్లకు నిధులు అందజేస్తే చాలా తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయనను హెచ్చరించారు. తన ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యయ నియంత్రణ బిల్లుకు మద్దతు ఇస్తున్న రిపబ్లికన్లను సవాలు చేసే డెమొక్రాటిక్ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలిపారు. అయితే ఆ పరిణామాలు ఏమిటో ఆయన వివరించలేదు. శనివారం ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు ప్రముఖ నాయకుల మధ్య గత వారం రోజులుగా బహిరంగంగానే విమర్శల యుద్ధం నడుస్తోంది. విద్యుత్తు వాహనాలపై రాయితీలు తగ్గింపు సహా ప్రభుత్వ వ్యయంలో కోత విధిస్తూ ట్రంప్ బిల్లు తీసుకొచ్చారు. 'ఇదొక పెద్ద సుందరమైన చట్టం' అని ట్రంప్ అభివర్ణించారు. మస్క్ మాత్రం ఇది రోత, అసహ్యం కలిగించేదని విమర్శించారు. ట్రంప్ విధానాలు తిరోగమనానికి దారి తీస్తాయని హెచ్చరించారు. ట్రంప్ అభిశంసనకు మద్దతు ఇస్తానంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టి అనంతరం తొలగించారు. దీనిపై ట్రంప్ కూడా ఘాటుగానే స్పందించారు. అధ్యక్ష పదవిని మస్క్ అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. ఆ కుబేరునిలో అసంతృప్తి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మస్క్ విమర్శల కారణంగా రిపబ్లికన్లలో ఎప్పుడూ లేనంత ఐకమత్యం కనిపిస్తోందని తెలిపారు. మస్క్ వ్యాపారాలపై దర్యాప్తు జరపాలని డిమాండ్లు రాగా, వాటి గురించి ప్రస్తుతం ఆలోచించడం లేదని ట్రంప్ అన్నారు. ప్రముఖ విద్యుత్తు వాహనాల తయారీ సంస్థ అయిన టెస్లా.. మస్క్‌దే కావడం గమనార్హం. విద్యుత్తు వాహనాలకు ఇస్తున్న రాయితీలను ట్రంప్ ఎత్తివేయడంతో అసంతృప్తి చెందిన మస్క్ ప్రభుత్వ పదవికి కూడా రాజీనామా చేశారు.

రాహుల్ ఆరోపణలు అర్థరహితం!

మహారాష్ట్ర ఎన్నికలపై నేరుగా లేఖ రాస్తేనే స్పందిస్తాం..వ్యాసాలకు జవాబివ్వం: ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 8: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని.. బీజేపీ ఓటమి ఖాయమైన చోట్ల ఈసీ మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడుతోందని.. త్వరలో బిహార్‌లోనూ అదే జరుగుతుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఓ వ్యాసంలో చేసిన ఆరోపణలకు బదులిచ్చేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిరాకరించింది. అవి అర్థంలేని ఆరోపణలుగా కొట్టివేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత నేరుగా తమకు లేఖ రాస్తేనే స్పందిస్తామని.. వ్యాసాలకు కాదని ఈసీ వర్గాలు ఆదివారం స్పష్టంచేశాయి. మహారాష్ట్ర ఫలితాలపై కాంగ్రెస్ లేవనెత్తిన అభ్యంతరాలకు గత ఏడాది డిసెంబరు 24నే కమిషన్ అన్ని వాస్తవాలతో జవాబులిచ్చామని.. అవి ఈసీ వెబ్‌సైట్‌లో కూడా ఉన్నాయని తెలిపాయి. తర్వాత అవే ఆరోపణలకు సంబంధించి చర్చించేందుకు గత నెల 15వ తేదీన ఆరు జాతీయ పార్టీలను ఆహ్వానించామని.. వాటిలో ఐదు పార్టీలు మాత్రమే వచ్చాయని.. కాంగ్రెస్ చివరి నిమిషంలో రద్దు చేసుకుందని వెల్లడించాయి. విధాన ప్రక్రియ ప్రకారం ఈసీ సహా ఏ రాజ్యాంగ సంస్థయినా తమకు లేఖ రాస్తేనే స్పందిస్తాయని తెలిపాయి. 'తాను లేవనెత్తిన అంశాలు చాలా తీవ్రమైనవని రాహుల్ చెబుతుంటారు. కానీ లిఖితపూర్వకంగా మాకు పంపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది' అని పేర్కొన్నాయి. మహారాష్ట్ర పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం జరిగిన ఓటింగ్‌పై సీసీటీవీ ఫుటేజీని ఈసీ బయటపెట్టాలని ఆయన తన వ్యాసంలో డిమాండ్ చేశారని.. ఈసీ మార్గదర్శకాల ప్రకారం.. ఎవరైనా ఎన్నికల పిటిషన్ దాఖలుచేస్తే సంబంధిత హైకోర్టు సదరు సీసీటీవీ ఫుటేజీని స్క్రుటినీ చేయవచ్చని స్పష్టం చేశాయి.

కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై బహిరంగంగా కాల్పులు

పరిస్థితి విషమం.. 15 ఏళ్ల బాలుడి అరెస్టు



బగోటా, జూన్ 8: కొలంబియా అధ్యక్ష పదవికి పోటీ చేస్తారని భావిస్తున్న సెనేటర్ మిగుయెల్ ఉరిబే టర్బే (39)పై శనివారం బహిరంగంగా కాల్పులు జరగడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. వచ్చే ఏడాది మే నెలలో జరగనున్న ఎన్నికల్లో ఆయన డెమొక్రాటిక్ సెంటర్ పార్టీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే బగోటాలోని పార్కు వద్ద ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తుండగా వెనుక నుంచి కొందరు సాయుధులు ఆయనపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న ఆయనను వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. రెండు చోట్ల ఆయనకు తుపాకీ గుళ్లు తగిలినట్టు అటార్నీ జనరల్ కార్యాలయం తెలిపింది. మరికొందరు కూడా గాయపడ్డారని పేర్కొంది. ఘటనా స్థలంలో ఆయుధంతో ఉన్న 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి కాలుకు గాయం కావడంతో ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. మిగిలిన నిందితుల ఆచూకీ చెబితే బహుమతులు ఇస్తామని ప్రకటించారు. కొలంబియాలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం కారణంగానే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు.

మాస్కోపై డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

- రెండు విమానాశ్రయాల మూసివేత
- 9 డ్రోన్లను కూల్చివేసిన రష్యా


మాస్కో, జూన్ 8: ఉక్రెయిన్ ఆదివారం ఏకంగా రష్యా రాజధాని మాస్కోపైనే డ్రోన్లతో దాడి చేసింది. ఈ కారణంగా నగరంలోని రెండు కీలక విమానాశ్రయాలను మూసివేయాల్సి వచ్చింది. భద్రత దృష్ట్యా వునుకోవో, దొమొడెదోవో విమానాశ్రయాల్లో విమానాలను నిలిపివేసినట్టు రష్యా పౌరవిమానయాన సంస్థ రోసావియత్సియా తెలిపింది. మరోవైపు రాత్రి సమయంలో మాస్కో వైపు దూసుకు వస్తున్న డ్రోన్లలో తొమ్మిదింటిని రష్యా వాయు సేన కూల్చివేసిందని మేయర్ సెర్గెల్ సొబ్యానిన్ తెలిపారు. డ్రోన్ల శిథిలాలు పడే చోటికి అత్యవసర సేవల వాహనాలను పంపించినట్టు చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదని చెప్పారు. తులా రీజియన్‌లో ఉన్న అజోట్ రసాయనాల కర్మాగారంపై కూడా ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసింది. ఈ కారణంగా కొద్ది సేపు మంటలు వ్యాపించాయి. ఇద్దరు గాయపడ్డారు. కులుగ రీజియన్‌లో ఏడు ఉక్రెయిన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్టు అక్కడి గవర్నర్ తెలిపారు. ఇవన్నీ మాస్కో నగరానికి సమీపంలో ఉన్న రీజియన్లు కావడం గమనార్హం. ఈ దాడులపై ఉక్రెయిన్ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

శుభాకాంక్షలు శుక్లా..

(మొదటి పేజీ తరువాయి)



పెగ్గీ విట్సన్, స్లావోష్, టిబోర్



శుభాన్షు శుక్లా


తొలి భారతీయ వ్యోమగామి ఆయనే. అమెరికన్ వ్యోమగామి, నాసాకు చెందిన పెగ్గీ విట్సన్ కమాండర్‌గా ఉండే ఈ మిషన్‌లో.. శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు.. పోలండ్‌కు చెందిన స్లావోష్ ఉజ్నైన్‌స్కీ, హంగరీకి చెందిన టిబోర్ కాపూ వెళ్లనున్నారు. ఆయా దేశాల నుంచి రోదసిలోకి వెళ్లనున్న తొలి వ్యోమగాములు వారే కావడం విశేషం. 'మిషన్ ఆకాశ గంగ' అనే పేరుతో భారతీయులంతా పిలుచుకుంటున్న ఈ మిషన్.. మన కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5.52 గంటలకు ప్రారంభం కానుంది. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ సీ-213 స్పేస్‌క్రాఫ్ట్‌లో ఆ నలుగురూ ఐఎస్ఎస్‌కు పయనం కానున్నారు. ఫాల్కన్9 రాకెట్ ద్వారా ఆ వ్యోమనౌకను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెడతారు. అది భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి దాదాపు 10 గంటల సమయానికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానం (డాక్) అవుతుందని అంచనా. ఈ మిషన్ సమయం 14 రోజులు. అంటే.. రెండువారాలపాటు వారు ఐఎస్ఎస్‌లో ఉండి దాదాపు 60 శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టనున్నారు. వాటిలో ఏడు మన భారతదేశ పరిశోధకులు ఎంపిక చేసినవి. అవి.. మైక్రో ఆల్గే (సూక్ష్మ శైవలాల)పై భారరహిత స్థితి ప్రభావం, స్పేస్ రేడియేషన్ ప్రభావాన్ని అంచనా వేసే ప్రయోగం (సూక్ష్మ శైవలాలను అంతరిక్ష ప్రయోగాల్లో ఆక్సిజన్ ఉత్పత్తికి ఉపయోగిస్తారు. అలాగే.. మైక్రో ఆల్గేను పోషకాలు అధికంగా గల ఆహారంగా పరిగణిస్తారు). ఈ సూక్ష్మ శైవలాలు భూమ్మీద ఉన్నప్పటితో పోలిస్తే.. రోదసిలో ఉన్నప్పుడు వాటి ఆర్ఎన్ఏలో, ప్రొటీన్లలో, జీవరసాయన చర్యల్లో జరిగే మార్పులపై అధ్యయనం చేస్తారు. అలాగే.. సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలో కండరాల పునరుద్ధరణ, రోదసిలో పెసర, మెంతి సాగు తదితర అంశాలపై దృష్టి సారిస్తారు. శుక్లా ఈ ప్రయోగాలన్నింటినీ కేంద్రం ఆధ్వర్యంలో మన భారతీయ శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా తయారు చేసిన ఉపకరణాలతోనే చేయనున్నారు.

శుక్లాకు 130 ఏళ్లేమో...

శుభాన్షు శుక్లా 1985లో యూపీలోని లఖ్‌నవూలో జన్మించారు. 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ వింగ్‌లో చేరారు. ఎస్‌యు-30 ఎంకేఐ, మిగ్ 21, మిగ్ 29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 సహా పలు రకాల విమానాలను 2000 గంటలపాటు నడిపి అపార అనుభవాన్ని గడించారు. 2024 నాటికి గ్రూప్‌కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. తన కెరీర్‌లో ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన శుక్లాకు 2019లో ఇస్రో నుంచి పిలుపు వచ్చింది. దరిమిలా ఆయన మాస్కో(రష్యా)లోని యూరీ గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో వ్యోమగామి శిక్షణ పొందారు. ఈ మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లడం వల్ల.. స్పేస్‌ఫ్లైట్ ఆపరేషన్స్, లాంచ్ ప్రొటోకాల్స్ వంటివాటిలో అనుభవం సంపాదించే అవకాశం ఆయనకు లభిస్తుంది. అంతే కాదు.. శిక్షణలో భాగమైన కృత్రిమ భారరహిత స్థితి కాకుండా.. రోదసిలో ఉండే నిజమైన భారరహిత స్థితిని అనుభవిస్తారు. ఇస్రో చేపట్టబోయే గగన్‌యాన్ మిషన్‌లో ఈ అనుభవాలు ఆయనకు ఎంతగానో ఉపకరిస్తాయి. కాగా.. ఈ మిషన్‌లో శుక్లాతోపాటు పాల్గొనబోయే మిగతా వ్యోమగాములు ఆయన్ను ఎంతగానో ప్రశంసించారు. శుక్లాను చాలా తెలివైన వ్యక్తిగా ఈ మిషన్ కమాండర్ పెగ్గీ వాట్సన్ కొనియాడగా.. శుక్లా ఏ పైనా చాలా వేగంగా చేస్తారని, అంత వేగంగా ఎలా చేస్తారో తనకు తెలియదని స్లావోష్ ప్రశంసించారు. ఇక హంగరీ వ్యోమగామి టిబోర్ కాపు అయితే.. "శుక్లాకున్న పరిజ్ఞానం, తెలివి చూస్తుంటే ఆయన వయస్సు 130 ఏళ్లేమో అనిపిస్తుంది" అని కొనియాడారు.

'చినాబ్'పై తెలుగు ముద్ర!

రైల్వే వంతెన నిర్మాణంలో తెలుగమ్మాయి మాధవీలత బాధ్యతలు



నిర్మాణ సమయంలో చినాబ్ వంతెన వద్ద మాధవీలత

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన చినాబ్ బ్రిడ్జి నిర్మాణంలో తెలుగు తేజం మాధవీలత కీలక పాత్ర పోషించారు. ప్రకాశం జిల్లా ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన గాలి మాధవీలత ప్రస్తుతం బెంగళూరులోని ఐఐఎస్సీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కందుకూరులోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకున్న మాధవీలత జేఎన్‌టీయూ కాకినాడలో ఇంజనీరింగ్, వరంగల్ నిట్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తిచేసి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ చేశారు. గువాహటీ ఐఐటీలో ఏడాదిపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం బెంగళూరులోని ఐఐఎస్సీలో హెచ్ఏజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా అనేక ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. ఈ క్రమంలో చినాబ్ వంతెన నిర్మాణ బాధ్యతను నార్తర్న్ రైల్వే ఆఫ్కాన్స్ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఉండటంతో.. రాక్ మెకానిక్స్‌లో అనుభవం ఉన్న మాధవీలతకు ఈ ప్రాజెక్టులో పని చేసే అవకాశం దక్కింది. ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి ఈ బాధ్యతలన్నీ విజయవంతంగా పూర్తిచేసిన ఘనత మాధవీలతకు, ఆమె బృందానికి దక్కింది. ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన ప్రొఫెసర్ మాధవీలత బాల్యమంతా గ్రామంలోనే కొనసాగింది. తండ్రి గాలి వెంకారెడ్డి, తల్లి అన్నపూర్ణమ్మ. తండ్రి పొగాకు బయ్యర్‌గా పనిచేసేవారు. ఆయన మాధవీలత చిన్నతనంలోనే చనిపోయారు. తల్లి అన్నపూర్ణమ్మ ప్రస్తుతం గ్రామంలోనే కుమారుడు హరనాథ్ రెడ్డి దగ్గర ఉంటోంది. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న మాధవీలత భర్త హరిప్రసాద్ రెడ్డి గూగుల్‌లో పనిచేస్తున్నారు.

మాగంటికి కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

తరలివచ్చారు. మాగంటి భౌతికకాయానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి, పొన్నం, తుమ్మల, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సినీనటుడు మాగంటి మురళీమోహన్, ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణితోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలు నివాళులు అర్పించారు. నేతలు, అభిమానులు సందర్శన అనంతరం ఆదివారం సాయంత్రం గోపీనాథ్ అంతిమయాత్ర మొదలైంది. మాదాపూర్‌లో నివాసం నుంచి ప్రారంభమైన మాగంటి అంతిమయాత్ర మహాప్రస్థానం వరకు సాగింది. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి అంత్యక్రియలు జరిగాయి. చితికి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్ నిప్పంటించారు.

కన్నీటి పర్యంతమైన కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఉదయం 11.30 గంటల సమయంలో మాగంటి నివాసానికి చేరుకుని భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. ఈ సమయంలో కేసీఆర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. మాగంటి కుమారుడు వాత్సల్యనాథ్‌ను దగ్గరికి తీసుకొని ఓదార్చారు. తర్వాత ఇంటి లోపలికి వెళ్లి మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాగంటి ఎంతో కష్టపడి ఎదిగారని, సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరుపొందారని, ఆయన మరణం తీరని లోటని కేసీఆర్ పేర్కొన్నారు.

అన్నీ తామై వ్యవహరించిన కేటీఆర్, హరీశ్

మాగంటి ఆస్పత్రిలో ఉన్నప్పటి నుంచి అంత్యక్రియల వరకు అన్నింటినీ కేటీఆర్, హరీశ్‌రావు దగ్గరుండి పర్యవేక్షించారు. అంతిమయాత్రలో మాగంటి పాడెను మోశారు. మాగంటి గోపీనాథ్, కేటీఆర్‌ల మధ్య రాజకీయపరంగానే కాకుండా కుటుంబ స్నేహ బంధం కూడా ఉంది. కేటీఆర్ కుమారుడు హిమాన్షు, మాగంటి కుమారుడు వాత్సల్యనాథ్ ఇద్దరు హైదరాబాద్‌లో కలిసి చదువుకున్నారు. మంచి స్నేహితులు కూడా. హిమాన్షు తరచూ మాగంటి నివాసానికి వచ్చేవారు. మాగంటి బీఆర్ఎస్‌లో చేరాక ఇరు కుటుంబాల మధ్య స్నేహ బంధం ఏర్పడింది. ఈ క్రమంలోనే మాగంటి ఆస్పత్రిలో ఉన్న సమయంలో ఆయన కుటుంబానికి కేటీఆర్ కుటుంబ సభ్యులు అండగా నిలిచారు. కేటీఆర్ సతీమణి శైలిమ మాగంటి కుటుంబ సభ్యులతోపాటు ఉండి ధైర్యం చెప్పారు. కేటీఆర్ విదేశీ పర్యటన కుదించుకుని తిరిగివచ్చారు. హిమాన్షు కూడా స్నేహితుడికి అండగా నిలిచేందుకు అమెరికా నుంచి వచ్చారు. ఆస్పత్రి నుంచి అంత్యక్రియలు పూర్తయ్యేవరకు వాత్సల్యనాథ్ వెంటే ఉన్నారు. కాగా, మాగంటి మృతి బాధాకరమని, బీఆర్ఎస్‌కు తీరని లోటు అని కేటీఆర్ పేర్కొన్నారు. అంచెలంచెలుగా రాజకీయాల్లో ఎదిగిన మాగంటి జీవితం ఆదర్శనీయమని హరీశ్‌రావు చెప్పారు.



గోపీనాథ్‌కు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



గోపీనాథ్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మంత్రి లోకేశ్, సునీతా లక్ష్మారెడ్డి

గవర్నర్, రేవంత్, ప్రముఖుల నివాళి

మాగంటి మృతిపట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మాగంటి గోపీనాథ్ మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాగంటి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాగంటి రాజకీయ ప్రస్థానం టీడీపీతో ప్రారంభమైందని ఏపీ సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు మాగంటి మృతిపట్ల సంతాపం తెలిపారు. కాగా, మాగంటి గోపీనాథ్ మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అని ఏపీ మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ చెప్పారు. ఆయన మాగంటి భౌతికకాయం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బుల్లెట్ ర్యాలీతో ఆకట్టుకుని

ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన 1983లోనే మాగంటి ఆ పార్టీలో చేరారు. క్రమంగా ఎన్టీఆర్ వ్యక్తిగత బృందంలో సభ్యుడిగా మారారు. 1984లో రాజకీయ సంక్షోభంతో ఎన్టీఆర్ సీఎం పదవి కోల్పోయిన సమయంలో, 1985 ఎన్నికల్లో భారీ విజయం సాధించి తిరిగి సీఎంగా పదవి చేపట్టినప్పుడు.. మాగంటి తీసిన బుల్లెట్ బైకుల ర్యాలీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ ప్రచారంలో భాగంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు కూడా మాగంటి తన బృందంతో కలిసి పాల్గొన్నట్టు టీడీపీ నేతలు చెబుతుంటారు. ఉత్తరప్రదేశ్‌లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎన్టీఆర్ వాహనం ముందు బుల్లెట్ బైకులతో ర్యాలీగా వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి తమిళనాడు సీఎం రాంచంద్రన్ తన వద్దకు మాగంటిని పిలిపించుకుని బుల్లెట్ ర్యాలీ చేసి చూపించాలని కోరారు. ఆ ర్యాలీ చూసి అభినందించారు.



గోపీనాథ్ అంతిమ యాత్రలో పాల్గొన్న రాజకీయ నేతలు, ప్రజలు

ఎన్టీఆర్ అస్థికలను మోసి..

ఎన్టీఆర్ మరణం మాగంటిని తీవ్రంగా కలచివేసింది. నాడు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాక ఎన్టీఆర్ అస్థికలు ఉన్న కుండను బంజారాహిల్స్ ఇంట్లో భద్రపరిచారు. ఆ కుండను మాగంటి గోపీనాథ్ స్వయంగా నెత్తిన పెట్టుకొని బయటికి తీసుకువచ్చి ఊరేగింపుగా వాహనంలో పెట్టారు. ఎన్టీఆర్ అస్తికలు ముట్టుకునే అవకాశం దక్కడం తాను ఎప్పటికీ మరవలేనని మాగంటి చెప్పేవారు. ఆ సమయంలో తీసిన ఫొటోలను ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ స్మరించుకునేవారు.



కాంగ్రెస్‌కు మరో 'ఉప' పరీక్ష!

- నాడు లాస్య.. నేడు మాగంటి
- ఎమ్మెల్యేల మృతితో ఉప ఎన్నికలు
- ఇద్దరూ బీఆర్ఎస్ పార్టీ సభ్యులే

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంట గోపీనాథ్ అకాల మరణంతో మరో ఉప ఎన్నిక ఖాయమైంది. అయితే కంటోన్మెంట్ ఉప ఎన్నికల పరీక్షలో నెగ్గిన అధికార కాంగ్రెస్ పార్టీ.. జూబ్లీహిల్స్‌లోనూ పాగా వేయాలనే పట్టుదలతో ఉంది. దానికి అనుగుణంగా వ్యూహరచనకూ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్ జిల్లాలో ఒక్క సీటు కూడా దక్కలేదు. ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. అదే సమయంలో.. ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. బీఆర్ఎస్ సిటింగ్ సీటును కైవసం చేసుకోవడం అప్పట్లో కాంగ్రెస్‌కు పెద్ద ఊరటనిచ్చింది. జూబ్లీహిల్స్ సీటునూ గెలుచుకుని హైదరాబాద్‌లో పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి మజ్లిస్ అన్ని విధాలుగా సహకరిస్తూ వస్తోంది. మజ్లిస్ సహకారంతో జూబ్లీహిల్స్ సీటును సునాయాసంగా కైవసం చేసుకోవచ్చునన్న అంచనాతో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు. అయితే.. ఇక్కడి నుంచి అభ్యర్థిగా కమ్మ సామాజిక వర్గం నేతను దించితే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా.. యాదవ సామాజిక వర్గ నేత పేరునూ పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద గల్లంతైన ఆరుగురి మృతదేహాలు లభ్యం

- 7 గంటలు శ్రమించి వెలికితీసిన రెస్క్యూ బృందాలు

మహదేవపూర్ రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నదిలో శనివారం సాయంత్రం గల్లంతైన ఆరుగురి మృతదేహాలు ఆదివారం ఉదయం లభ్యమయ్యాయి. శనివారం రాత్రే రెస్క్యూ బృందాలు గల్లంతైన వారి కోసం వెతికేందుకు ప్రయత్నించినా.. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో వీలు కాలేదు. ఉదయం 5.41 గంటలకు మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన తొగరి రక్షిత్(13) మృతదేహం లభ్యమవగా.. 6.50 గంటలకు మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీపీ)కి చెందిన పసుల రాహుల్(18) మృతదేహాన్ని వెలికితీశారు. సుమారు మూడు గంటల తర్వాత ఉదయం 9.45 గంటలకు మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన కర్నాల సాగర్(16) మృతదేహం దొరికింది. 10.07 గంటలకు అంబట్‌పల్లికి చెందిన పట్టి మధుసూదన్(18), 11.16 గంటలకు మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెద్ల రాంచరణ్(17), చివరగా ఉదయం 11.45గంటలకు అంబట్‌పల్లికి చెందిన పట్టి శివమనోజ్(15) మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఆపరేషన్‌లో రెస్క్యూ బృందాలు సుమారు 7 గంటల పాటు శ్రమించాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం వారి కుటుంబాలకు అప్పగించారు. చేతికందిన కుమారులు చేజారిపోవడాన్ని జీర్ణించుకోలేని బాధిత కుటుంబాలు.. రోదించిన తీరు అక్కడున్నవారిని కలచివేసింది. వారిని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు పరామర్శించారు. ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

గీసుగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పంట సాగు కోసం చేసిన అప్పులను తీర్చలేక పురుగుల మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం రెడ్డిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. రెడ్డిపాలెంకు చెందిన వరగాని సత్యం(40) కొన్నేళ్లుగా రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మరోవైపు తన భార్య అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. దీంతో వ్యవసాయానికి, భార్య ఆసుపత్రి ఖర్చులకు రూ.6 లక్షల వరకు అప్పుచేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురైయ్యాడు. ఆ బాధతో ఈ నెల 1న మొగిలిచర్ల శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సత్యం చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.



సత్యం (ఫైల్)



జెడ్డీ కట్టి.. గర్భిణిని 3 కి.మీ మోసుకెళ్లి

పినపాక, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అటవీ గ్రామాల్లో సరైన రోడ్డు మార్గాలు లేకపోవడంతో గర్భిణులకు కష్టాలు తప్పడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం టి కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఉమేశ్ చంద్ర నగర్‌లో ఆదివారం ఓ గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడ్డారు. వలస ఆదివాసీ గ్రామానికి చెందిన గర్భిణి జానకికి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో భర్త సమ్మయ్య 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. అయితే గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 108వాహనం 3 కి. మీ. దూరంలో నిలిచిపోయింది. దాంతో కుటుంబ సభ్యులు గర్భిణిని జెడ్డీ కట్టి మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచి మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత ఆమె రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన వైద్యులు వెంటనే జానకిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అతివలకు 'అపెరల్' ఆసరా !

- ఉపాధిని అందిస్తున్న అపెరల్ పార్కు
- లబ్ధి పొందుతున్న 3,600 మంది మహిళలు
- సిరిసిల్లకు వస్తున్న అంతర్జాతీయ కంపెనీలు

సిరిసిల్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టెడన్నం కోసం రేయింబవళ్లు బీడీలు చుట్టిన ఆ చేతుల్లో ఇప్పుడు అందమైన వస్త్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. నాడు అరకొర సంపాదనతో కుటుంబ పోషణ భారమై.. నిర్జీవంగా మారిన ఆ మోముల్లో ఇప్పుడు జీవ కళ ఉట్టిపడుతోంది. సిరిసిల్ల మహిళలకు ఇక్కడి అపెరల్ పార్కు ఆసరాగా నిలుస్తోంది. జిల్లా కేంద్రం శివారులోని సర్దాపూర్- పెద్దూర్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఈ పార్కులోని గార్మెంట్ పరిశ్రమలు ప్రస్తుతం 3,600 మందికి పైగా మహిళలకు ఉపాధిని అందిస్తున్నాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా ఇక్కడి అపెరల్ పార్కు మహిళా కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ. 174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యాలయాలు, పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ఇక్కడకు తరలివస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఓ కంపెనీ ప్రారంభం కాగా, కాంగ్రెస్ సర్కారు ఏర్పడగానే మరో పరిశ్రమ ఉత్పత్తులు ప్రారంభించింది. 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించగా ప్రస్తుతం దాదాపు 1600 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సంస్థ ఇక్కడ ఉత్పత్తి చేసిన రెడీమేడ్ వస్త్రాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. రెండు నెలల క్రితం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బెంగుళూర్‌కు చెందిన టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్ కూడా అపెరల్ పార్కులో ఉత్పత్తులు ప్రారంభించింది. ఏడెకరాల్లో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్ ఏర్పాటు కాగా, ఈ కంపెనీ యూనిట్ ద్వారా రెండు వేల మందికి పైగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. మరోవైపు, ఇక్కడ మహిళలకు ఉపాధి కల్పించే దిశగా జూకీ కుట్టుమిషన్లపై శిక్షణ కొనసాగుతోంది.



నిజామాబాద్ జిల్లా వర్నిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

నిజాంసాగర్ ఆయకట్టులో వరి నాట్లు షురూ

నిజాంసాగర్ ఆయకట్టు కింద కొన్ని మండలాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని మోస్రా, చందూర్, వర్ని, రుద్రూర్, కోటగిరి, కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలోని రైతులు ఆదివారం వరి నాట్లు ప్రారంభించారు. నిజాంసాగర్ కాలువలు, బోర్ల కింద కొన్నేళ్లుగా జూన్ ఆరంభంలోనే నాట్లు వేయడం పరిపాటిగా మారింది. ముందస్తుగా నాట్లు వేస్తే నీళ్ల సమస్య ఉండదని, యాసంగి పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని ఇక్కడి రైతులు చెబుతున్నారు. స్థానిక కూలీలు అందుబాటులో లేకపోవడంతో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిసా కూలీలకు ఎకరాకు రూ.4వేలు ఇచ్చి నాట్లు వేయిస్తున్నారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నిజామాబాద్

ప్రియురాలి మృతిని తట్టుకోలేక ప్రియుడి ఆత్మహత్య

- ఇద్దరూ వివాహితులు.. వారి మధ్య వివాహేతర సంబంధం

హవేళీఘణపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న ఇద్దరు వివాహితులు ఒకరి తర్వాత మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. తొలుత ప్రియురాలు ఆత్మహత్య చేసుకోగా.. ఆమె అంత్యక్రియలు జరిగే లోపే ప్రియుడు కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లాలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లాలోని హవేళీఘనపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన నరేష్ (31) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన మరో వివాహితతో అతనికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. సదరు వివాహితకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి వ్యవహారం బయటపడడంతో గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. అయితే, కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న సదరు వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జూన్ 2న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. మరుసటి రోజు ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ఆమెను గమనించి ఆస్పత్రికి తరలించగా.. నాటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె శనివారం రాత్రి మరణించింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె ప్రియుడు నరేష్.. తన ప్రియురాలి దహన సంస్కారాలు జరుగుతున్న సమయంలోనే లింగ్సాన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో ఉరి వేసుకున్నాడు. నరేష్ మృతిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కానీ, మహిళ ఆత్మహత్యపై ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తొమ్మిదేళ్ల బాలికపై హత్యాచారం?

- ఢిల్లీలోని దయాల్‌పూర్‌లో దారుణం
- ఓ ఇంట్లో సూట్‌కేసులో మృతదేహం లభ్యం

న్యూఢిల్లీ, జూన్ 8: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఘోరం జరిగింది. లైంగిక దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన తొమ్మిదేళ్ల బాలిక.. తన ఇంటికి సమీపంలోని మరో ఇంట్లోని సూట్‌కేస్‌లో శవమై కనిపించింది. న్యూఢిల్లీలోని దయాల్‌పూర్ ప్రాంతంలో శనివారం రాత్రి వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. దయాల్‌పూర్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక తమ ఇంటికి సమీపంలో నివసించే బంధువులకు ఐసు ముక్కలు ఇచ్చేందుకు శనివారం సాయంత్రం ఏడు గంటలప్పుడు వెళ్లింది. బాలిక ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఆమెను వెతుక్కుంటూ బంధువుల ఇంటికి వెళ్లాడు. తమ ఇంటికి వచ్చిన ఐదు నిమిషాల్లోనే బాలిక వెళ్లిపోయిందని వారు చెప్పగా.. తండ్రి, ఇతర కుటుంబసభ్యులు బాలిక కోసం గాలించారు. అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లోకి చిన్నారి వెళ్లడం చూశామని పలువురు చెప్పారు. దీంతో బాలిక తండ్రి అక్కడికి వెళ్లేసరికి ఆ ఇంటికి తాళం వేసి ఉండగా.. పరిస్థితులు అనుమానాస్పదంగా ఉండడంతో తాళం పగలుగొట్టి లోపలికి వెళ్లారు. ఆ ఇంట్లోని ఓ గదిలో రక్తం మరకలతో ఉన్న ఓ సూట్‌కేసు కనిపించడంతో దానిని తెరిచి చూడగా.. బాలిక కనిపించింది. రక్త గాయాలతో సూట్‌కేసులో అపస్మారక స్థితిలో బాలికను తండ్రి హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. బాలిక అప్పటికే మరణించిందని వైద్యులు చెప్పారు. బాలిక శరీరంపై ఉన్న గాయాల ఆధారంగా లైంగిక దాడి జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. బాలిక మృతదేహం దొరికిన ఇంట్లోని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సుహాస్‌శెట్టి హత్య కేసు ఎన్ఐఏకు

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి హత్యకేసును ఎన్ఐఏకు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. సుహాస్‌శెట్టిపై రౌడీషీట్ కూడా ఉండేది. ఇంటి వద్ద ఉన్న సుహాస్‌శెట్టిని ఓ యువతి ద్వారా ఫోన్ చేయించి దాబా వద్దకు రప్పించి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. మంగళూరు సీసీబీ విభాగం ఈ కేసును విచారిస్తోంది. ఇప్పటి వరకు 12మంది నిందితులను అరెస్టు చేశారు.

తండ్రికి కిడ్నీ సమస్యలు అప్పు తీర్చేందుకు కానిస్టేబుల్ డ్రగ్స్ దందా

- ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ తీరు
- ఉద్యోగం తీసేసిన ఏపీ పోలీసులు
- గుర్తించలేకపోయిన డీఎస్పీపై బదిలీ వేటు
- కూకట్‌పల్లి డ్రగ్స్ కేసులో ట్విస్టులు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీసులు సీజ్ చేసిన రూ.కోటి విలువైన కొకైన్, ఎపిడ్రిన్ డ్రగ్స్ కేసులో అరెస్టయిన ఏఆర్ కానిస్టేబుల్‌ను ఏపీ పోలీసు విభాగం సర్వీసు నుంచి తొలగించింది. తండ్రికి కిడ్నీ సమస్యలు ఉండడంతో.. చికిత్స కోసం రూ.10 లక్షల మేర అప్పు చేసిన గుణశేఖర్.. రుణాన్ని తీర్చేందుకు డ్రగ్స్ ముఠాతో జతకట్టినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. గుణశేఖర్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో పనిచేస్తుండగా.. తాను గురువుగా భావించే ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌తో అన్ని సమస్యలు చెప్పుకొనేవాడు. ఈ క్రమంలో తండ్రి చికిత్స కోసం సుదీర్ఘంగా సిక్‌లీవ్ పెట్టిన గుణశేఖర్.. సురేందర్ అనే వ్యక్తి వద్ద చేసిన రూ.10 లక్షల అప్పును తీర్చేందుకు మార్గం చూపాలని వేడుకున్నాడు. ఈ క్రమంలో ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి తన వద్ద రూ. కోటి విలువైన డ్రగ్స్ ఉన్నాయని, డ్రగ్స్ పెడ్లర్లు ఎవరైనా తెలిస్తే.. వారికి అప్పగించి, కమీషన్ ఇస్తానని రాంచందర్‌ను కోరాడు. దాంతో రాంచందర్ ఈ విషయాన్ని గుణశేఖర్‌కు చెప్పి, ఈశ్వర్‌రెడ్డిని పరిచయం చేశాడు. అప్పుతీర్చే మార్గం దొరికిందని భావించిన గుణశేఖర్.. ఇదే విషయాన్ని సురేందర్‌కు చెప్పి, డ్రగ్స్‌ని అమ్మిపెడితే కమీషన్ వస్తుందని చెప్పాడు. దాంతో సురేందర్ తన స్నేహితులైన హరిబాబురెడ్డి, మెర్రీ మార్గరేట్, షేక్ మస్తాన్ వలీ, దేవరాజు ఏసుబాబుతో కలిసి ముఠాను తయారు చేశాడు. ఈ క్రమంలో గత నెల 29న కూకట్‌పల్లిలో డ్రగ్స్ విక్రయానికి సిద్ధమవ్వగా.. ఉప్పందుకున్న పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.కోటి విలువ చేసే డ్రగ్స్‌ను సీజ్ చేశారు. నిందితులను విచారించగా.. గుణశేఖర్, రాంచందర్ పాత్రలు వెలుగులోకి వచ్చాయి. సమాచారం అందుకున్న ఏపీ పోలీసులు, గుణశేఖర్‌ను సర్వీసు నుంచి తొలగించారు. గుణశేఖర్, రాంచందర్ డ్రగ్స్ దందాలో ఉన్న గుర్తించనందుకు.. వారి డీఎస్పీని బదిలీ చేశారు. కాగా, కేసు మూలాలు కర్ణాటకలో ఉన్నట్లు కూకట్‌పల్లి పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. దీంతో టీజీ న్యాబ్ రంగంలోకి దిగింది. ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వీరు అరెస్టయితే.. బెంగళూరులో ఉండే కింగ్‌పిన్, నైజీరియన్ స్మగ్లర్లతో లింకులను గుర్తించే అవకాశాలున్నాయని టీజీ న్యాబ్ అధికారులు భావిస్తున్నారు.



గుణశేఖర్

దిగులు చూపుల పద్యం



పిల్ల, హాస్టల్ కెళుతోంది
కురవడానికి సిద్ధంగా ఉన్న
మేఘంలా ఉంది నా ముఖం
వాళ్ళ అమ్మ ముఖంలో
తీగల మీద వాలిన
జిట్టపిట్టల్లా కన్నీళ్లు

మా రాత్రులు గుర్తుకొస్తున్నాయ్
మాటలతో పండిన రాత్రులు
అలా వంగి
మా ఇంట్లో వినిపించే కథలు విన్న



చంద్రుడు
కిటికీలో నుంచి
లోపలికి తొంగి చూసే
మనోరంజ మొక్క

మా ఉదయాలు
జ్ఞప్తికొస్తున్నాయ్

టీ తాగుతున్నప్పుడు
మాతో కలిసి
కిరణాల గుడికట్టిన సూర్యుడు
ఎదురింటి అద్దాల నీడతో అల్లిన బొమ్మ

మా కబుర్లు వింటూ
ఆనందించిన నీడలు
మెరుగుపడ్డ క్షణాలు



ఈ రాత్రికి
మాతో పాటే చంద్రుడికి నిద్ర పట్టదు
కోడిపిల్లల్లా కదిలే చుక్కలు
మా ఇద్దరి మధ్య
ఖాళీలో దిగులు కదులుతోంది

హాస్టల్ కిటికీ లోనుంచి
ఒక జత కళ్ళు బయటకు చూస్తున్నట్టే
ఇంటి
తలుపు తీయడానికి
నాలుగు చేతులు
ఉవిళ్ళూరుతుంటాయి

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547



రాజకీయఖైదీల గొంతుకలతో పుస్తకం

'చందమామను ఎంత కాలం బందీ చెయ్యగలరు – భారతీయ రాజకీయ ఖైదీల గొంతుకలు' (రచన: సుచిత్ర విజయన్, ఫ్రాన్సెస్కా రెకియా; అనువాదం: కె. సురేష్) పుస్తకం ఆవిష్కరణ సభ జూన్ 11, సా.5.30గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి ప్రకాష్ రాజ్; సభాధ్యక్షులు యాకూబ్; పుస్తక పరిచయం ఎన్. వేణుగోపాల్; వక్తలు ఘంటా చక్రపాణి, కల్పనా కన్నబిరన్, ఖలీదా పర్వీన్; వందన సమర్పణ మలుపు బాల్‌రెడ్డి.

మలుపు బుక్స్

ఉత్తమ గ్రంథ పురస్కారాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాల ప్రదానోత్సవం జూన్ 11 సా.5.30గంటలకు తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి గుత్తా సుఖేందర్ రెడ్డి, అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి, సమన్వయకర్త రింగు రామ్మూర్తి. ఉత్తమ గ్రంథ పురస్కారాలను కాంచనపల్లి గోవర్ధనరాజు, ఉదారి నారాయణ, రామాచంద్రమౌళి, కాలువ మల్లయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, సంగనభట్ల నర్సయ్య, అమరవాది నీరజ; వరిష్ఠ పురస్కారాలను రంగరాజు పద్మజ, ఎలనాగ, ఎస్. ఆర్. వెంకటేశం, రూప్ కుమార్ డబ్బీకార్ అందుకుంటారు.

జె. చెన్నయ్య

సోమవారం 9 జూన్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

రెండుతరాల కవిసంగమం

రెండుతరాల కవిసంగమం సీజన్ – 2, సిరీస్ – 41 జూన్ 14 సా.6గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొను కవులు: లక్ష్మీనరసయ్య గుంటూరు, తుల శ్రీనివాస్, రూప రుక్మిణి, జబ్బు వెంకటేష్, చుక్క వంశీ

యాకూబ్

'అల్లిక' కవితా సంపుటి

చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి 'అల్లిక' ఆవిష్కరణ సభ జూన్ 15 సా.5గంటలకు బాలోత్సవ్ భవన్, రెండో అంతస్తు, విజయవాడలో జరుగుతుంది. వక్తలు: జి. లక్ష్మీనరసయ్య, శిఖామణి, యాకూబ్, గూడురు సీతామాలక్ష్మి, నూకతోటి రవికుమార్, షేక్ కరీముల్లా, దుప్పల రవికుమార్ తదితరులు పాల్గొంటారు.

బహుజన రచయితల వేదిక

'జీవన సౌరభాలు' పద్య సంపుటి

ఓలేటి ఉమా సరస్వతి పద్య కవితా సంపుటి 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ సభ జూన్ 15 సా.5:30 నిమిషాలకు బుక్ ఫెస్టివల్ సొసైటీ మీటింగ్ హాల్, విజయవాడలో జరుగుతుంది. అధ్యక్షత గుత్తికొండ సుబ్బారావు, ఆవిష్కర్త మండలి బుద్ధ ప్రసాద్, పుస్తక సమీక్ష గుమ్మా సాంబశివరావు, గౌరవ అతిథి జి.వి. పూర్ణచందు. వివరాలకు: 9247475975.

చలపాక ప్రకాష్

తెలుగు నేల దాటుతున్న 'కొండపొలం'

మేత దొరకని కాలంలో గొర్రెలను నెలా నెలన్నర పాటు నల్లమల అడవుల్లో మేపటానికి పోయే గొర్ల కాపర్ల జీవితం చుట్టూ అల్లిన నవల 'కొండ పొలం'. సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి రాసిన ఈ నవల 2019 'తానా' నవలల పోటీలో రెండు లక్షల రూపాయల బహుమతిని గెలుచుకుంది. 2021లో క్రిష్ దర్శకత్వంలో సినిమాగా కూడా వచ్చింది. ఇప్పుడు ప్రముఖ అంతర్జాతీయ ప్రచురణ సంస్థ 'Bloomsbury' ఈ నవలకు ఇంగ్లీష్ అనువాదాన్ని జూన్ 3న విడుదల చేసింది. ఈ సందర్భంగా నవలను అనువదించిన **నరసింహ కుమార్**‌తో 'వివిధ' జరిపిన సంభాషణ ఇది:



'కొండపొలం' నవల అనువదించాలీ అని ఎందుకు అనిపించింది?

'కొండ పొలం' నవలకి మొట్ట మొదటి సమీక్ష తెలుగులో కంటే ముందే, నేను ఇంగ్లీష్‌లో ఫేస్‌బుక్‌లో రాశాను. అందులో ఇంత గొప్ప నవల, అందులో వర్ణించబడిన జీవన విధానం, ప్రకృతి పట్ల వెలిబుచ్చిన భారతీయ జీవన దృక్పథం – ఇంకా ఎక్కువమందికి చేరాలంటే, ఆంగ్లంలోకి అనువదిస్తే బాగుంటుంది అని రాశాను. నా సమీక్షకు కృతజ్ఞతలు తెలుపుతూ వెంకటరామి రెడ్డి గారు 'ఆ పని మీరే ఎందుకు చేయకూడదు,' అన్నారు. అలా ఈ అనువాదానికి బీజం పడింది.

మనిషి–ప్రకృతుల మధ్య సంఘర్షణ గురించి ఇతర భాషల్లో చాలా నవలలు వచ్చాయి. హెర్మన్ మెల్విల్ 'మోబి–డిక్', హెమ్మింగ్వే 'ది ఓల్డ్ మాన్ అండ్ ద సీ' లాంటి రచనల్లో మనిషి ప్రకృతితో యుద్ధం చేస్తాడు. ఈ రెండు నవలలు పాశ్చాత్య దృక్కోణానికి archetypes (మూల రూపాల) వంటివి. ఈ భూ ప్రపంచంలో మనిషే ఉత్తమ జీవి, మనిషి తన ఆధిపత్యం కోసం మిగిలిన జీవరాశులను ఎక్స్‌ప్లాయిట్ చేయడంలో ఏ తప్పూ లేదు – అన్న దృక్పథం యిది. 'కొండ పొలం' నవల ఇందుకు విరుద్ధంగా ప్రకృతి పట్ల భారతీయ తత్వ చింతనను పరిచయం చేస్తుంది.

గొల్ల, యానాదుల దృక్కోణంలో చెప్పటంతో కథనానికి, వర్ణనలకు ఒక ప్రామాణికత అబ్బింది. నీటి వెతలు, చందనం దొంగల సమస్య, గ్రామాల్లో కుల రాజకీయాలు, ప్రజలు నమ్మే అవధూతలు, దేవతలు, దేవుళ్ళు, వన్యమృగాలు, రకరకాల చెట్లు, ఔషధ మొక్కలు... ఒక్క మాటలో చెప్పాలంటే, మనకు ఎంతో దగ్గరగా ఉన్నా అస్సలు పరిచయంలేని ఒక జీవన శైలిని మనకు చేరువగా తీసుకువస్తుంది. ఒక కొత్త, మార్మిక లోకం లోకి తీసుకెళ్తుంది. కథానాయకుని అద్భుతమైన క్యారెక్టర్ ఆర్క్ కనబడుతుంది. ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలూ ఉన్నాయి. ఇలాంటి వివిధ పార్శ్వాల సార్వత్రిక విలువలు ఉన్న కథ తెలుగులో రావడం మన అదృష్టమైతే, దాన్ని వేరే భాషల్లోకి తీసుకువెళ్లడం మన బాధ్యత అని నేను భావిస్తాను.

స్థానీయ అంశాలు బాగా ఎక్కువ ఉన్న ఈ నవలను అనువదించటంలో ఎదురైన సవాళ్లు ఏమిటి?





ఈ నవల అనువదించటంలో ఎదురైన ముఖ్యమైన సవాలు– నల్లమల పరిసర ప్రాంతాల్లో వాడే జాతీయాలు, పలుకుబడులు, సామెతలు, culture specificity (సాంస్కృతిక విశిష్టత) ఉన్న పేర్లు (ఉదా: ఓబులం, కాశినాయన) లాంటి వాటిని నాన్–తెలుగు పాఠకులకు అర్థమయ్యేలా, కానీ ఆంగ్లంలో కృతకంగా ఉండకుండా, అలాగే కథ, వర్ణన, పాత్రల ఆత్మ (soul)కి భంగం కలగకుండా చూసుకోవడం. బ్రౌణ్య నిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘంటువు ఉపయోగపడ్డాయి. నేను కడప జిల్లావాడిని కావడం, నంద్యాల, మహానంది, అహోబిలం, శ్రీశైలం ప్రాంతాలతో అనుబంధం ఉండడం కూడా పనికి వచ్చింది. అవసరమైనప్పుడల్లా, రచయితతో ఫోన్‌లో మాట్లాడగలగడం ఒక పెద్ద ఆసరా. ఆయనతో మాట్లాడినప్పుడల్లా ఒక జీవ శాస్త్ర నిపుణునితో, ఒక తత్వవేత్తతో చర్చించినట్టు ఉండేది.

కొన్ని విషయాల్లో ఆంగ్లంలోకి అనువాదమైన ఇతర పుస్తకాలు గమనించి, ఆ పద్ధతులు (బెస్ట్ ప్రాక్టీసెస్) పాటించడానికి ప్రయత్నించాను. ఉదాహరణకి నల్లమల అడవుల్లో ప్రతి కొండకి, కోనకి, వాగుకి, వంకకి, పచ్చిక బయళ్ళకు, రాళ్ళగుట్టలకు, స్థానికంగా పేర్లు ఉంటాయి. ఆ పేర్లను కొన్ని చోట్ల అలాగే ఉంచడం, కొన్ని చోట్ల ఇంగ్లీషు లోకి అనువదించడం ద్వారా ఆ స్థానిక నామంలో ఉండే కవితాత్మకత పాఠకులకి తెలియబర్చడం చేశాను.

అంతర్జాతీయ పబ్లిషర్ 'బ్లూమ్స్‌బరీ'ని మీ అనువాదంతో ఎలా అప్రోచ్ అయ్యారు?

నేను అనువాదం మొదలు పెట్టినప్పుడే, ఒక ప్రఖ్యాత పబ్లిషర్ అయితేనే ఈ నవల ఎక్కువమంది నాన్–తెలుగు పాఠకులకు చేరుతుంది కాబట్టి, ఆలస్యమైనా సరే ఆ దిశగానే ప్రయత్నం చేయాలని అనుకున్నాను. పబ్లిషింగ్ రంగంలోని ఒక మిత్రుని సలహా మేరకు ప్రపోజల్ తయారు చేసుకుని, ముందుగా ఒక బ్లూమ్స్‌బరీ ఎడిటర్‌ని ఫోన్ ద్వారా సంప్రదించి, తర్వాత నా ప్రపోజల్ పంపాను. కలిసి వచ్చిన విషయం ఏమంటే, బ్లూమ్స్‌బరీ వాళ్ళు భారతీయ భాషల్లో నుంచి మంచి పుస్తకాలు ఎన్నుకుని అనువాదం చేయించాలీ అన్న ఆలోచనలో ఉన్నప్పుడే, కాకతాళీయంగా నేను వారిని సంప్రదించాను. బ్లూమ్స్‌బరీ ఇండియా టీంలో చదివిన అందరికీ ఈ నవల నచ్చింది. కానీ, కాంట్రాక్టు బ్లూమ్స్‌బరీ యుకె సంస్థ చేతుల్లో ఉంటుంది, కాబట్టి అఫిషియల్‌గా నాకూ రెడ్డిగారికి ఆఫర్ ఇవ్వటానికి కొన్ని నెలలు పట్టింది. బ్లూమ్స్‌బరీ సంస్థ తెలుగు నుంచి ప్రచురిస్తున్న మొదటి నవల ఇదే. దీని వలన, ఇదే మార్గంలో మరిన్ని తెలుగు పుస్తకాలు కొత్త పాఠకులని ఏర్పర్చుకుంటాయని నా ఆశ.

ఎడిటింగ్ ప్రాసెస్ ఎలా జరిగింది?

ఫిక్షన్, ముఖ్యంగా నవలలకు ఎడిటింగ్ ప్రాసెస్ చాలా విస్తృతంగా వుంటుంది. బ్లూమ్స్‌బరీ సంస్థలో చీఫ్ ఫిక్షన్ ఎడిటర్ శివప్రియ మొదట మాన్యుస్క్రిప్ట్ మొత్తం చదివి, నోట్స్ పంపారు. ఈ మొదటి దశలో ముఖ్యంగా నవల స్ట్రక్చర్ గురించి చర్చించాం. నేను ఎక్కువ ఫుట్‌నోట్స్ వాడాను. వాటిని తీసేసి కథనంలో భాగంగా ఎలా కూర్చాలో ఎడిటర్ మంచి సలహాలు ఇచ్చారు. తరువాత దశలో, మొదట ఒక ఎడిటర్ మొత్తం నవలని ఎడిట్ చేస్తూ, ఒక్కోసారి రెండు మూడు అధ్యాయాల చొప్పున పంపించడం, నేను ఆ ఎడిట్స్‌ని ఒప్పుకోవడం, లేదా ఒప్పుకోకపోవడం, వాళ్ళు అడిగే ప్రశ్నలకి నా సమాధానాలు, సందేహాలకు క్లారిఫికేషన్స్ – ఇలా కొన్ని నెలలపాటు నడిచింది. ఈ ప్రక్రియ తరువాత ఇంకో ఎడిటర్ లైన్ బై లైన్ ఎడిట్స్ చేయగా, వారితో కలిసి నేను ఫైనలైజ్ చేశాను. శివప్రియ మళ్ళీ చివరిలో ఒకసారి, తానూ, తన టీం మెంబర్‌తో కలిసి ఇంకొక రివ్యూ చేసి, ఇంకొన్ని ప్రశ్నలు అడిగారు. ఒక్కోసారి ఒక్క సామెత వారికి అర్థం అయ్యేలా చెప్పడానికి రెండు ఫోన్ కాల్స్ అవసరం అయ్యేవి. వాళ్ళు అడిగిన ప్రశ్నలు నన్ను మరింత ఆలోచింపజేసి, నవలకి మంచి బిగువు వచ్చింది. ఈ క్రమంలో ముద్రణ ఆలస్యమైనా, పనిలో వారికి ఉన్న నిబద్ధత, ఓపిక, రచయిత పట్ల అనువాదకుల పట్ల వారు చూపించిన గౌరవం – ఇవన్నీ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చాయి.

ఎడిటింగ్ ప్రాసెస్‌లో భాగంగా పబ్లిషర్ ఒక ముగ్గురు ప్రముఖ రచయితలకి ఇచ్చి అభిప్రాయం అడిగారు. వారిలో ఒకరు 'గోట్ డేస్' నవలా రచయిత బెన్యామిన్ (ఈ నవల తెలుగులో 'మేక జీవితం'గా అనువాదమైంది). ముగ్గురు రచయితలూ పుస్తకానికి గొప్ప ప్రశంసలు ఇచ్చారు.

మీరు చేయాలనుకుంటున్న ఇతర ప్రాజెక్టులు ఏమిటి?

ప్రస్తుతం సన్నపురెడ్డి గారిదే 'ఒంటరి' నవల అనువాదం మొదలుపెట్టాను. దానితో పాటు, నాకు ఇష్టమైన అమెరికన్ రచయిత, నోబుల్ గ్రహీత సాల్ బెల్లో రాసిన 'Seize the Day' అన్న నవలికని తెలుగులో రాస్తున్నాను. 'బోయ కొట్టములు పండ్రెండు' అన్న ఒక చారిత్రక నవలని అనువదించాలని వుంది. ఇవన్నీ గాక నా సొంత కథల పుస్తకం తేవాలని ఉంది. ■

బాకీ తీర్చుకొంటున్నా!

నాకిది కొత్త అనుభూతి. కొండపొలం నవల మొదట్నించీ కొత్త కొత్త అనుభూతుల్ని అందిస్తూనే వుంది. దృశ్యాల్ని వాక్యాలుగా మార్చి పేజీల్లో పొదిగించి నవలగా తీర్చిన దాన్ని, తిరిగి దృశ్యాలుగా మార్చి సినిమాగా రూపాంతరం చెందించి పాఠకుల్ని ప్రేక్షకులుగా మార్చటం చూశాను. ఇప్పుడు మళ్లీ నేను చూసిన నవలల్లోని గొర్లకాపరుల జీవితాలకు సంబంధించిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తం కావడాన్ని చూడబోతున్నాను. 'మోబిడిక్', 'ఓల్డ్ మ్యాన్ అండ్ ద సీ' వంటి నవలల్లో ప్రకృతి మీద పైచేయి సాధించేందుకు మనిషి చేసిన యుద్ధాల్ని చూశాను. సోవియట్ రష్యా సాహిత్యంలో యుద్ధం కలిగించిన విధ్వంసాల నేపథ్యంలో అక్కడి ప్రజల బతుకు పోరాటాల్ని చూశాను. అమెరికన్ సాహిత్యంలోని నీగ్రోల బానిస సంకెళ్ళ చిటపటలు విన్నాను. మంగోలియా భూముల్లో శిరసెత్తిన ఆత్మాభిమానం జగజ్జేతగా జెండా ఎగరేయడం చదివాను. జపాన్ చైనా నేలల జెన్ తాత్విక జీవన విధానాన్ని చూశాను. ఇతర భాషల్లోంచి మన భాషలోకి అనువాదమై ప్రపంచపు నలుమూలల్లోని మట్టి వేదనల్ని మన చెవుల దాకా తెచ్చి వినిపించిన అనువాద సాహిత్యాన్ని చిన్నతనాన్నించి చదువుతూనే వున్నాను. వివిధ ప్రాంతాల్లో పుట్టిన సాహిత్యం నాకెంతో లోకజ్ఞానాన్ని ఇచ్చింది. అక్కడి రచయితల గొంతుకలు నాకు కొత్త చూపునిచ్చాయి. కొత్త ఆలోచనల్ని ఇచ్చాయి. కొత్త నైపుణ్యాలను ఇచ్చాయి. జీవితకాలం పాటు ఆ ప్రాంతాలకూ, ఆ మనుషులకూ బాకీ పడ్డదాన్ని తిరిగి ఇవ్వటంలో భాగంగానే నా 'కొండపొలం' నవల 'Tiger Lessons'గా ఆంగ్లానువాదమై తెలుగు నేలను దాటి ఇతర భాషా ప్రాంతాలకు వెళుతున్నదని నేను భావిస్తున్నాను. ఈ సందర్భంగా అనువాద మిత్రుడు నరసింహ కుమార్‌కూ, బ్లూమ్స్‌బరీ ప్రచురణ కర్తలకూ నా కృతజ్ఞతలు.



■ సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి



పంచుకున్న పుస్తకం

ఒకరు చదివి ఇచ్చిన పుస్తకం

గుళ్ళో ఇచ్చిన ప్రసాదాన్ని మిగిల్చి
ఇష్టమైన వాళ్ళ కోసం ఇంటికి తేవడం లాంటిది
తోకచుక్క రాలిపడుతుంటే
పక్కనున్నవాళ్ళని తట్టి చూపించడం లాంటిది
దూరాలనున్న ప్రేమికులు ఫోన్‌లో కబుర్లాడుకుంటూ
చందమామను ఇప్పుడే చూడమని గుసగుసలాడడం లాంటిది
వాళ్ళు కలిసి గుర్తు చేసుకోవాలనుకునే తీపిజ్ఞాపకం లాంటిది.

ఒకరు చదివి గుర్తులు పెట్టి ఇచ్చిన పుస్తకం,

నీలాంటి ఎవరో నీ కలలోకి రావడం లాంటిది
అనూహ్యంగా ఎవరో నీ గుప్పెట్లో పెట్టి మూసిన
ప్రేమలేఖ లాంటిది
అనుకోని ప్రయాణంలో కలిసి
అదాటున మనసుకు దగ్గరైన స్నేహం లాంటిది
చిట్టి పిట్ట మృదుత్వం నీకు అనుభవమవ్వడానికి
దాని ఈకనొకరు నీ చెంపల మీద రాయడం లాంటిది

ఒకరు చదివి, చదవమని ఇచ్చిన పుస్తకం

జగమంతా తిరిగినా తరిగిపోని
జాబిలి తునక వెలుగు లాంటిది. ఆ అనుభవం,
ఈ లోకంలో సూర్యోదయాలను చూడటానికి
దగ్గరి మిత్రులు కలిసి సముద్రాలకు వెళ్ళడం లాంటిది
ఎగసే ఒక సంతోష కెరటానికి ఎదురెళ్ళి
ఇద్దరు మనుషులు నిలువెల్లా తడిసిపోవడం లాంటిది.

■ మానస చామర్తి
✆ 79754 68091

'తానా – మంచి పుస్తకం: బొమ్మల కథలు' ఫలితాలు

పదేళ్ళ లోపు పిల్లలకు బొమ్మల కథలు ఆహ్వానిస్తూ తానా – మంచి పుస్తకం నిర్వహించిన పోటీలో ఈ రచయితల కథలు ఎంపికయ్యాయి: జె.వి.ఎస్. లక్ష్మి, ముంజులూరి కృష్ణకుమారి, బి. రవితేజ, శాఖమూరి శ్రీనివాస్, జాస్తి శివరామకృష్ణ. ఈ రచయితలు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున పారితోషికం అందుతుంది. పుస్తకాలను జులై 2025 నాటికి ప్రచురిస్తాం.

కె. సురేష్

తెలంగాణ జీవన స్పర్శ 'బాపు'

ఎవరికైనా తల్లిదండ్రులే ఆదర్శం. బిడ్డలకు వారే నిజమైన హీరోలు. హీరోలంటే 'రీల్' జీవితంలోని వారు కాదు, 'రియల్' జీవితంలోని వారు. ఆ తల్లిదండ్రులు లేని రోజొకటి వస్తుందనే విషయం ఊహకు కూడా రాదు. అకస్మాత్తుగా కన్నవారు దూరమైతే ఆ దుఃఖం ఎంత వేదనాభరితమో ఊహించాల్సిందే. గడ్డం సతీష్ పుస్తకం 'బాపు' అలాంటి వేదనాభరిత తలపోత.

గడ్డం సతీష్ తండ్రి రామస్వామి తెలంగాణ పల్లె పేద రైతు. తల్లి అజ్జిరవ్వ (వజ్రమ్మ). 30 గుంటల తరిపొలం, 10 గుంటల శెల్క (పెరడి)లో జీవితమంతా ఆ మట్టితోనే బతికిన పేద రైతు. ఆరుగాలం కష్టించి పనిచేసినా ఆ పూటకు ఎల్లదీసుకోవటమే కనాకష్టంగా జీవితాన్ని గడిపిన కష్టజీవి. ఉన్నొక్క బిడ్డ పెండ్లి కోసం తరిపొలాన్ని, కన్న కొడుకు కాలేజీ ఫీజు కోసం ఇంటి పైకప్పుగా ఉన్న రేకులను అమ్మిన కూలి రైతు. ఆయన జీవితాన్ని చెప్పే క్రమంలో తెలంగాణ జీవన సౌందర్యం ఈ పుస్తకం పేజీల నిండా పరుచుకున్నది.

'బాపు'లో విజువల్ ఫ్రేమ్ లన్నీ రవివర్మ గీసిన అందమైన సహజమైన తెలంగాణ జీవన చిత్రాల వంటివి. ఈ పుస్తకంలో ఉన్న ఇరవై రెండు దృశ్య ఖండికలలో మొదటి మూడు సతీష్ తండ్రి గడ్డం రామస్వామి స్మరణలో రాసినవి కాగా, తర్వాతి ఆరు ఆయనతో ఉన్న ఆవిరవని అనుభవాలు, జ్ఞాపకాలు. సతీష్ రాతలో ఉత్తర తెలంగాణ యాస వన్నెలద్దుకున్నది. తెలంగాణ మట్టి పరిమళం అద్దుకున్న భాష ఎంత అందమైనదో సతీష్ రాసిన ప్రతి వాక్యం లోనూ కనపడుతుంది:

"ఎప్పుడు అడ్లమ్మినా లాగోడి కర్సులు, కైకిలోళ్ల కర్సులు అన్నిపోను మిగిలేటియి రెండు వేలో, మూడు వేలో. అవిదెచ్చి అజ్జిరవ్వకిస్తే వాటిని ఓరకు వెట్టేది అమ్మ. ఓరకు వెట్టుడంటే బ్యాంకు లాకర్లనో, అల్మార్లనో గాదు. ఇటుకపెల్లల కిందనో, బియ్యం సంచిల్నో.. సందుగుల్నో దాసివెట్టేది. ఇగ ఇంట్ల పైసలుంటే బాపు చేతులుత్తగుండయి. వాటిని నాల్గయిదు సార్లు లెక్కవేస్తడు. అట్లెందుకు, అన్ని సార్లు లెక్కవెడ్తవే బాపు.. అని నేనోసారి అడిగిన. 'మీ అయ్య ఊకె లెక్కవెడ్తే పైసలు డబులైతయిరా' అని అజ్జిరవ్వ పరాష్కమాడుకుంట ఇల్లాడుస్తున్నది. 'నిజమేనానె బాపు' అని అడిగిన. 'దాని మొకం.. అదట్లనే ఒర్రుతది బిడ్డా. మన జేతుల గిన్నిగనం పైసలెప్పుడుంటయిరా, అడ్ల పైసలొచ్చినప్పుడేనాయె! రెండు మూడ్రోజులైతే ఎక్కడియక్కడ గడ్తం. అట్లా గట్టినంక మనకేం ఉంటయి. ఐదార్నెల్లు కట్టవడ్తె అచ్చిన పైసల్ని నాలుగైదు సార్లనన్న లెక్క వెట్టుకోవద్దారా? కట్టాన్ని కండ్ల నిండా సూసుకోవద్దారా కొడుకా?"

('రేకుల కింద రెక్కలు')

ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చినంక పెట్టుబడులు, చేసిన అప్పులు పోను ఏమీ మిగలని జీవితాలకు, వడ్లు మార్కెట్‌కు పంపి అమ్మిన తర్వాత వచ్చిన బిల్లు పైసలనే తనివిదీరా లెక్క వెట్టి తుర్తిపడే తెలంగాణ రైతు జీవితాల మురిపాలు, ఆనందాలకు ఇదొక తార్కానం.

తెలంగాణ జన జీవితంలోని కష్టనష్టాలు, కన్నీళ్లు, చిన్న చిన్న ఆనందాలు, పిల్లల మురిపాలు ఒక ఎత్తు అయితే, శ్రమజీవుల జీవనంలోని ప్రజాస్వామికత మరో ఎత్తు. స్త్రీ పురుష సమానత్వం విలువల గురించి సిద్ధాంతాలు, వాద సంవాదాలు ఎన్నో ఉన్నాయి. కానీ, సహజంగానే తెలంగాణ జన జీవితంలో ప్రజాస్వామికత, స్త్రీ పురుష సమానత్వం అడుగడుగునా కనిపిస్తుంది. గడ్డం సతీష్ తండ్రి రామస్వామి, తల్లి అజ్జిరవ్వనే తీసుకుంటే– రామస్వామి పొద్దున ఎగిలివారంగనే (అంటే ఉదయం నాలుగున్నర ఐదు గంటలకు) లేసి పొయ్యి అంటివెడ్తడు. కిరసనాయిల్, ఇంకా ఇతర చెత్తా చెదారం లేకుండనే పొయ్యి అంటివెట్టుట్ల అతనికి అతనే సాటి. పొయ్యి అంటివెట్టి ఇంటిల్లి పాదికి ఆ పొయ్యి మీద చాయ వెడ్తడు. ఆ తర్వాత అజ్జిరవ్వ లేసి బాసన్లు తోమి పొయ్యి అల్కి, ఇంటిముంగట వాకిలు ఊడుస్తది. అప్పుడు రామస్వామి బోరింగ్ కాన్నుంచి బిందెల నీళ్ల తెచ్చి వాకిట్ల సల్లుతడు. రామస్వామి నీళ్ల జల్లితే అజ్జిరవ్వ ముగ్గు లేస్తది. అజ్జిరవ్వ బట్టలుతికితే రామస్వామి ఆరేస్తడు. ఏడెనిమిది గంటలకల్ల ఇంత వండి బిడ్డకు బడికి సద్దిగట్టి, మిగిలింది గిన్నెల వెట్టుకొని, నెత్తిమీద గంప ఎత్తుకొని బాయికాడికి బయల్దేరుతరు. ముంగట రామస్వామి, ఎనుక అజ్జిరవ్వ. రామస్వామి వాడ్కకల్లు ఇంత తాగి సొలుగుకుంట వచ్చినా అజ్జిరవ్వ పరాష్కం అడుకుంటనే మొట్టీలు మొత్తినా, రామస్వామి నవ్వుకుంటనే, "ఇగ సాల్ తియ్యే.. ఎగసెక్కాలు. నేను కొంచెం సొల్గిన కనీ.. కిందవడి ఇజ్జత్ కచ్‌రా చేసుకొని ఎచ్చీర్కం కాలె తియ్యే" అని చెప్పుకుంటడు. ఎన్ని కష్టాలొచ్చినా కలిసి మాట్లాడుకొని ఎల్లదీసుకునే ఉపాయం జేస్తరు. అలు మొగలుగా స్త్రీ పురుషుల సహజీవనం ఎంత ప్రజాస్వామికంగా ఉంటదో తెలంగాణ జన జీవితమే తార్కానం.

ఈ ప్రజాస్వామిక జీవనం యాంత్రిక మధ్యతరగతి నగర జీవితాల్లో చూడటం సాధ్యం కాదు. పిల్లలను నాలుగైదేండ్ల నుంచే ప్రత్యేక పడకగదుల్లో బంధించే నవనాగరిక జీవనంలో అమ్మానాన్నల అనురాగ స్పర్శ వారికి అందుతున్నదా? నిజానికి ఇవ్వాళ పిల్లల్లో ఉన్న మానసిక వికారాలకు పునాది ఇక్కడనే ఉన్నదా? ఈ మధ్యన బంధువు పురుడు పోసుకుంటే– పరామర్శ కోసం ఓ హాస్పిటల్‌కు పోయిన. పుట్టిన ఒక రోజు పసికందు ఏడుస్తుంటే, ఆపరేషన్ తర్వాత ఇంకా కదల్లేని స్థితిలో ఉన్న తల్లి దగ్గర పడుకోబెడితేనే పాపకు తల్లి స్పర్శ అందుతుందనీ, అప్పుడే పాప ఏడుపు మానుతుందని నర్సులు చెప్పటం విని కదిలిపోయాను. తల్లి స్పర్శ లేకుండా చేయటమే నాగరికత అయితే, అది అనవసరం. ఈ నేపథ్యంలో గడ్డం సతీష్ రాసిన 'బాపు' తెలంగాణ తల్లి స్పర్శ.

'బాపు' పుస్తకంలో ఉన్న ఇరవై రెండు దృశ్య ఖండికలలో మొదటి మూడు సతీష్ తండ్రి రామస్వామి స్మరణలో రాసినవి కాగా, తర్వాతి ఆరు ఆయనతో ఉన్న ఆవిరవని అనుభవాలు, జ్ఞాపకాలు. సతీష్ రాతలో ఉత్తర తెలంగాణ యాస వన్నెలద్దుకున్నది. తెలంగాణ మట్టి పరిమళం అద్దుకున్న భాష ఎంత అందమైనదో సతీష్ రాసిన ప్రతి వాక్యం లోనూ కనపడుతుంది.





■ ఎస్. మల్లారెడ్డి
✆ 80966 77255



మృతదేహాలను బయటకు తీసుకువస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

కన్నీటి గోదారి..

రాత్రంతా తీరాన బంధువుల రోదనలు

- యువకుల మృతదేహాల కోసం జాగారం
- మేడిగడ్డ వద్ద గల్లంతైన ఆరుగురి మృతదేహాలు లభ్యం
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- ఏడు గంటల పాటు శ్రమించిన రెస్క్యూ బృందాలు
- బాధితులంతా కూలీ కుటుంబాల వారే..
- తీవ్ర విషాదం నింపిన స్నానం సరదా

మహదేవపూర్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అన్నీ కూలీ కుటుంబాలే.. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వాళ్లది.. బొట్టు బొట్టు ధారబోసి చదివించుకున్నారు.. తన కొడుకు కలెక్టరో.. ఉపాధ్యాయుడో.. అవుతారనుకున్నారు.. జీవితంలో ఉన్నత స్థానంలో నిలుస్తారని కలలుకన్నారు. కానీ ఆ తల్లిదండ్రుల కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.. చేతికందిన కొడుకులు చెదిరిపోయారు. స్నానం సరదా ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. వివాహ వేడుకకు వచ్చిన ఆయువకులు విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ ఎగువ ప్రవాహంలోని బ్లాక్-3 సమీపంలో శనివారం రాత్రి గల్లంతైన ఆయువకుల కథ విషాదాంతమైంది. శనివారం రాత్రే రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకున్నప్పటికీ గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండడం.. గల్లంతైన ప్రదేశం పూర్తిగా చీకటిమయం కావడంతో గాలింపు వీలుకాలేదు. ఆదివారం ఉదయం 5గంటల నుంచే రంగంలోకి దిగిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, స్థానిక గజ ఈతగాళ్లు రెస్క్యూను ప్రారంభించి ఒక్కొక్కరిని వెలికితీశారు. గల్లంతైన ప్రదేశం నుంచి 50మీటర్ల పరిధిలోనే వీరంతా దొరికారు. రాత్రంతా మృతదేహాలు నీటిలోనే ఉండడంతో వాపొచ్చాయి.

ఏడు గంటలు శ్రమించిన రెస్క్యూ బృందాలు

మహదేవపూర్ మండలం అంబట్పల్లికి చెందిన తొగరి రక్షిత్(13) మృతదేహం ఆదివారం ఉదయం 5.41గంటలకు లభ్యమవ్వగా, ఉదయం 6.50గంటలకు మహాముత్తారం మండలం స్థంభంపల్లి(పీపీ)కి చెందిన పసుల రాహుల్ (18) మృతదేహాన్ని వెలికితీశారు. మళ్లీ సుమారు మూడు గంటల తర్వాత ఉదయం 9.45గంటలకు మహదేవపూర్ మండలం అంబట్పల్లికి చెందిన కర్నాల సాగర్(16) మృతదేహం దొరికింది. ఉదయం 10.07గంటలకు

మిగతా 7వ పేజీలో..



గల్లంతైన వారి కోసం గోదావరి నదిలో వెతుకుతున్న స్థానిక గజ ఈతగాళ్లు, జాలర్లు



అందరూ.. సిద్ధమేనా?!

- స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ఉద్యోగులు
- వివరాలు అడుగుతున్న ఉన్నతాధికారులు
- ఇది వరకే ఓటర్ల జాబితా ప్రచురణ
- పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి
- టి-పోల్లో కొత్త వివరాల నమోదు
- తాజా సమాచారం క్రోడీకరణ
- మొదలైన స్థానిక సంస్థల ఎన్నికల సందడి
- ఎన్నికల వ్యూహ రచనల్లో అన్ని పార్టీలు
- ఆశావహుల్లో అప్పుడే మొదలైన హడావిడి

7

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి..

- తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్
- నేడు వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

6



ఓరుగల్లు ఎమ్మెల్యేలకు అధిష్ఠానం ఝలక్

- డిప్యూటీ స్పీకర్ పోస్టుతో సరిపెట్టిన కాంగ్రెస్
- పొరుగు జిల్లాల్లో ఏడుగురు ఎమ్మెల్యేలకు మూడు పదవులు
- 11మంది ఎమ్మెల్యేలున్న ఓరుగల్లుకు రెండే పదవులా?
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉమ్మడి జిల్లా శ్రేణులు
- తొలిసారి గెలిచిన అడ్లూరి, వాకాటికి ఛాన్స్
- ఇదే నిబంధనతో నాయినికి దక్కని అవకాశం
- ఫలించని దొంతి మాధవరెడ్డి ప్రయత్నాలు
- ఇక మూడో విడతపైనే నేతల్లో ఆశలు

రిక్త హస్తం!

మంత్రివర్గ విస్తరణలో దక్కని అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)


మంత్రివర్గ విస్తరణలో ఓరుగల్లుకు నిరాశే మిగిలింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆశావహ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇచ్చింది. పక్క జిల్లాల్లో ముగ్గురేసి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తే.. 10మంది ఎమ్మెల్యేలను ఇచ్చిన ఓరుగల్లుకు మాత్రం ఇద్దరే మంత్రులా? అనే చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవితో ఓరుగల్లుకు సరిపెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే అత్యధికంగా ఉన్న రెడ్డి వర్గానికి ప్రాధాన్యత దక్కటం లేదని కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. పాతికేళ్లకు పైగా కాంగ్రెస్కు వీరవిధేయుడుగా ఉన్న నాయిని రాజేందర్రెడ్డి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారని పక్కన పెట్టగా.. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన మిగతా వారికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించటం చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి కోసం ఏఐసీసీ నేతల వద్దకు వెళ్లి లాబీయింగ్ చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి నిరాశే మిగలగా.. సీనియర్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి పేరును పరిగణంలోకి తీసుకోలేదనే చర్చ జరుగుతోంది. మరోవైపు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కొండా సురేఖకు ఈసారైనా కీలక శాఖలు దక్కేనా అనే చర్చ మొదలైంది.

ఓరుగల్లుకు నిరాశే..

2023 డిసెంబరు 7న సీఎం రేవంత్రెడ్డితో పాటు ములుగు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేలుగా గెలిచిన సీతక్క, కొండా సురేఖలకు మంత్రి వర్గంలో చోటు దక్కింది. ఎస్టీ, బీసీ మహిళలకు స్థానం కల్పించారు. ఇప్పుడు సీఎం రేవంత్రెడ్డి తన మంత్రివర్గాన్ని రెండోసారి విస్తరించారు. ఈ మంత్రివర్గ విస్తరణలో పదిమంది ఎమ్మెల్యేలను ఇచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో కీలకంగా మారిన ఓరుగల్లుకు ప్రాధాన్యత దక్కుతుందని అందరూ భావించారు. కానీ మన ఎమ్మెల్యేలకు నిరాశే దక్కింది. పొరుగున ఉన్న కరీంనగర్ జిల్లాల్లో ఏడుగురు ఎమ్మెల్యేలే గెలిచనప్పటికీ దుద్దిళ్ల శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్తో పాటు తాజాగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్కు అవకాశం ఇచ్చారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొమ్మిది ఎమ్మెల్యేలు ఉంటే.. అక్కడ కూడా ముగ్గురికి మంత్రి పదవులు

మిగతా 7వ పేజీలో..

అధ్యక్షా..



- ఉప సభాపతిగా రాంచంద్రునాయక్
- డోర్నకల్ ఎమ్మెల్యేను వరించిన ఉన్నత పదవి
- మానుకోట జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం
- 2023లో తొలిసారిగా చట్టసభల్లో అడుగు

7

భగ.. భగ..



- దారెత్తిస్తున్న భానుడు
- దంచికొడుతున్న ఎండలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- హనుమకొండ, ములుగులో అత్యధిక ఉష్ణోగ్రతలు
- గరిష్టంగా 41.7 డిగ్రీలుగా నమోదు

హనుమకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండురోజులుగా ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగమంటున్నాడు. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం మృగశిర రోజు చినుకులు పడి వాతావరణం చల్లబడుతుందనుకుంటే.. ఇందుకు భిన్నంగా ఎక్కడా ఒక్క వర్షపు చుక్కకూడా పడలేదు. ముఖ్యంగా హనుమకొండ, ములుగు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లా దామెర మండలంలో అత్యధికంగా 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లిలో 41.5 డిగ్రీలు, జనగామ జిల్లా జఫర్గడ్ మండల కేంద్రంలో 41.6డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో 41.5 డిగ్రీలు, ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో 40.7డిగ్రీలు జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 41.6 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదైంది.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 90.1 శాతం తేమశాతం కారణంగా ఉక్కపోత భరించలేనంత స్థాయికి పెరిగింది. ఆరు జిల్లాలో తేమశాతం 90 శాతం మించింది. వారం రోజుల కిందటివరకు ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టినట్టు అనిపించాయి. అక్కడక్కడ స్వల్పంగా వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. కానీ రెండు రోజులుగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పుచోటు చేసుకున్నది. తేమశాతం పెరగడంతో ఉక్కపోత తీవ్ర స్థాయికి చేరుకున్నది. ఉక్కపోతను భరించలేక ప్రజలు ఏసీలు, కూలర్ల నుంచి కదలలేని పరిస్థితి ఏర్పడింది. రానున్న రెండురోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చునని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏపీ ఎప్సెట్లో ప్రతిభ

- ఉత్తమ ర్యాంకులు సాధించిన 'హనుమకొండ' విద్యార్థులు
- 4వ ర్యాంకు సాధించిన యండ్రపతి షణ్ముక్
- 8వ ర్యాంకు సాధించిన శాగంటి త్రిశూల్



యండ్రపతి షణ్ముక్, శాగంటి త్రిషూల్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన అక్కడి ఎప్సెట్ ప్రవేశ పరీక్షలో హనుమకొండ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 4, 8 ర్యాంకులను సాధించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని టీచర్స్కాలనీ ఫేస్-2కు చెందిన యండ్రపతి షణ్ముక్ ఏపీ ఎప్సెట్లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీజీ ఎప్సెట్లో షణ్ముక్ రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు సాధించగా, జేఈఈ మెయిన్స్లో ఓపెన్ కేటగిరిలో 1672 ర్యాంకును సాధించారు. నీట్ పరీక్ష రాసిన షణ్ముక్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. షణ్ముక్ తల్లిదండ్రులు శ్యాంసుందర్-రజని బిజినెస్ చేస్తున్నారు. కాగా, షణ్ముక్ పాఠశాల విద్యాభ్యాసం హనుమకొండలోని శ్రీచైతన్య స్కూల్లో పూర్తి చేయగా, ఇంటర్మీడియెట్ను హైదరాబాద్లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లి జవహర్ కాలనీకి చెందిన శాగంటి త్రిషాల్ ఏపీఎప్సెట్లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించారు. అయితే త్రిషాల్ ఇప్పటికే జేఈఈ మెయిన్స్లో 66వ ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్డ్లో ఓపెన్ కేటగిరిలో 579, ఓబీసీ కేటగిరిలో 87వ ర్యాంకుతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టీజీ ఎప్సెట్లో రాష్ట్ర స్థాయిలో 84వ ర్యాంకు సాధించారు. త్రిషాల్ తల్లిదండ్రులు శాగంటి నర్సయ్య-సబిత ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. త్రిషాల్ పాఠశాల విద్యాభ్యాసం హనుమకొండలోని శ్రీచైతన్య పాఠశాలలో పూర్తి చేయగా ఇంటర్మీడియెట్ హైదరాబాద్లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. .

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో జరుగనుం దని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు

చెరువుల మట్టి లూటీ

- నర్సంపేట డివిజన్లో అక్రమంగా మట్టితవ్వకాలు
- పగలు గప్చుప్.. రాత్రి వేళల్లో మట్టి ట్రాక్టర్ల జోరు
- రియల్ వెంచర్లు.. ప్రైవేట్ స్థలాల్లోకి తరలింపు
- రెవెన్యూ, మైనింగ్ అనుమతుల్లేవ్
- అధికార పార్టీ నేత కనుసన్నల్లో మట్టి మాఫియా

నర్సంపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట డివిజన్లో కొంత మంది అక్రమార్కులు మట్టి మాఫియాగా అవతారమెత్తి కనిపించిన చెరువులు, కుంటల్లోని మట్టి లూటీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికారం, పలుకుబడితో చెరువులు, కుంటల్లోని మట్టిని ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి యంత్రాలతో తవ్వకాలు చేపడుతూ మట్టి దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. డివిజన్లోని నర్సంపేట, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లోని భూముల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొంత మంది వ్యక్తులు భూ యజమానులకు ఎంతో కొంత ముట్టచెప్పి వేలాది ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తుండగా, మరికొందరు చెరువులు, కుంటల్లోని మట్టిని అక్రమంగా తవ్వి మట్టి దందాకు పాల్పడుతూ కోట్ల రూపాయలకు పడగలెత్తుతున్నారు. అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చెరువులు, కుంటల్లో అక్రమంగా మట్టితవ్వకాలు

నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలోని దామెర చెరువు, ముత్తోజిపేట, రాజుపేట, లక్నెపెల్లి, మహేశ్వరం, మాధన్నపేట, నాగుర్లపల్లి తదితర ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టిని తవ్వుతూ తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. వందలాది ట్రాక్టర్లు నిత్యం రోడ్లపై సంచరిస్తూ అటు రవాణా సౌకర్యాలను దెబ్బతీయడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

పగలు గప్చుప్.. రాత్రి వేళల్లో తవ్వకాలు..

మట్టి మాఫియా తమ దందాను పగటి వేళల్లో కాకుండా రాత్రి వేళల్లో కొనసాగిస్తున్నారు. పగలు గప్చుప్గా ఉంటూ.. సాయంత్రం ఏడు దాటిందంటే ఇక తమ దందాను మొదలెడుతున్నారు. మరికొంత మంది ఏకంగా అర్ధరాత్రి వేళల్లో చెరువుల్లో యంత్రాలతో మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. దీంతో నర్సంపేట పట్టణ శివారులో ట్రాక్టర్ల జోరుతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు రాత్రి వేళల్లో మట్టి తరలింపు ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బొందలగడ్డగా మారిన దామెర చెరువు

ప్రైవేట్ స్థలాల్లోకి మట్టి తరలింపు

రైతు పొలాలకు మట్టిని తరలిస్తున్నామని చెబుతున్నప్పటికీ అలాంటి అనుమతులు వారి వద్ద ఉండవు. కొంత మంది భూ యజమానులకు కొంత ముట్టచెప్పి తమ దందాను కొనసాగిస్తుండగా మరికొందరు అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలతో పాటు వాటి శిఖం భూముల్లో ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి, మొరాన్ని

(మిగతా 8వ పేజీలో)

ఓరుగల్లు ద్వారా పేరిణి విశ్వవ్యాపితం

కళాకారుల సమక్షంలో నటరాజ రామక్రిష్ణ 14వ వర్ధంతి

హనుమకొండ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయు కాలం నాడు పురుడు పోసుకున్న పేరిణి (యుద్ధ ప్రేరణ) నాట్యాన్ని తమ గురువు నటరాజ రామక్రిష్ణ ఆశయాలకు అనుగుణంగా ఇదే ఓరుగల్లు వేదిక ద్వారా విశ్వవ్యాపితం చేస్తామని ప్రముఖ పేరిణి నాట్యాచారిణి, విద్యారణ్య సంగీత కళాశాలలో నాట్య గురువు చాతరాజు నవ్యజ, పేరిణి నాట్యాచార్యుడు డాక్టర్ గజ్జెల రంజిత్ కుమార్ అన్నారు. కాకతీయుల కాలంలో ప్రఖ్యాతిగాంచిన పేరిణి నృత్యాన్ని తన అపూర్వ పరిశోధనల ద్వారా పునఃప్రారంభింప చేసిన నాట్యాచార్యుడు, పద్మశ్రీ నటరాజ రామక్రిష్ణ 14వ వర్ధంతిని శనివారం రాత్రి నగరంలోని కొత్తవాడలోని పేరిణి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. పేరిణి కళాకారులంతా రామక్రిష్ణసేవలను కొనియాడుతూ ఆయనకు నివాళులర్పించారు. అదే విధంగా గత ఏప్రిల్ 24వ తేదీ నుంచి నగరంలో నిర్వహిస్తున్న 45 రోజుల పేరిణి వేసవి శిక్షణ శిబిర ముగింపు వేడుకలను కూడా నిర్వహించారు. పేరిణి నృత్యం పట్ల ఆసక్తికనబరుస్తూ శిబిరంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలకు చెందిన 120 మంది విద్యార్థులు నటరాజ రామక్రిష్ణకు నివాళులర్పించి ప్రతినచేశారు. ఈ సందర్భంగా కళాకారులు అద్భుత నృత్యాలను ప్రదర్శించి ప్రతిభను చాటారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రత్యేక ప్రశంసాపత్రాలను అకాడమీ అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళ రామక్రిష్ణ, గజ్జెల రంజిత్ కుమార్, అకాడమీ గౌరవ సలహాదారు సీహెచ్ నర్సింగరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇటీవల రామప్ప వేదికగా ప్రపంచ సుందరీమణుల అందాల పోటీల వేదికపై, ఇంకా పలు జాతీయ వేదికలపై పేరిణి ప్రదర్శనలు ఇచ్చిన పలనాటి శ్రీజ, బండారి వైష్ణవి, తొడగం గురుదేవ్, బండారు తేజస్విని తదితర జాతీయ కళాకారులతో పాటు అకాడమీ సీనియర్ విద్యార్థులు జీవన్, నిత్యశ్రీ, రవితేజ, సుగంధిని తదితర విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలి

- తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్
- నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన


నర్సంపేటలో మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్

నర్సంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రపోషించిన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని, లేకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరో పోరాటానికి శ్రీకారం చేపడతామని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని టీజేఎస్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలు, 12వందల మంది బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కేసీఆర్ హయాంలో సుమారు 600 మంది ఉద్యమకారులను గుర్తించి కొందరికి నగదు, మరి కొందరికి స్థలం అందజేశారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రజలు, ఉద్యమకారులు పనిచేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడిచిపోతున్నా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని నేటివరకు అమలు చేయలేదన్నారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలం అందించడంతో పాటు పింఛన్ అందించాలన్నారు. కేబినేట్ సమావేశాల్లో ఉద్యమకారుల గురించి ప్రస్తావించక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, అమర వీరుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు వారికి పింఛన్ అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఆదుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ కోసం ప్రజలను, ఉద్యమకారులను సమీకరించి పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ జన సమితికి ఇస్తామన్న 5 ఎమ్మెల్సీ, 4 రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, 4 జిల్లా స్థాయి కార్పొరేషన్ పదవులను ప్రభుత్వం కేటాయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద టీజేఎస్ నాయకులు, ఉద్యమకారులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే.జావిద్, రాష్ట్ర నాయకుడు గుంటి రాంచందర్, ఉద్యమకారిణి గుడిపూడి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఎమ్డీ.మహబూబ్అలీ, ఎర్రబోయిన రాజశేఖర్, సోల్తి సాయికుమార్, గుంటి సంజీవ, ఎమ్డీ.సంధాని, మాటేటి రజిత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆస్పత్రి ఎదుట బంధువుల ధర్నా


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వారిని నిలువరిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్


ఆస్పత్రిలో మృతి చెందిన రమణ

వరంగల్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని వెంకట్రామ థియేటర్ సమీపంలోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొత్తపల్లి రమణ(28) అనే యువకుడు ఆదివారం మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకుని వైద్యుల నిర్లక్ష్యం వల్లనే రమణ మృతి చెందాడని ధర్నా చేశారు. ఆస్పత్రికి సంబంధించిన ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. గీసుగొండ మండలం మొగిళిచర్లకు చెందిన కొత్తపల్లి రమణ శనివారం రాత్రి 11.30 గంటలకు వరంగల్ నుంచి ఇంటికి వెళుతుండగా గ్రామం నుంచి మెయిన్‌రోడ్‌కు వేగంగా వచ్చిన గూడ్స్ వాహనం రమణ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సంరక్ష ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు రమణ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు ఆస్పత్రి వద్దకు భారీగా చేరుకుని వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న విల్స్‌కాలనీ పోలీసులు, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి బంధువులు, ఆస్పత్రి యాజమాన్యంతో జరిగిన పరిణామాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు యాజమాన్యం, మృతుడి బంధువులు చర్చలు జరిపిన తరువాత రమణ మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించడంతో సమస్య సద్దుమనిగింది. ఇదిలా ఉంటే.. రమణ కాంగ్రెస్ నాయకుడిగా కొనసాగుతున్నారు. రమణకు తండ్రి భిక్షపతి, తల్లి స్వరూప, ఇద్దరు అక్కలు, ఒక చెల్లి ఉన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

చికిత్స పొందుతూ మృతి


సత్యం (ఫైల్)

గీసుగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలం రెడ్డిపాలెంకు చెందిన వరగాని సత్యం (40) అనే కౌలు రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యం కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కొన్నేళ్లుగా రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తన భార్య ఏకాంబ్రంకు ఆస్థమా వంటి అనారోగ్య సమస్యలతో ఉండేది. దీంతో వ్యవసాయానికి, భార్య హాస్పిటల్ ఖర్చులకు రూ.6లక్షల వరకు అప్పుచేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే మానసిక బాధతో ఈనెల 1న మొగిలిచర్ల శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబీకులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సత్యం చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. నిరుపేద సత్యం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి..

బీవీపీ దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంశాస్త్రి



మాట్లాడుతున్న బివిపి ప్రధాన కార్యదర్శి డి. పురుషోత్తంశాస్త్రీ

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బీవీపీ దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి డి.పురుషోత్తం శాస్త్రి పిలుపునిచ్చారు. కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆదివారం బీవీపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర వర్క్‌షాపు ఏర్పాటు చేయగా బీవీపీ ప్రాంత అధ్యక్షుడు నాగశేఖర్ గుప్తా సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం భారత్ వికాస్ పరిషత్ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. అనంతరం దక్షిణ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి నాగరాజు, ఆర్ఎస్ఎస్ నుంచి మల్లిఖార్జున్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రీజినల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, వీవీ నాగేందర్, మాధవీలత, ఫణికుమార్, వరంగల్ శాఖ కార్యదర్శులు శివరామకృష్ణ, కె.సత్యనారాయణ, ఫైనాన్స్ కార్యదర్శి మాధవి, బి.వెంకట్‌రెడ్డి, చంచల్ అగర్వాల్, వివేకానంద, రత్న మంజుల, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వాషింగ్టన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


అమెరికాలోని వాషింగ్టన్‌లో తెలంగాణ అవిర్భవ వేడుకలలో ఎన్ఆర్ఐలతో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని వాషింగ్టన్‌లో తెలంగాణ అవిర్భావ వేడుకలను వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ మంచి విజన్‌తో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎన్ఆర్ఐలు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. తెలంగాణ నుంచి ఎవరు వచ్చినా వారికి తగిన సౌకర్యాలు కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, తదితరులు పాల్గొన్నారు.

మాగంటి గోపినాథ్‌కు నివాళులు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత మాగంటి గోపీనాథ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఎర్రబెల్లి సంతాపం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో ఎన్ఆర్ఐలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

టిప్పర్ ఢీకొని బాలిక మృతి

పెద్దవంగర మండలం కిష్టుతండాలో ఘటన



మృతి చెందిన జాటోతు హిందుమతి, హిందుమతి (ఫైల్)

పెద్దవంగర (మహబూబాబాద్ జిల్లా), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ ఢీ కొట్టడంతో బాలిక మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని బావోజీతండా జీపీ పరిధిలోని కిష్టుతండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని బావోజీతండా జీపీ పరిధిలోని కిష్టుతండాకు చెందిన జాటోతు సోమన్న-అనిత దంపతులకు కుమార్తె హిందుమతి, కుమారుడు దీక్షిత్ ఉన్నారు. కుమార్తె హిందుమతి(13) తొర్రూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదవుతుంది. వేసవి సెలవులు కావడంతో హిందుమతి సైకిల్ తొక్కుతున్న క్రమంలో ఎన్‌హెచ్-930పీ రోడ్డు నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్డులో వెళ్తున్న టీఎస్07 యుఎమ్ 9064 అనే టిప్పర్ వెనుక నుంచి బాలికను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ జార్ఖండ్ రాష్ట్రంలోని డియోఘర్ జిల్లాకు చెందిన కామాదేవ్ రేవానిపై మృతిరాలి తండ్రి జాటోతు సోమన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను సీజ్‌చేసి , డ్రైవర్‌ను అరెస్టుచేశారు. మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని సీఐ టీ గణేష్, ఎస్సై క్రాంతి కిరణ్ పరిశీలించారు.

సర్వీసు రోడ్డు పనులను అడ్డుకున్న స్థానికులు, బంధువులు

టిప్పర్ ఢీకొని బాలిక మృతి చెందడంతో మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు మండల కేంద్రం శివారు నుంచి కిష్టుతండా, చిన్నవంగర ఎక్స్ రోడ్డులో ఎన్‌హెచ్-930పీ రోడ్డు నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్డు నిర్మాణాలు పనులను అడ్డుకున్నారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదంలో బాలిక మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. మృతి చెందిన బాలిక కుటంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ భవన తొలి అంతస్థు ప్రారంభం


పీఆర్టీయూ భవన తొలి అంతస్తు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జడ్పీ కార్యాలయం ఆవరణలో ఉన్న పీఆర్టీయూ భవన్‌లోని తొలి అంతస్థును పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం పీఆర్టీయూ భవన్‌లో నూతనంగా నిర్మించిన తొలి అంతస్థును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. పీఆర్టీయూ సమావేశ భవనం నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం ఆవిర్భవించిన పీఆర్టీయూ సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

దీనావస్థలో ఉద్యమ కెరటం

- తెలంగాణ తొలి, మలిదశలో పోరాటం
- ప్రస్తుతం పక్షవాతంతో నడవలేని స్థితి
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు


నడవలేని స్థితిలో ఉన్న కాళ్లను చూపుతున్న సత్తయ్య

కొత్తగూడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దీనావస్థ స్థితిలో తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు జీవనం గడుపుతున్నాడు. తెలంగాణ రెండు పర్యాయాల ఉద్యమంలో పలు మార్లు జైలుకు వెళ్లిన మాదారపు సత్తయ్య నేడు పక్షవాతం రావడంతో చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు.. ఉమ్మడి కొత్తగూడ మండలంలోని పెద్ద ఎల్లాపురానికి చెందిన మాదారపు సత్తయ్య నాటి నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలంలోని తూర్పుగూడెంలో పుట్టి పెరిగాడు. బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు నల్ల ఇంద్రసేనరెడ్డి సహచరుడిగా ఉంటూ.. నాటి తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మల్లు స్వరాజ్యం, కొండల్‌రెడ్డితో పాటు సత్తయ్య కీలక పాత్ర పోషించాడు. ఆప్రాంతంలో నాడు కరువు రావడంతో 1984లో నాటి వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం(నేడు గంగారం మండలం) పెద్ద ఎల్లాపురం గ్రామానికి జీవనోపాధి కోసం వలసవచ్చాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మలి దశ తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి ఉద్యమంలో క్రియాశీలకంగా పోరాడాడు. 2004లో తెలంగాణ ఉద్యమం చేస్తున్న ఉద్యమకారులను అరెస్ట్ చేసినప్పుడు నేటి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి మాదారాపు సత్తయ్య వరంగల్ సెంట్రల్ జైలుకు వెళ్లాడు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఎవరూ తనను పట్టించుకోకపోవడంతో సత్తయ్య ఇంటివద్దనే ఉంటూ కాలం వెల్లదీస్తున్నాడు. మూడేళ్ల కిందట సత్తయ్యకు పక్షవాతం రావడంతో చికిత్స పొందుతున్నాడు. కానీ నేడు పూర్తిగా నడవలేని స్థితికి వచ్చిన సత్తయ్య వైద్యం చేయించుకునేందుకు కూడా డబ్బులు లేక దీనస్థితిలో జీవనం గడుపుతున్నాడు. సత్తయ్య ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఎవరైనా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



పి.సదయ్య, ఏసీపీ క్రైమ్

అనుమానితులు కనపడితే 8712685170కు వాట్సాప్ చేయండి

ప్రశ్న: చోరీ కేసుల్లో ఎంత మందిని అరెస్టు చేశారు?

జవాబు: 17 నెలల్లో 61 మంది నిందితులను అరెస్టు చేశాం

ప్ర: చోరీ కేసుల్లో ఎంత నగదు రికవరీ చేశారు?

జ: రూ.3.74 కోట్లు రికవరీ చేశాం.

ప్ర: సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు?

జ: సీఐలు ఇద్దరు, ఎస్ఐలు ముగ్గురు, ఏఎస్ఐలు ఐదుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 14 మంది, పోలీసు కానిస్టేబుళ్లు 16 మంది ఉన్నారు.

ప్ర: ఎన్ని కేసులు ఛేదించారు?

జ: వరంగల్ కమిషనరేట్ పరిధిలో 155 కేసులు ఛేదించాం. నేరాల నియంత్రణ కోసం పాత నేరస్థులపై నిఘా పెట్టాం. గోల్డ్ రీసివర్‌లపై నిఘా పెంచాం.

ప్ర: నేరాల నియంత్రకు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: కాలనీలు, వీధుల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 8712685170కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలి. నాణ్యమైన సీసీ కెమెరాలతో పాటు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి.

- మట్టెవాడ(ఆంధ్రజ్యోతి)

మా సమస్యలు పరిష్కరించండి..

- సాంఘిక సంక్షేమ గురుకుల హిందీ టీచర్ల మొర
- ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేత


ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల హిందీ ఉపాధ్యాయులు

హనుమకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని సాంఘిక సంక్షేమ గురుకుల హిందీ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని అభ్యర్థించారు. ఆదివారం హనుమకొండ జడ్పీ సమావేశం హాలులో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సాంఘిక సంక్షేమ గురుకులాల హిందీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుకులాల్లో హిందీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు నివేదించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. హిందీ ఉపాధ్యాయుల్లో చాలా మంది రెగ్యులర్ టీజీటీలుగా ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ పదోన్నతులు లేకుండా పీజీటీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఇతర సబ్జెక్టుల మాదిరిగా హిందీ ఉపాధ్యాయులకు కూడా పీజీటీ పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని, ప్రతీ పాఠశాలలో టీజీటీ, పీజీటీ పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల హిందీ ఉపాధ్యాయులు జె.ఆనంద్, మాడిశెట్టి సుధ, మీరాబాయి, శిరీష, పి.సరితా దేవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు. కాగా, సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

బీటెక్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ఫీజు కోసం రూ.50వేలు అందజేత


భవ్యశ్రీకి రూ.50వేలు అందజేస్తున్న బిల్ల మహేందర్

హనుమకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని తీగల క్రిష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువబోతున్న వడ్డెపెల్లికి చెందిన నిరుపేద విద్యార్థిని కోమల్ల భవ్యశ్రీకి కాలేజీ ఫీజు కోసం విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.50వేలు అందచేసింది. ఆదివారం వడ్డెపెల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో జరిగిన విద్యా ఫౌండేషన్ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విద్యార్థిని కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం బీటెక్ మూడో సంవత్సరానికి ఫీజు అందచేశామని, నాలుగో సంవత్సరానికి కూడా ఫౌండేషన్ ఫీజు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అండగా నిలిచిన దాతలు కుందావఝుల క్రిష్ణమూర్తి, కెప్టెన్ కె.రమాదేవి, తెలంగాణ స్త్రీ సేవా సంస్థ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కలకోట్ల నరేందర్, వేదాంతం లక్ష్మమ్మ, వెల్లండి లీల, టి.నర్సింగరావు, జి.విష్ణుమూర్తి, రాపాక సోమయ్య, కాంచనపల్లి అనిత, వసంత, ఒయాసిస్ నిర్వాహకులు చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అందరూ.. సిద్ధమేనా?!

- స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ఉద్యోగులు
- వివరాలు అడుగుతున్న ఉన్నతాధికారులు
- మొదలైన స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి

హనుమకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇది వరకు సమగ్ర వివరాలు సిద్ధం చేసుకున్న అధికారులకు తాజాగా ఆదేశాలొచ్చాయి. ఏమైనా మార్పులను సవరించుకొని టీ-పోల్‌లో ఆ వివరాలన్నీ నమోదు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల విధుల కోసం గతంలో సిద్ధం చేసిన ఉద్యోగులే ఉన్నారా ? కొత్తవారెవరైనా వచ్చారా ? వస్తే ఆ సమాచారం తీసుకోనున్నారు. జీపీ, ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా పూర్తి వివరాలన్నీ వెంటనే నమోదు చేయాలని, తాజా సమాచారంతో టీ-పోల్‌ను నవీకరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి.

గత ఎన్నికల్లో ..

హనుమకొండ జిల్లాలో 132 జీపీలు, 12 జడ్పీటీసీలు, 12 ఎంపీపీలు, 130 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాల్లో 3 బీసీలు, 5 ఎస్సీలు ఓసీ కేటగిరీలో రిజర్వు అయిన స్థానాల్లో ఇద్దరు బీసీలు, ఇద్దరు ఓసీలు గెలిచారు. ఎంపీపీ స్థానాల్లో ఒక బీసీ, 5గురు ఎస్సీ, ఓసీ కేటగిరీ కింద రిజర్వు అయిన స్థానాల్లో ఇద్దరు బీసీలు, నలుగురు ఓసీలు గెలిచారు. ఎంపీటీసీ స్థానాల్లో 30 మంది బీసీలు, 31 మంది ఎస్సీలు, ఇద్దరు ఎస్టీలు, ఓసీకి రిజర్వు అయిన స్థానాల్లో 33 మంది బీసీలు, ముగ్గురు ఎస్సీలు, 2 ఎస్టీలు, 29 మంది ఓసీలు గెలుపొందారు. మొత్తానికి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలే ఎక్కువ మంది గెలిచారు. ఈసారి ఎన్నికల్లో గెలుపోటములు ఎలా ఉంటాయన్న చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలో 12 రూరల్ మండలాల్లో మొత్తం ఓటర్లు 3,4724. వీరిలో పురుషులు 1,81,772, స్త్రీలు 1,90,872 ఉన్నారు. 631 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామపాలన అస్తవ్యస్తం

ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాదిన్నర కావొస్తోంది. ఇటు ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసి ఏడాది కావస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ మొదలు జడ్పీ వరకు ప్రత్యేధికారుల పాలన సాగుతోంది. స్థానిక సంస్థలను పట్టించుకునే నాథులు కరవయ్యారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పాలక వర్గాలు లేక కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. కనీసం గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ కిస్తీలు కూడా కట్టలేని దయనీయ పరిస్థితి పలుచోట్ల నెలకొంది. కార్మికులకు సైతం వేతనాలు సక్రమంగా ఇవ్వలేని దుస్థితి మరికొన్ని చోట్ల కనిపిస్తోంది. తాజాగా ఎన్నికల కసరత్తు మొదలవుతుండడంతో పల్లె ప్రాంతాలకు ఇది ఊరటనిస్తోంది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ద్వారా కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు తోడైతే అభివృద్ధి పనులు పట్టాలెక్కుతాయి.



వివరాల అప్‌డేట్

మండల స్థాయిల్లోనే వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంపీడీవోలకు ఆదేశాలందాయి. గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల సమాచారం నమోదు చేయాలని, ఏ ఎంపీటీసీ స్థానం పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు వస్తాయి. దాని పరిధిలోకి వచ్చే గ్రామాల వివరాలను కూడా పొందుపరచాలని, ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల సమాచారం మాత్రం జడ్పీ కార్యాలయంలో క్రోడీకరించాలని, సిద్ధంగా ఉన్న ఉద్యోగుల జాబితాలో ఎవరైనా ఇతర ప్రాంతానికి వెళ్లిపోయారా ? కొత్తవారెవరైనా వచ్చారా ? ఉద్యోగ విరమణ పొందారా ? ఇతర తాజా సమాచారం సేకరించి ఆ వివరాలను టీ-పోల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జీపీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, చిహ్నాలను ఖరారు చేయడం, బ్యాలెట్ పత్రాలను ముద్రించడం వంటి ముందస్తు ఎన్నికల కసరత్తు ఇది వరకే జరిగిపోయింది. గత ఫిబ్రవరిలోనే జడ్పీటీసీలు, ఎంపీటీసీల నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. పోలింగ్ కేంద్రాలను కూడా నిర్ణయించారు. వీటిలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఆ వివరాలను టీ-పోల్‌లో అప్‌డేట్ చేయాలని అధికారులు సూచించారు.

టీ-పోల్‌లో సమాచారం

గతంలో వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ, జడ్పీలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమగ్ర వివరాలతో జాబితాలను ఇది వరకే రూపొందించారు. ఉన్నతాధికారులకు ఆ సమాచారాన్ని పంపించారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా సరిపడా పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆ కేంద్రాల పరిధిలో ఎందరు ఓటర్లు వస్తారనేది జాబితాలు తయారయ్యాయి. ఓటింగ్‌కు వినియోగించే గులాబీ, తెల్లరంగు బ్యాలెట్ పత్రాలు సైతం జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. తాజా వివరాలన్నీ టీ-పోల్ వెబ్ పోర్టల్‌లో మళ్లీ నమోదు చేయనున్నారు.

జోరుగా చర్చలు

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుండడంతో రాజకీయంగా చర్చలు జోరందుకున్నాయి. పార్టీల బలాబలాలు, అభ్యర్థుల ఎంపిక, రిజర్వేషన్ల ఖరారుపై స్థానిక నాయకుల్లో ఉత్కంఠ నెలకొంటోంది. మరోవైపు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. జూలైలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తున్నట్లు సమాచారం.

వ్యూహ రచనలో పార్టీలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని అధికార పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఏడాదిన్నరలో అమలు చేసిన పథకాల వల్ల కాంగ్రెస్‌కు ప్రజలు మరోసారి అండగా నిలిచేందుకు ఉపకరిస్తాయని భావిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పథకాల వల్ల అనేక మంది లబ్ధి పొందుతున్నారని లెక్కలు వేస్తోంది. కాగా ఇదే సమయంలో ఆరు గ్యారెంటీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు బ్యాంకును పెంచుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. కేసీఆర్ కుటుంబంలో తలెత్తిన అంతర్గత వైరుధ్యం, ముఖ్యంగా కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత తిరుగుబాటు పరిణామాలు బీఆర్ఎస్ క్యాడర్‌ను కలవరపెడుతున్నాయి. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే తలెత్తే అయోమయం, అనిశ్చిత పరిస్థితుల వల్ల స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ క్యాడర్ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టగలదా ? అన్న చర్చ జరుగుతోంది.

ఆశావహుల హడావుడి


ఎన్నికల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ ఆశావహులు మాత్రం ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ఆకర్షించే కార్యక్రమాలు మొదలు పెట్టారు. మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనీ, అప్పటి వరకు ఆగడం ఎందుకన్నట్లు ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఆశావహులు తమ బలాన్ని, బలగాలను కూడగట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యేనాటికి అన్ని సిద్ధం చేసి పెట్టుకోవడంపై దృష్టి సారించారు.

అధ్యక్షా..

ఉప సభాపతిగా రాంచందర్ నాయక్

- డోర్నకల్ ఎమ్మెల్యేను వరించిన అత్యున్నత పదవి
- మానుకోట జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం
- 2023లో తొలిసారిగా చట్టసభలో అడుగు

మహబూబాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్ జాటోత్ రాంచందర్‌నాయక్‌ను అత్యున్నత పదవి వరించింది. డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంచందర్‌నాయక్. 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్‌పై విజయం సాధించి తొలిసారి చట్టసభల్లోకి అడుగు పెట్టారు. డిసెంబర్ 15న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా రాంచందర్‌నాయక్ నియామకమయ్యారు. 18 నెలలుగా ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్న ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యాంగబద్ధ అత్యున్నత పదవి డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు. ఇది మహబూబాబాద్ జిల్లాకు దక్కిన గౌరవంగా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్పంచ్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు..

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం బొమ్మకల్లు సర్పంచ్‌తండాకు చెందిన జాటోతు రాంచందర్‌నాయక్ ఉస్మానియా నుంచి ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ సర్జన్ పట్టాలు పొంది సూర్యాపేట జిల్లా కేంద్రంలో శివసాయి ఆస్పత్రిని స్థాపించి వైద్య సేవలందించారు. ఆయన సతీమణి ప్రమీల కూడా గైనకాలజిస్ట్‌గా వైద్య వృత్తినే నిర్వహిస్తూ వస్తున్నారు. రాంచందర్‌నాయక్ అన్న జాటోతు నెహ్రూనాయక్ మొదట్నుంచి తొర్రూరు ప్రాంత రాజకీయాల్లో చురుకైన నేతగా ఎదుగుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్దకు వెళ్లిన సందర్భంలో రాంచందర్‌నాయక్‌ను చూసి మంచి రాజకీయ భవిష్యత్ ఉందని చెప్పడంతో పాటు అన్న రాజకీయ వారసుడిగా టీడీపీలో చేరిపోయారు. అక్కడ్నుంచే డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాల్లో ప్రవేశించారు. 2006లో టీడీపీ అనుబంధ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2014లో టీడీపీ నుంచి డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరారు. 2018లో కాంగ్రెస్ పార్టీ తరుపున డోర్నకల్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా 2023లో జరిగిన ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అసాధారణ మెజార్టీతో విజయం సాధించారు. రాంచందర్‌నాయక్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపునిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పక్షం రోజుల్లోనే ఆయన్ను ప్రభుత్వ విప్‌గా నియమించారు. తాజాగా రాంచందర్‌నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు.

రాంచందర్‌నాయక్ ప్రొఫైల్

పేరు : జాటోతు రాంచందర్‌నాయక్
పుట్టిన తేదీ : 05-05-1974
పుట్టిన స్థలం : బొమ్మకల్లు (తొర్రూరు మండలం)
తల్లిదండ్రులు : రాములునాయక్-మారోనిబాయి
భార్య : డాక్టర్ ప్రమీల
పిల్లలు : శివతరుణ్, శివసాకేష్
విద్యార్హత : ఎంబీబీఎస్, ఎంఎస్ జనరల్ సర్జన్

కన్నీటి గోదారి


శివమనోజ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


సాగర్ మృతదేహం

(5వ పేజీ తరువాయి)

పట్టి మధుసూదన్(18), ఉదయం 11.16గంటలకు మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెడ్ల రాంచరణ్(17), చివరగా ఉదయం 11.45గంటలకు అంబట్‌పల్లికి చెందిన పట్టి శివమనోజ్(15) మృతదేహాన్ని బయటకు తీశారు. సుమారు ఏడు గంటల పాటు శ్రమించిన రెస్క్యూ బృందాలు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చివరగా ఇద్దరు ఆచూకీ దొరకకపోవడంతో గజ ఈతగాళ్ల సహాయంతో సుమారు 100మీటర్ల మేర వల వేసి వెలికితీశారు. ఈ రెస్క్యూలో ఎస్‌డీఆర్ఎఫ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలోని 20మంది బృందం, 8 మంది డీడీఆర్ఎఫ్, 8 మంది సింగరేణి, 8 మంది అగ్నిమాపక సిబ్బందితో పాటు భూపాలపల్లి ఏఎస్పీ, కాటారం డీఎస్పీ, ఒక సీఐ, ఐదుగురు ఎస్సైలు.. మొత్తంగా 100మంది పాల్గొన్నారు. ఘటన జరిగినప్పటి నుంచి మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ రెస్క్యూకు తగు ఏర్పాట్లు చేసి రాత్రి నుంచి మృతదేహాలను వెలికితీసేంత వరకు అక్కడే ఉన్నారు.

మిన్నంటిన రోదనలు

గోదావరి నదిలో శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో యువకులు గల్లంతు కాగా, రాత్రంతా వారి కుటుంబ సభ్యులు గోదావరి నదిలోనే ఉన్నారు. గోదావరి తీరంలో రాత్రంతా యువకుల కుటుంబ సభ్యుల రోదనలూ మిన్నంటాయి. నువ్వెప్పుడొస్తావు కొడకా.. అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అందరిని కలచివేసింది. గల్లంతైన వారితో బతికి బయటపడ్డ మరో యువకుడు పట్టి శివమణికంఠ తన బంధువులు, స్నేహితులను కళ్ల ముందే కోల్పోవడాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. కొడుకులిద్దరూ, మేనల్లుడు కళ్లముందే కనుమరుగై పోతున్న ఏం చేయలేని అ చేతన స్థితిలో పడి పోయానంటూ పట్టి వెంకటస్వామి తీవ్రంగా రోదించాడు.

అన్నా.. కాపాడూ..!

గోదావరి నదిలో స్నానం చేసిన యువకులు అంతా ఒడ్డుకు చేరుకున్నారు. పట్టి వెంకటస్వామి చిన్న కొడుకు పట్టి శివమనోజ్ డాడీ.. మళ్లోసారి స్నానం చేస్తానంటూ మరో ఇద్దరు యువకులను తీసుకుని వెళ్లారని.. ఇంతలోనే ఇసుక మాటున ఉన్న కయ్యలో పడి మునుగుతుండగా అన్నయ్యా.. కాపాడూ.. అంటూ తమ్ముడు శివమనోజ్ వేసిన కేకలకు అన్న మధుసూదన్ చలించాడు. తమ్ముడితోపాటు ఆ ఇద్దరు యువకులను రక్షించేందుకు వెళ్లినట్లు వారి బంధువులు తెలిపారు. మధుసూదన్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ప్రవాహంలో గల్లంతవుతున్న వారిని రక్షించే క్రమంలో వీరంతా ఆ కయ్య(లోతైన గోతి)లో పడి ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ఇలా తమ్ముడికోసం అన్న వారికోసం వారి బంధువులు ఇలా ఒకరిరొక్కరూ అంతా కండ్లముందే గల్లంతవడం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో..

గోదావరినదిలో యువకుల గల్లంతైన విషయం తెలిసిన వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్‌తో పాటు ఎస్పీలకు సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశంతో కదిలిన అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.


రక్షిత్ మృతదేహం


మధుసూదన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రాంచరణ్ మృతదేహం

అందరిదీ కూలీ కుటుంబ నేపథ్యమే..

గోదావరి నదిలో గల్లంతైన ఆరుగురు యువకుల కుటుంబాలది కూలీయే జీవనాధారం. అంబట్‌పల్లికి చెందిన పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్‌ల తల్లిదండ్రులు పట్టి వెంకటస్వామి-యశోద వృత్తిరీత్యా ఆటోతో పాటు కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నా రు. మధుసూదన్ బీటెక్ చదువుతుండగా.. శివమనోజ్ ఇటీవలే టెన్త్ పూర్తి చేసుకున్నాడు. వీరికి మొ త్తం నలుగురు సంతానం కాగా, ఇద్దరు అమ్మాయి లు, ఇద్దరు అబ్బాయిలు. ఈప్రమాదంలో ఇద్దరు అబ్బాయిలను కోల్పోయారు. కొర్లకుంటకు చెందిన బొల్లెడ్ల రాంచరణ్ తల్లిదండ్రులూ బొల్లెడ్ల వెంకన్న-స్వర్ణలు కూలీలే. వీరికి ఇద్దరు సంతానం కాగా, పెద్దవాడు రాంచరణ్ డిగ్రీ చదువుతున్నాడు. అంబట్‌పల్లికి చెందిన కర్నాల సాగర్ తల్లిదండ్రులు కర్నాల సమ్మక్క-సమ్మయ్యలు వృత్తిరిత్యా వడ్రంగి కూలీ. వీరికి సాగర్, స్రవంతి కవలలు. వీరిద్దరూ ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నారు. కొర్లకుంటకు చెందిన పసుల రాహుల్ తల్లిదండ్రులు పసుల శ్రీనివాస్-లక్ష్మి ఇద్దరు సంతానం కాగా, వృత్తిరీత్యా కూలీ. రా హుల్ చిన్నవాడు.. ప్రస్తుతం ఇతను ఇంటర్ చదువుతున్నాడు. అంబట్‌పల్లికి చెందిన తొగరి రక్షిత్ తల్లిదండ్రులు రక్షిత్ రాజు-సాంబలు హమాలీలు. వీరికి ఇద్దరు సంతానం కాగా, రక్షిత్ పెద్దవాడు. ప్రస్తుతం ఇంటి వద్దే 9వ తరగతి చదువుతున్నాడు.

కోతులకు చెక్

- ఇళ్లకు సోలార్ ఫెన్సింగ్
- దొంగల బారి నుంచీ రక్షణ
- ఫెన్సింగ్‌కు ఏమైనా తాకితే సైరన్
- ఇల్లు చుట్టూ 9 వరుసలతో ఏర్పాటు

భీమదేవరపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కోతుల బెడద నుంచి తమ ఇళ్లను కాపాడుకునేందుకు ఇంటి చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి చెక్ పెడుతున్నారు. దీంతో పాటు దొంగల బారి నుంచి కూడా ఇళ్లను కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు. సోలార్ ఫెన్సింగ్ గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఏర్పాటు చేస్తుండడం ఆసక్తికరంగా ఉంది. కోతులు ఇల్లు పీకి పందిరి వేస్తాయని ఓ సామెత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉండడం, ఇళ్లలోకి కోతులు వచ్చి ప్రజలను గాయపరచడం, ఇంట్లోని వస్తువులను చిందరవందర చేయడం జరుగుతుంది. దీంతో కోతుల బెడద నుంచి తప్పించుకోవడానికి ఇళ్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫెన్సింగ్‌కు ఇంటి చుట్టూ 9 వరుసలు ఏర్పాటు చేస్తారు. తద్వారా దొంగల బెడద కూడా ఉండదు. ప్రతీ నాలుగు ఇంచులకు ఒకటి చొప్పున లైన్ ఏర్పాటు చేస్తారు. 9 లైన్లు ఏర్పాటు చేయడంతో దొంగలు ఇంట్లోకి వెళ్లలేరు. ఫెన్సింగ్‌కు కోతులు, మనుషులు, దొంగలు వచ్చి తాకిన వెంటనే సైరన్ వస్తుంది. దీంతో ఆ ఇంటి యజమానితో పాటు చుట్టూ పక్కల వారు కూడా అప్రమత్తం అవుతారు. రాత్రివేళ చోరీలకు వస్తే అలారం మోగడంతో చుట్టుపక్కల వారు అలర్ట్ అయ్యి దొంగలను తరిమికొట్టే అవకాశం ఉంటుంది. సుమారు 9 వరుసలు మూడు ఫీట్ల ఎత్తు ఉంటుంది. 12 కేవీ లైన్ ఉండడంతో వీటిని ఎవరైనా తాకితే విద్యుత్ షాక్ వస్తుంది. కానీ ప్రాణం పోయే హానీ మాత్రం జరగదు. ప్రస్తుతం గ్రామాల్లో సైతం లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లను నిర్మించుకుంటున్నారు. కోతులు, దొంగల బారి నుంచి కాపాడుకునేందుకు సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఫీటుకు రూ. 300 వరకు ఖర్చు అవుతుంది. ఒక ఇంటికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలంటే దాదాపుగా రూ. 90 వేల వరకు ఖర్చు వస్తుంది. మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు స్వగ్రామం వంగరలో ఏషియన్ సోలార్ కంపెనీ ఇంటి చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు.



వంగరలో ఇంటికి ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్

కోతుల బెడద తప్పింది
మధుసూదన్‌రెడ్డి, వంగర



లక్షలాది రూపాయలు వెచ్చించి ఇల్లు నిర్మించుకున్నాం. కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు పలు ఆలోచనలు చేశాం. చివరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే అటు కోతులు, ఇటు దొంగల బారి నుంచి రక్షించుకోవచ్చని ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశాం. ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ. 80వేల ఖర్చు అయ్యింది. ఇప్పుడు కోతులు మా ఇంటి వైపు రాకపోవడంతో ఆనందంగా ఉంది.

రిక్త హస్తం!

(5వ పేజీ తరువాయి)

కట్టబెట్టారు. నల్లగొండ జిల్లాలో కూడా ముగ్గురికి అవకాశం ఇచ్చారు. కానీ పది మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌కు అందించిన ఓరుగల్లుకు మాత్రం రెండు మంత్రి పదవులేనా? అనే చర్చ జరుగుతోంది. ఇటీవల స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతో ఈ సంఖ్య 11కు చేరింది. అయినప్పటికీ మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్‌కు ప్రాధాన్యత దక్కలేదనే అసంతృప్తి నేతల్లో వ్యక్తం అవుతోంది. అయితే డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్‌గా ఉన్న రామచంద్ర నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టారు. ఈ పదవితోనే ఓరుగల్లు నేతలను సంతృప్తిపరిచేందుకు అధిష్ఠానం ప్రయత్నం చేసిందనే చర్చ ఉంది.

ఎమ్మెల్యేల ప్రయత్నాలు విఫలం

ఓరుగల్లు ఎమ్మెల్యేల్లో కాంగ్రెస్‌లో అత్యంత సీనియర్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. పాతికేళ్లకుపైగా కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులను చేపట్టారు. పార్టీ మారకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. తొలిసారిగా 2023లో పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. రెండోసారి మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు. అయితే తొలిసారిగా గెలిచావు కాబట్టి మంత్రి సీటు కష్టమేనని అధిష్ఠానం బుజ్జగించింది. అయితే ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణంలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వాకాటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లు కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వారే కావటంతో నాయిని వర్గీయుల్లో అసంతృప్తి నెలకొంది. ఇతరులకు అడ్డురాని తొలిసారి గెలుపు.. పాతికేళ్లకు పైగా సేవలు అందించిన తమ నేతకు మంత్రి పదవికి ఎట్లా అడ్డువస్తుందని నాయిని వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. ఇక నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి 2014లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుంటే.. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. అప్పటి ప్రభుత్వం బీఆర్ఎస్‌లో చేరాలని ఇచ్చిన ఆఫర్‌ను తోసిపుచ్చారు. పార్టీపై అభిమానంతో కాంగ్రెస్‌లో కొనసాగిన దొంతి 2018లో ఓడిపోయినప్పటికీ.. తిరిగి 2023లో మరోసారి హస్తం టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. సీనియర్ నేతగా ఉన్న దొంతి మంత్రి పదవి కోసం ఏఐసీసీ నేతలను ఢిల్లీలో కలిసి ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ దొంతికి మంత్రి చాన్స్ రాకపోవటంతో అయన వర్గీయుల్లో నిరాశ వ్యక్తం అవుతోంది. వీరితో పాటు సీనియర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎంగా పని చేసిన కడియం శ్రీహరికి మంత్రివర్గంలో అవకాశం దక్కవచ్చుననే ప్రచారం జరిగింది.

రెడ్డివర్గంలో అసంతృప్తి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో ఐదు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు నియోజకవర్గాలే. మిగిలిన ఏడు స్థానాల్లో ఐదు చోట్ల రెడ్డి వర్గం, ఒక చోట వెలమ వర్గం, మరో స్థానంలో బీసీ మహిళ విజయం సాధించారు. అత్యధికంగా కాంగ్రెస్‌లో నలుగురు రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ పదవులపరంగా అధిష్ఠానం తమను నిర్లక్ష్యం చేస్తోందనే చర్చ పార్టీలోని రెడ్డి వర్గం నేతల్లో జరుగుతోంది. మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు మంత్రులు ఒకరు ఎస్టీ, మరొకరు బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఇక ఇటీవల టీపీసీసీకి అనుబంధంగా ప్రకటించిన రాజకీయ వ్యవహారాల కమిటీలో ఉమ్మడి వరంగల్ నుంచి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్‌లకు చోటు దక్కగా, అడ్వయిజరీ కమిటీలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు అవకాశం ఇచ్చారు. కీలకమైన ఈ రెండు కమిటీల్లో రెడ్డి నేతలకు ప్రాధాన్యత ఇవ్వకపోవటంపై అసంతృప్తిగా ఉన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి మంత్రి పదవికి బదులుగా డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారనే ప్రచారం జరిగింది. ఆ పదవి కూడా రామచంద్రనాయక్‌కు దక్కటంతో రెడ్డివర్గంలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న రేవూరి ప్రకాష్‌రెడ్డి సేవలను పార్టీ పరిగణంలోకి తీసుకోవటం లేదనే చర్చ కూడా ఉంది. అయితే మరో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉండటం.. రెడ్డివర్గం నేతలను మంత్రివర్గంలోకి ఈసారి తీసుకోకపోవటంతో ఇక మూడోసారి విస్తరణలోనైనా ఓరుగల్లుకు అవకాశం దక్కుతుందా? అనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

కొండాకు ప్రాధాన్యత శాఖలు దక్కేనా ?

కొత్తగా ముగ్గురు మంత్రులు ప్రమాణస్వీకారం చేయటంతో మంత్రుల శాఖల్లో మార్పులు జరుగుతాయనే ప్రచారం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న సీతక్కకు కీలకమైన పంచాయితీరాజ్, శిశు సంక్షేమ శాఖలను అప్పగించారు. అయితే సీనియర్ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు ఆమె స్థాయికి తగిన శాఖలను కేటాయించలేదనే చర్చ ఉంది. దేవాదాయశాఖతో పాటు అటవీశాఖలను సురేఖకు కేటాయించారు. ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణతో కొత్త మంత్రులతో పాటు కొంతమంది మంత్రుల శాఖలు మారుతాయనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఓరుగల్లుకు చెందిన కొండా సురేఖకు కీలక శాఖలు కేటాయిస్తారా? అనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబధాలతో పాటు సీనియర్ మంత్రిగా అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సురేఖతో పాటు సీతక్కకు కూడా కీలకమైన శాఖలు అప్పగించే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి.




నందిహిల్స్ కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక



నందిహిల్స్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం

న్యూశాయంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 31వ డివిజన్‌లోని నందిహిల్స్‌కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నికైంది. ఆదివారం నందిహిల్స్‌లోని న్యూసైన్స్ పీజీ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెసరు నర్సింహారెడ్డి గెలిచినట్లు ఎన్నికల అధికారులు సీహెచ్ మొగిలి, రావుల శ్రీధర్‌లు ప్రకటించారు. అధ్యక్షులు పెసరు నర్సింహారెడ్డితోపాటు ప్రధాన కార్యదర్శిగా బిల్లా రవికుమార్, కోశాధికారిగా శ్రీరాముల రవీందర్‌లు ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నందిహిల్స్‌కాలనీ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సహకరించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

చెరువుల మట్టి లూటీ

(5వ పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్రైవేట్ స్థలాల్లోకి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

చెరువులు, కుంటలు, వ్యవసాయ భూముల్లో మట్టిని తవ్వడానికి రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎక్కడ కూడా అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో అటు ప్రభుత్వ ఆదాయానికి సైతం మట్టి మాఫియా గండి కొడుతున్నది. ఇక మైనింగ్ శాఖ అధికారుల జాడే ఈ ప్రాంతంలో లేకపోవడంతో మైనింగ్ శాఖ సాకుచూపుతూ రెవెన్యూ అధికారులు అడపదడపా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేయడం, స్వల్ప జరిమానాలతో వదిలేస్తున్నారు. దీంతో అక్రమార్కులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు.

అధికార పార్టీ జిల్లా నేత కనుసన్నల్లో..

అధికార పార్టీ జిల్లాస్థాయి పదవిలో కొనసాగుతున్న ఓ వ్యక్తి ఈ ప్రాంతంలో మట్టి మాఫియాను తన కనుసన్నల్లో నడిపిస్తున్నాడని బాహాటంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న దామెర చెరువులో పెద్ద పెద్ద యంత్రాలతో మట్టిని తవ్విస్తూ దందా కొనసాగిస్తున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే తన అధికారం, పలుకుబడితో బెదిరింపులకు సైతం పాల్పడుతున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు మట్టి మాఫియా వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోతున్నట్లు సమాచారం.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపటొద్దు

రవిచంద్రారెడ్డి, తహసీల్దార్, నర్సంపేట

ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టవద్దు. చెరువులు, కుంటల్లో మట్టిని తవ్వడానికి ఇప్పటి వరకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని తవ్వినా, తరలించినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, రామాలయం, రెవెన్యూ కాలనీ, కేడీకాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, చోటీ మజీద్, కలెక్టరేట్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

వండర్ కిడ్స్ ప్లేస్కూల్ ప్రారంభం



విజయపాల్ కాలనీలో వండర్ కిడ్స్ ప్లేస్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని విజయపాల్ కాలనీలో ఏర్పాటు చేసిన వండర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తు బలపడాలంటే నాణ్యమైన ప్రాథమిక విద్య, క్రీడలు కీలకమన్నారు. ఇలాంటి విద్యా సంస్థలు నగర విద్యావ్యవస్థలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాత కోటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వండర్ కిడ్స్ ప్లే స్కూల్ సెక్రటరీ రమాదేవి, 59, 60 డివిజన్ల కార్పొరేటర్లు గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, దాస్యం అభినవ్‌భాస్కర్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ శ్రేణులు దొంతి సుదర్శన్‌రెడ్డి, ఎనుకొంటి పున్నంచందర్, మండల సమ్మయ్య, బీజేపీ శ్రేణులు రోకుల సతీష్, నాగపురి అశోక్, ఎం. రాంరాజ్ టీచర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం



కొత్త రవిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కాజీపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట బాపూజీనగర్‌లో ఆదివారం తేజోమయి మాల కులసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కొత్త రవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మార్యాల కృష్ణ, బండి విజయ్ మాట్లాడుతూ.. తమ సంఘం ముఖ్య సలహాదారులైన కొత్త రవి జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పేదలకు ఎలాంటి ఫీజులు లేకుండా వాదించాలని కోరారు. కార్యక్రమం లో సంఘం కోశాధికారి పప్పుల గోవర్ధన్, సంఘం నాయకులు సీహెచ్ కొమ్మాలు, కాందారి రాజమౌళి, సిరిల్ లారెన్స్, మైలారం శంకర్‌లు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కాజీపేట (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాజీపేటకు చెందిన వంద మందికి లేబర్‌కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై కార్డులు పంపిణీ చేసిన తర్వాత మాట్లాడారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా స్థానిక నాయకత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు. లేబర్‌కార్డుల అనేవి కార్మికుల హక్కులను పరిరక్షించే అమూల్యమైన పత్రం అన్నారు. మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బండి రాజేందర్, కె. జనార్ధన్, క్రాంతి భరత్, కొండ శివ, తదితరులు ఉన్నారు.

నిలువ నీడలేక అవస్థలు



హనుమకొండ ఏనుగులగడ్డ ఆర్టీసీ బస్టాప్ వద్ద ఎండలో నిలబడి వేచిచూస్తున్న ప్రయాణికులు

- ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ కరువు
- దుకాణాల నీడలో వేచి చూస్తున్న జనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

హనుమకొండ చౌరస్తా, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ చౌరస్తాకు కూతవేటు దూరంలోని ఏనుగులగడ్డ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు షెల్టర్ లేక పోవడంతో ఆక్కడి నుంచి వివిధ ప్రదేశాలకు వెళ్లే ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయల్సి వస్తుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరే పరకాల, ములుగు, నర్సంపేట, ఖమ్మంతో పాటు వివిధ జిల్లాల వైపుగా ప్రయాణం కొనసాగించే ఆర్టీసీ బస్సులు ఏనుగులగడ్డ బస్టాప్ నుంచి నిత్యం పదుల సంఖ్యలో వెళ్తుంటాయి. గతంలో ఈ ప్రాంతంలో ఒక ఆర్టీసీ బస్సు షెల్టర్ ఉండేది. కానీ కాలక్రమేణ బస్సు షెల్టర్ కనుమరుగు కావడంతో ఇక్కడ నుంచి వివిధ ప్రదేశాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు నిలువ నీడలేక పోవడంతో పాటు కనీసం కూర్చునే వసతి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు దుకాణాల ముందు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్డు పైనే బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. బస్సుల కోసం వచ్చిన ప్రజలకు నీడ లేక దుకాణాల ముందు నిలబడుతున్నారు. పలుమార్లు దుకాణాల యజమానులు నుంచి ఛీత్కారాలను సైతం ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో ప్రయాణం చేయాలనుకునే వారు బస్సుల కోసం మండుటెండలోనే ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నదికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఏనుగులగడ్డ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రయాణికులు వేడుకుంటున్నారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం..

కనుకుంట్ల రమేష్, ప్రయాణికుడు



నిత్యం నేను హనుమకొండ ఏనుగులగడ్డలోని బస్టాప్ నుంచి మా స్వగ్రామానికి ఆర్టీసీ బస్సులో ప్రయాణం కొనసాగిస్తున్నా. ఏళ్ల తరబడి ఇక్కడ బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నానా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడం, గంటల తరబడి బస్సుల కోసం నిలబడి కాళ్లనొప్పులు వస్తున్నాయి. ఇక్కడ బస్సు షెల్టర్ లేని కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలి.

మాగంటి గోపీనాథ్ అకాల మరణం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



గోపీనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత మాగంటి గోపీనాథ్ అకాల మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి దాస్యం వినయ్‌భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గోపీనాథ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. గోపినాథ్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని నష్టమన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఒక సైనికుడిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు, నమ్ముకున్న పార్టీ శ్రేణులకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, సీనియర్ నాయకులు జానకీరాములు, డివిజన్ అధ్యక్షుడు సదాంత్, ఖలీల్, చందర్, నాయకులు ఇమ్మడి రాజు, శ్రీధర్, ఇస్మాయిల్, సుధాకర్, రవి, ప్రశాంత్, రాకేష్‌యాదవ్, వినీల్, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మడికొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి పోలీసులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహదారులలో మూల మలుపులు, రోడ్డు క్రాసింగ్స్ వద్ద చెట్లు గుబురుగా పెరిగి వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించడం లేదు. దీంతో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆదివారం ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో వెళ్లి ఎక్స్‌కవేటర్ సహాయంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రదేశాల్లో ఉన్న చెట్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా వాహనదారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై, పోలీసు సిబ్బందిని అభినందించారు.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవిపై సంబరాలు

వడ్డెపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీతో పాటు ముదిరాజ్ సంఘం నేతలు ఆదివారం హనుమకొండలో సంబరాలను నిర్వహించుకున్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ఒయాసిస్ బాలుర అనాథాశ్రమంలో తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నేత మండల సమ్మయ్య అనాథ పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వద్దిరాజు చంద్రప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నేత జనగాం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెపా కార్యాలయంలో సంబరాలు

మంత్రిగా వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేయడాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలోని మెపా కార్యాలయంలో సంబరాలను నిర్వహించుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర, జిల్లా నాయకులు పులి ప్రభా కర్, వెంకటరమణ, పొన్నం రాజు, నీరటి రాజ్యం, దండు చిరంజీవి, రామకృష్ణ, బోనాల రమేష్, పులి మహేష్ పాల్గొన్నారు.

భగవాన్‌దాస్ స్ఫూర్తితో ముందుకు సాగుతాం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ భగవాన్‌దాస్ అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కార్మిక నేత, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, దివంగత కామ్రేడ్ బీఆర్ భగవాన్‌దాస్ 95వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ అశోక జంక్షన్‌లోని బీఆర్ భగవాన్‌దాస్ విగ్రహానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ నాయకులు ఎల్లేష్, సారంగపాణి, రాజమౌళి, రవి, రాము, మేఘన, జితేందర్, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి సుధాకర్, భగవాన్‌దాస్ కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



భగవాన్‌దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, సీపీఐ నాయకులు శ్రీనివాస్‌రావు తదితరులు

సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం

న్యూశాయంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రం చేస్తూ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం సీపీఐ హనుమకొండ మండల 2వ మహాసభ మండల కార్యదర్శి యశబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కర్రె భిక్షపతి హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ ముస్లింలపైన, రైతులపైన, దళితులపైన దాడులు కొనసా గిస్తూ ఇప్పుడు నక్సలైట్లను ఎన్‌కౌంటర్‌ల పేరిట మారణహోమం సృష్టిస్తున్నారన్నారు. ఈ మహాసభలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబో యిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కొట్టిపాక రవి, సంజయ్, విన య్ పాల్గొన్నారు. అనంతరం సీపీఐ నూతన హనుమకొండ దక్షిణ మండల సమితిని ఎన్నుకున్నారు.

శ్వేతార్కలో స్వాతి నక్షత్ర పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కాజీపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట విష్ణుపురి శ్వేతార్క మూల గణపతి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్రాన్ని పురస్క రించుకుని ఆలయంలో కొలవై ఉన్న ప్రహ్లాద సరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. దేవాలయ ఇంచార్జి దేవులపల్లి సదానందం ఆధ్వర్యంలో అర్చకులు రోహిత్ ఉపాధ్యాయ, హరికృష్ణ స్వామి అభిషేక పూజ క్రతువు నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసా ద వితరణ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితులకు మందుల పంపిణీ



హీమోఫిలియా బాధితులకు మందులను పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ, ఇంటన్స్ ఫార్మా ప్రతినిధులు

వరంగల్ మెడికల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని రెడ్ క్రాస్ సొసైటీ హాల్‌లో ఇంటస్ ఫార్మా సహకారంతో హీమోఫిలియా బాధితులకు మందులను పంపిణీ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, గౌరవ అతిథులుగా వైస్‌చైర్మన్ వెంకట్‌నారాయణగౌడ్, పాపిరెడ్డి, పుల్లూరు వేణుగోపాల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హీమోఫిలియా అనే వ్యాధి ఎంతో ఖర్చుతో కూడుకుందని, బాధితులకు ఎంతో ఇబ్బందిగా కూడా ఉంటుందని తెలిపారు. అలాగే హీమోఫిలియా వ్యాధి కలిగిన బాధితులకు హీమోఫిలియా వరంగల్ చాప్టర్ అండగా నిలవడం గర్వించదగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా హీమోఫిలియా సొసైటీకి అందిస్తున్న సహకారం భవిష్యత్‌లోనూ అందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంఘర్స్, హీమోఫిలియా వరంగల్ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ నారెడ్ల శ్రీనివాస్, హీమోఫిలియా బాధితులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హసన్‌పర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు అన్నారు. 55వ డివిజన్ పరిధిలోని భీమారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఆదివారం బడిబాట కార్యక్రమంలో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములై ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. భీమారం ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతోపాటు సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా డిజిటల్ బోధన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చేరాలు, శ్రీధర్, శ్రీలత, రాణి, సంయుక్త, దేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఇండోరియా

హసన్‌పర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం కేవీకే మామునూరు వారు మడిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త ఇండోరియా మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం గురించి చర్చించి వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరో శాస్త్రవేత్త జె.సాయికిరణ్ రైతులకు 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ, పాడిపశువులకు సంబంధించిన ప్రణాళికను, కార్యక్రమం ఉద్దేశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సాయిచంద్, ఏవో అడ్లూరి అనురాధ, ఏఈవోలు సుమన, కల్పన, అనూష, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

కేయూ క్యాంపస్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ ధ్వజమెత్తారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, ఎస్ఎంహెచ్ కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు చెల్లించడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల సర్టిఫికెట్లను ఫీజులు చెల్లించకపోవడంతో ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు ఇస్తోందని అన్నారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, మల్లేశ్, రణదీప్, రూపేశ్, అఖిల్, ప్రదీప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

టీనేజర్లు.. వీటికి దూరంగా ఉండాలి!

యుక్తవయసు పిల్లలు పాటించే కొన్ని అలవాట్లే వారి శారీరక, మానసిక సమస్యలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. టీనేజర్ల ఆరోగ్యాన్ని పాడుచేసే అలవాట్లు ఏమిటో చూద్దాం...

- చాలామంది టీనేజర్లు... మొబైల్ చూస్తూ గంటలు గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల ఒంటరితనం అలవాటై భావవ్యక్తీకరణ నైపుణ్యం దెబ్బతింటుంది. ఎక్కువ సమయం ఒకేచోట కూర్చుని లేదా పడుకుని ఉండడం వల్ల శారీరక శ్రమ లేక బరువు పెరగవచ్చు. మొబైల్‌ను తదేకంగా చూడడం వల్ల కళ్లు పొడిబారడం, ఎర్రబడడంతోపాటు దృష్టి సమస్యలు వస్తాయి.
- యుక్తవయసు పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్‌ను ఇష్టపడుతూ ఉంటారు. ప్రాసెస్ చేసిన చిరుతిళ్లు తింటూ చక్కెరలు అధికంగా ఉన్న కూల్‌డ్రింక్స్ తాగేస్తూ ఉంటారు. దీనివల్ల జీర్ణాశయం పనితీరు మందగిస్తుంది. కడుపులో ఆమ్లత్వం పెరుగుతుంది. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి.
- రాత్రిపూట సామాజిక మాధ్యమాలతో గడుపుతూ ఆలస్యంగా నిద్రపోతూ ఉంటారు. దీనివల్ల వారి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతాయి. చురుకుదనం లోపిస్తుంది. మెదడు పనితీరు కుంటుపడుతుంది. యుక్తవయసు పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర అత్యవసరం.



- కొంతమంది టీనేజర్లు తరచూ తమను తాము విమర్శించుకుంటూ ఉంటారు. రంగు, రూపురేఖల గురించి మధనపడుతూ ఉంటారు. దీనివల్ల వారిలో ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం తగ్గుతాయి. ఆందోళన, నిరాశ పెరుగుతాయి. ఈ విధమైన ధోరణి కాకుండా మంచి వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలి.
- ప్రతి పనినీ వాయిదా వేస్తూ ఉంటారు. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. ఎప్పటి పనిని అప్పుడే పూర్తిచేయడం, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి.
- ఉదయాన్నే నిద్రలేచి వ్యాయామం చేయడానికి బద్ధకిస్తూ ఉంటారు. దీనివల్ల శారీరక మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతుంది. టీనేజర్లు రోజూ కనీసం అరగంటసేపు వ్యాయామం చేయడం మంచిది.
- ఉదయం వేళల్లో అల్పాహారం తీసుకోవడానికి ఇష్టపడరు. దీనివల్ల జీవక్రియలు మందగించడం, పోషకాహార లోపం, రోగనిరోధక శక్తి తగ్గడం లాంటి సమస్యలు వస్తాయి.



మన చుట్టూ నైపుణ్యం ఉన్న మహిళలు అనేక మంది ఉంటారు. వారికి అవకాశాలు లభించటం కష్టమే! అలాంటి వారందరినీ ఒకే చోట చేర్చి.. అవకాశాలు కల్పిస్తే? స్వాతి నీలభట్లకు ఇలాంటి ఆలోచనే వచ్చింది. 'సీతా' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. నాలుగేళ్ల క్రితం ఆమె ప్రారంభించిన 'షీ జాబ్స్'కు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. 'సీతా' మొబైల్ యాప్ విడుదల నేపథ్యంలో స్వాతి తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.

'సీత'.. మహిళకు భరోసా..



సీతా యాప్ ఆలోచన ఎలా వచ్చిందనే విషయాన్ని వివరించే ముందు- షీ జాబ్స్ పోర్టల్ గురించి కూడా చెప్పాలి. ఈ పోర్టల్ కేవలం మహిళల కోసమే ఉద్దేశించినది. ఐటీలో పనిచేసే మహిళలు కొన్ని సందర్భాలలో ఉద్యోగానికి బ్రేక్ ఇస్తూ ఉంటారు. పిల్లలు పుట్టడం వల్ల కావచ్చు.. ఇంట్లో పెద్ద వాళ్లను చూసుకోవాల్సిన అవసరం వల్ల కావచ్చు.. ఇలా రకరకాల కారణాలు ఉంటాయి. ఒకసారి ఉద్యోగం మానేసిన తర్వాత వారికి మళ్లీ ఉద్యోగం దొరకాలంటే చాలా కష్టం. చాలా సార్లు జాబ్ కన్సల్టెంట్స్ దగ్గరే వీరి అప్లికేషన్లు ఆగిపోతాయి. ఎందుకంటే ఐటీ రంగంలో చాలా పోటీ తత్వం ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలు వస్తూ ఉంటాయి. ఉద్యోగంలో బ్రేక్ వస్తే వారికి ఈ టెక్నాలజీలు తెలుసా? లేదా అనే అనుమానం కంపెనీ వారికి వస్తూ ఉంటుంది. అందువల్ల జాబ్ బ్రేక్ ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వటానికి వారు సిద్ధంగా ఉండరు. ఇలాంటి వారందరికీ సాయం చేయటం కోసం నేను కోవిడ్ సమయంలో ఈ పోర్టల్‌ను ప్రారంభించాను. ఈ పోర్టల్‌లో ఉద్యోగం కావాల్సిన వాళ్లు ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. ఐటీ కంపెనీల వారు తమ వద్ద ఉన్న ఉద్యోగ అవకాశాలను పోర్టల్‌లో పోస్ట్ చేస్తూ ఉంటారు. ఇదే విధంగా పోర్టల్ తరుపున ఇండియా, అమెరికాలో ఉన్న కంపెనీలకు మేము కూడా అప్లికేషన్లు పంపుతూ ఉంటాం. అంతే కాకుండా మా పోర్టల్‌లో చేరిన వారికి కొత్త టెక్నాలజీలలో శిక్షణ ఇస్తూ ఉంటాం. ఉదాహరణకు ఒక అమ్మాయి ఇంజినీరింగ్ చదివిందనుకుందాం. చదువు పూర్తయిన వెంటనే ఆమెకు పెళ్లి అయిపోయిందనుకుందాం. పిల్లలు పుట్టడం.. వారు పెద్ద వాళ్లు అయ్యేదాకా ఆగటం దాకా ఒక ఐదేళ్లు గ్యాప్ వచ్చిందనుకుందాం. అప్పుడు ఆ అమ్మాయికి కొత్త కొత్త టెక్నాలజీలు తెలియవు. అలాంటి వాళ్లకు శిక్షణ అవసరం అవుతుంది. ఈ శిక్షణ వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది కేవలం మహిళలను ఉద్దేశించిన పోర్టల్ కాబట్టి.. మహిళా ఉద్యోగుల సంఖ్య పెంచాలనుకొనే కంపెనీలు మా పోర్టల్‌లో ఉన్న అప్లికేషన్లను తీసుకుంటూ ఉంటాయి. ఇలా ఇప్పటి వరకు మా పోర్టల్‌కు సుమారు లక్ష అప్లికేషన్లు వచ్చాయి. వీరిలో చాలా మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి. అయితే ఇది కేవలం ఐటీ.. ఐటీ ఆధారిత టెక్నాలజీలలో పనిచేసే వారికి ఉద్దేశించినది మాత్రమే. కానీ నాకు షీ జాబ్స్ పోర్టల్‌కు అనేక రకాల మెయిల్స్ వచ్చేవి. ఈ మెయిల్స్‌లో కొందరు తాము బాగా పెయింటింగ్ వేస్తామని.. తమకు మేకప్ గురించి తెలుసని.. తమకు ఏవైనా అవకాశాలు లభిస్తాయా అని అడిగేవారు. ఇలాంటి వారందరి కోసం ఒక ఒక ప్రత్యేకమైన యాప్‌ను తయారుచేస్తే బావుంటుందనే ఆలోచన వచ్చింది. ఈ యాప్‌లో మేకప్, డిజైనింగ్, ఫ్యాషన్, రైటింగ్- ఇలా రకరకాల రంగాల్లో నైపుణ్యం ఉన్న మహిళలు తమ అప్లికేషన్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ రంగాల్లో ఉద్యోగాలు లేదా సేవలు అవసరం ఉన్నవారు ఈ యాప్‌కు వెళ్లి తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారు. అంటే నైపుణ్యం ఉన్న మహిళలు అందరూ ఒకే చోట కంపెనీల వారికి లభ్యమవుతారు. ఇదే విధంగా మహిళలు ఉద్యోగాల కోసం వేర్వేరు చోట్ల వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. కేవలం ఉద్యోగాలు మాత్రమే కాదు. తాము అందించే సేవల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ యాప్‌కు కూడా మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నాను.

> **సమస్యలు అనేకం..**
>
> పెద్ద పెద్ద కంపెనీలలో పనిచేసే ఉమెన్ లీడర్స్ నా పోర్టల్‌ను సపోర్టు చేస్తున్నారు. వీరి సహకారం వల్లే నాకు- 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ విన్నింగ్ ఉమెన్ అవార్డు'.. '100 ఉమెన్ టూ నో ఇన్ అమెరికా' గుర్తింపు వంటివి లభించాయి. ఇక ఐటీ కంపెనీలలో ఉన్నత స్థానాల్లో పనిచేసే మహిళలకు కూడా అనేక సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. సాధారణంగా ఐటీ కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో పురుషులే ఎక్కువ మంది ఉంటారు. ఉన్నత స్థానాల్లో 95 మంది పురుషులు.. ఐదుగురు మహిళలు ఉన్నారనుకుందాం. అప్పుడు పురుషులు చెప్పేదే ఎక్కువగా వినబడుతూ ఉంటుంది. అంతే కాదు. ఎవరైనా ఒక మహిళ - ఏదైనా ఒక విషయాన్ని బలంగా చెబితే - "ఈమె చాలా ఎగ్రసివ్.. లేదా ఎమోషనల్" అని ముద్ర వేసేవారు ఉంటారు. వీటన్నింటినీ తట్టుకొని లీడర్‌షిప్ స్థానాల్లోకి ఎదగటం అంత సులభం కాదు.

ఈ ఆలోచన వెనక..

నా జీవితంలో ఎదుర్కొన్న కొన్ని పరిస్థితుల వల్ల నేను 'షీ జాబ్స్'ను, 'సీతా యాప్'ను ప్రారంభించాను. నేను కూడా చాలా మంది అమ్మాయిలలాగే ఇంజినీరింగ్ చదివాను. ఉద్యోగంలో చేరా. ఆ తర్వాత పెళ్లి అయింది. ఒక పిల్లవాడు పుట్టాడు. రెండేళ్లు వచ్చేసరికి.. తనకు ఆటిజం ఉందని తేలింది. మా బాబుకు మంచి వైద్య సదుపాయాలు అందించటం కోసం మేము అమెరికా వెళ్లిపోయాం. ఆ సమయంలో నేను ఒక వైపు ఉద్యోగం చేసేదాన్ని. మరో వైపు బాబును చూసుకొనేదాన్ని. దీనితో నాపై విపరీతమైన ఒత్తిడి ఉండేది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. సాధారణంగా కంపెనీల్లో ఉద్యోగులకు కొంత వరకు మాత్రమే వెసులుబాటు ఉంటుంది. అంతకు మించి వెసులుబాటు కోసం ప్రయత్నిస్తే ఇబ్బంది అవుతుంది. తోటి ఉద్యోగుల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతుంది. ఇలాంటి అనేక కారణాల వల్ల నేను ఉద్యోగం మానేసి ఒక సొంత కంపెనీ ప్రారంభించాను. నాలాంటి తల్లులను మరి కొందరిని నా కంపెనీలో ఉద్యోగస్తులుగా తీసుకున్నాను. మేమందరం కలిసి పనిచేయటం వల్ల కంపెనీ పైకి వచ్చింది. కానీ నాలాంటి వారెందరో ఉన్నారు. వారందరికీ అవకాశాలు రాకపోవచ్చు. వారి కోసమే పోర్టల్‌ను.. యాప్‌ను ప్రారంభించాను.

> **నాన్న ప్రోత్సాహమే!**
>
> మా నాన్నగారు దుర్గాప్రసాద్ సీనియర్ జర్నలిస్టు. ఆయన ఆంధ్రజ్యోతిలో పని చేసేవారు. జర్నలిస్టు యూనియన్ లీడర్ కూడా. ఆయన చిన్నప్పటి నుంచి నన్ను స్వేచ్ఛగా పెంచారు. జీవితంలో ఏదో ఒకటి సాధించాలని చెప్పేవారు. ఆయనకు జర్నలిజం అంటే పిచ్చి. ఆంధ్రజ్యోతి పేరిట నన్ను ఇంట్లో జ్యోతి అని పిలిచేవారు. ఆయన ఇప్పుడు లేరు. కానీ నేను పోర్టల్ పెట్టినా.. యాప్ అభివృద్ధి చేసినా, చిన్నప్పటి నుంచి ఆయన ఇచ్చిన ప్రోత్సాహమే కారణం.

సీవీఎల్ఎన్ ప్రసాద్

తలనొప్పి తగ్గేదెలా?



ఒత్తిడి, ఆందోళన, అనవసరమైన ఆలోచనలు, వాతావరణ కాలుష్యం లాంటి కారణాల వల్ల తలనొప్పి రావడం సర్వ సాధారణం. తలనొప్పి అనిపించగానే మందుబిళ్ల మింగకుండా కొన్ని ఇంటి చిట్కాలతో ఉపశమనం పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- ఒక్కోసారి తీవ్రమైన భావోద్వేగాలు తలనొప్పికి కారణమవుతుంటాయి. అలాంటప్పుడు ధారాళంగా గాలి వీచే ప్రదేశంలో కూర్చుని కళ్లు మూసుకుని శ్వాస మీద ధ్యాస నిలపాలి. ఇలా పావుగంటసేపు చేస్తే ప్రయోజనం కనిపిస్తుంది.
- కొంతమంది పని ధ్యాసలో పడి మంచి నీళ్లు తాగడం మార్చిపోతుంటారు. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గి నిర్జలీకరణ తలెత్తుతుంది. ఫలితంగా కళ్లు తిరగడం, తలనొప్పి ప్రారంభమవుతాయి. వెంటనే ఒక గ్లాసు చల్లటి మంచినీరు తాగితే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. దాహం అనిపించపోయినా గంటకు ఒకసారి నీరు తాగడం మంచిది.
- పలుచని చేతి రుమాలులో కొన్ని ఐస్ ముక్కలు చుట్టి తల మీద, నుదుటి మీద పెట్టుకుంటే తలనొప్పి చాలావరకు తగ్గుతుంది. వేసవికాలంలో ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. అదే చలికాలమైతే గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే ఫలితం కనిపిస్తుంది.
- మాడు మీద, కణతల మీద చేతి వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ మెల్లగా మర్దన చేస్తే తలనొప్పి తగ్గిపోతుంది. మంచి నిద్ర కూడా వస్తుంది!
- చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని కొద్దికొద్దిగా నములుతూ రసం మింగుతుంటే క్రమంగా తలనొప్పి మాయమవుతుంది.
- మెదడు, కళ్లు, శరీరం అలసిపోయినా కూడా తలనొప్పి వస్తుంది. కాబట్టి వ్యాయామం, అల్పాహారం, భోజనం, నిద్ర సమయానుసారం ఉండేలా చూసుకోవాలి.
- కంటిచూపునకు సంబంధించిన సమస్యలు ఉన్నా తలనొప్పి వస్తుంది. కాబట్టి ఆసుపత్రికి వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలి.

ఉపాధికి వారధిగా..



నైపుణ్యం ఉన్నవారికోసం వెతుకులాటలో పరిశ్రమలు... వాటికి తగిన నైపుణ్యాన్ని అందుకోలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్న యువత.. ఈ అంతరాన్ని తగ్గించడానికి పదిహేడేళ్ళుగా కృషి చేస్తున్నారు శిప్రా శర్మ భుటాని. లక్షమందికి పైగా అట్టడుగువర్గాలవారికి శిక్షణ ఇచ్చి, ఉపాధికి దోహదం చేసిన ఈ జైపూర్ మహిళ... విద్యార్థులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తున్నారు.

"తమ అవసరాలకు తగిన నైపుణ్యం ఉన్నవారు దొరకడం లేదనేది పరిశ్రమల నుంచి నిరంతరం ఎదురవుతున్న ఫిర్యాదు. డిమాండ్ ఉన్నా నిపుణులు దొరకని పనులు అనేకం ఉన్నాయి. టెకీలు, ఇంజనీర్లు, అకౌంటెంట్ల లాంటి వృత్తి నిపుణులనే కాదు... ఇంకా ఎన్నో బాధ్యతలను చక్కగా నెరవేర్చేవారి కోసం సంస్థలు వెతుకుతూ ఉంటాయి. అలాంటి వాటికి అవసరమైన నైపుణ్యాన్ని... అట్టడుగువర్గాల వారికి అందించాలన్న ఆలోచన పదిహేడేళ్ళ క్రితం కలిగింది. దీనికి నేపథ్యం ఏమిటంటే... నాకు పదేళ్ళ వయసున్నప్పుడే మా నాన్న చనిపోయారు. అయిదేళ్ళ తరువాత మా అమ్మ, సోదరుడు కూడా మరణించారు. నేను, నా సంరక్షణలో నా తమ్ముడు మిగిలేం. పదిహేనేళ్ళ వయసులో... నా జీవితానికి అర్థం ఏమిటనే ప్రశ్న తలెత్తింది. తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాను. కానీ కొద్ది రోజులలోనే దాని నుంచి బయటపడ్డాను. నాకన్నా దుర్భరమైన స్థితిలో బతుకున్నవారెందరో నా చుట్టూ కనిపించారు. ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకోసం, పిల్లలకోసం ఏదైనా చేయాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తట్టుకొని, కష్టపడి చదివాను. ఐఎంఎం-కోల్‌కతాలో సీటు సంపాదించాను. చదువు పూర్తయ్యాక... ఇంజనీరింగ్ లెక్చరర్‌గా చేరాను. ఆ వృత్తిలో నేను పరిశీలించిన ఎన్నో అంశాలు... నేను కొత్త దారిని ఎంచుకొనేలా చేశాయి. విద్యార్థులు డిగ్రీలు సంపాదిస్తున్నా... వారు చేయాల్సిన, చేయాలనుకొనే ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఇది ఏదో ఒక విద్యా సంస్థకే పరిమితమైన



సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. తరువాతి తరానికి మంచి ఉద్యోగావకాశాలు రావాలన్నా, తమ తమ వృత్తుల్లో వారు రాణించాలన్నా... దానికి నైపుణ్యాలు తప్పనిసరి. వాటిని పెంపొందించడమే మన ముందున్న అత్యవసర సమస్య అని అర్థమయింది. 2008లో ఉద్యోగం వదిలేసి... మా ఇంటి బేస్‌మెంట్‌లో... నలభై మంది విద్యార్థులతో ప్రాథమిక నైపుణ్య శిక్షణ సంస్థను ప్రారంభించాను.

ఆ డిమాండ్ తీర్చాలని...

ఎవరికి శిక్షణ ఇవ్వాలో, వేటిలో ఇవ్వాలో ఒక ప్రణాళిక నేను ముందే తయారు చేసుకున్నాను. వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలు, వీధులు ఊడ్చేవారు, చిన్న చిన్న నేరాలు చేసి జైలుకు వెళ్ళి వచ్చాక ఉపాధి లేనివారు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, సెక్యూరిటీ సర్వీసెస్ తదితర వృత్తుల్లో ప్రాథమిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. వీటిలో చాలా సేవలు దాదాపు అన్ని సంస్థలకూ అవసరమే. కానీ ఇలాంటి శిక్షణ కల్పించడానికి ఏ సంస్థా చొరవ తీసుకోదు. కానీ ఈ సేవలకు భారీ డిమాండ్ ఉంది. ఆ డిమాండ్ తీర్చడం, తద్వారా పేదలకు ఆసరాగా నిలవడం నా ఆశయం. అలా ఇప్పటివరకూ లక్ష మందికి పైగా నా సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చాను. వారికి నైపుణ్య శిక్షణ కౌన్సిలింగ్, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సాయం చెయ్యడం... ఇలా వివిధ అంశాల్లో మా సంస్థ సాయపడుతోంది. కొన్ని వందలమంది మా సంస్థ తరఫున పని చేస్తున్నారు. ఇప్పుడు 'కెపాసిటా కనెక్ట్' పేరిట మా కార్యకలాపాలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడంతో పాటు... ఇతర అంశాల్లోకి కూడా విస్తరించాం. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్-కార్పొరేట్ సంస్థలకు కూడా సేవలు అందించడం ప్రారంభించాం. రాజస్థాన్ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ సాంకేతికతల్లో శిక్షణ ఇవ్వడం కోసం... కిందటి ఏడాది 'రైజింగ్ రాజస్థాన్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'లో రూ. 45 కోట్ల ఒప్పందాన్ని 'కెపాసిటా కనెక్ట్' చేసుకుంది. ఇది మా సంస్థ పురోగతిలో ఒక మైలురాయి.

నైపుణ్యం పెంచడమే మార్గం...

ప్రస్తుతం పేద వర్గాలవారికి శిక్షణతో పాటు ఉద్యోగులకు, విద్యార్థులకు, కార్పొరేట్ సంస్థలకు విద్యా సంస్థలకు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాం. కృత్రిమ మేధ, డేటా అనాలిసిస్, సైబర్ సెక్యూరిటీ లాంటి సరికొత్త సాంకేతికతలను కూడా బోధిస్తూ... యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. మా సంస్థకు 'సిఐఐ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్' లాంటి పలు పురస్కారాలు లభించాయి. ప్రతిష్టాత్మకమైన 'ఫోర్బ్స్ ఇండియా-గ్లోబల్ ఇండియన్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ ఎడిషన్'లో... టాటా, మహీంద్రా, బజాజ్, హెచ్‌సిఎల్, బిర్లా లాంటి సంస్థల సరసన చోటు దక్కింది. వ్యక్తిగతంగా 'రాజస్థాన్ ఇండస్ట్రీ ఐకాన్' అవార్డు అందుకున్నాను. 2019లో 'ఫోర్బ్స్ ఇండియా- లీడింగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాబితా'లో స్థానం లభించింది. ఇప్పుడు నా దృష్టంతా భారతీయ యువతను డిజిటల్ ఎకానమీ దిశగా సంసిద్ధం చేయడం మీద ఉంది. ఏ దేశ భవిష్యత్తునైనా నిర్దేశించేవి తరగతి గదులేనని నేను నమ్ముతాను. ఎక్కువ మార్కులు సంపాదించడం ఎలాగో మనం పిల్లలకు నేర్పుతున్నాం కానీ ఒక వైఫల్యాన్ని, విషాదాన్ని ఎదుర్కోవడం ఎలాగనేది చెప్పడం లేదు. ఈ ధోరణిలో మార్పు రావాలనేది నా కోరిక. అలాగే ఆర్థిక, సామాజిక స్థితులతో సంబంధం లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు లభించాలి. వారిలో నైపుణ్యం పెంచడమే అందుకు మార్గం. దాని కోసమే ఇన్నేళ్ళుగా కృషి చేస్తున్నాను. భవిష్యత్తులో ఆ కృషిని మరింత దీక్షగా కొనసాగిస్తాను."

మృదువైన చేతుల కోసం

గిన్నెలు రుద్దడం, రసాయనాలు ఉంటే సబ్బులు వాడడం వలన చేతులు పొడిబారిపోయి, గరుకుగా ఉంటాయి. కాబట్టి హస్తాలు మృదువుగా మారాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..



- పెరుగు మీద మీగడను తీసుకుని చేతులకి రాసి మసాజ్ చేయాలి. ఇలా తరచూ చేయడం వలన చేతులు మృదువుగా మారతాయి.
- ఒక చెంచా ఆలివ్ నూనెలో, చెంచా నిమ్మరసం, చెంచా గ్లిజరిన్, చెంచా పాలు, రెండు చెంచాల గోధుమ రవ్వ వేసి కలిపి, ఈ మిశ్రమాన్ని చేతులకు రాసి గంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- కలబంద గుజ్జును రోజూ చేతులకు రాసుకుని ఓ పావుగంట తర్వాత కడిగేసుకుంటే చేతులు మృదువుగా ఉంటాయి.
- చెంచా దానిమ్మ రసంలో రెండు చెంచాల పంచదార కలిపి చేతులకు రాసి రుద్దాలి. దీని వల్ల చేతులపై ఉన్న మృత కణాలు తొలగిపోయి చేతులు మృదువుగా మారతాయి.
- రోజూ రాత్రి పడుకునే ముందు పెట్రోలియం జెల్‌ను లేదా తేనెను చేతులకు రాసినా హస్తాలు మృదువుగా మారతాయి.
- టేబుల్‌స్పూన్ ఓట్స్‌లో అరటేబుల్ స్పూన్ కొబ్బరి నూనె వేసి కలిపి చేతులకు రాసి మర్దన చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తరచూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సమితి 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉచితంగా బోధించడంతోపాటు, వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫామ్ కూడా అందిస్తారు.

నవోదయ విద్యాలయలో అడ్మిషన్స్



అర్హతలు:

- **విద్యార్హత:** జేఎన్‌వీకి దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ప్రైవేట్ / ప్రభుత్వ / ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో, 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- **వయస్సు:** విద్యార్థి 2014 మే1 నుంచి 2016 జూలై 31 తేదీ మధ్యలో(ఈ తేదీలతో సహా) జన్మించి ఉండాలి.
- **నివాసం:** విద్యార్థి ఐదో తరగతి చదువుతో పాటు, అదే జిల్లాలో నివాసాన్ని కలిగి ఉండాలి.
- **సీట్లు:** మొత్తం సీట్లను రూరల్, అర్బన్ కోటా కింద విభజిస్తారు. ప్రతి జేఎన్‌వీ పాఠశాలలో 80 సీట్లు ఉండగా గ్రామీణ విద్యార్థులకు 60 సీట్లు, నగర(అర్బన్) విద్యార్థులకు 20 సీట్లు లభిస్తాయి. గ్రామీణ కోటాలోకి రావాలంటే, విద్యార్థి 3వ, 4వ, 5వ తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి. ఈ కాలంలో ఒక్క రోజు నగర పాఠశాలలో చదివినా, ఆ విద్యార్థులను నగర కోటాలో పరిగణలోకి తీసుకుంటారు.
- **పరీక్ష విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 ప్రశ్నలు వస్తాయి.

విభాగం	మార్కులు	ప్రశ్నల సంఖ్య
మెంటల్ ఎబిలిటీ	50	40
గణితం	25	20
ఆంగ్లం	25	20

- పరీక్ష తరువాత ఒక ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

ఎన్ని పాఠశాలలు: ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 15 పాఠశాలలు ఉన్నాయి ఇందులో 13 పాత పాఠశాలలు కాగా ఈ సంవత్సరం కొత్తగా రెండింటిని చేర్చారు. తెలంగాణ ప్రస్తుతం 9 పాఠశాలలు ఉన్నాయి. కొత్తగా ఏడు పాఠశాలలు మంజూరైనప్పటికీ ఈ సంవత్సరపు నోటిఫికేషన్‌లో వాటిని చేర్చలేదు.

- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూలై 29
- **పరీక్ష తేదీ:** 2025 డిసెంబర్ 13
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **వెబ్‌సైట్:** https://navodaya.gov.inspector

దిక్సూచి

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award

Description: The Institution of Engineering and Technology (IET) invites undergraduate engineering students to showcase their creativity, innovation, and leadership. This scholarship recognizes and nurtures India's future engineering leaders, empowering them to excel.

Eligibility: Open to full-time 1st, 2nd, 3rd, and 4th-year UG engineering students from AICTE/UGC-approved institutions across all branches. Applicants must have cleared all credit courses in a single attempt with a minimum of 60% marks in aggregate (or 6.0 CGPA on a 10-point scale). There is no age limit.

Prizes & Rewards: Scholarships worth INR 10,00,000

Last Date to Apply: 22-06-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/IET5

buddy4study.com

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

మొత్తం ఖాళీలు: 453

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దీని ద్వారా ఇండియన్ మిలిటరీ అకాడమి, ఇండియన్ నేవల్ అకాడమి, ఎయిర్ ఫోర్స్ అకాడమి, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

1. ఇండియన్ మిలిటరీ అకాడమి(ఐఎమ్ఏ-డెహ్రాడూన్)

- **ఖాళీలు:** 100 (13 ఖాళీలు ఆర్మీవింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కోసం కేటాయించారు)
- **విద్యార్హతలు:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

2. ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్ఏ-ఎజిమల)

- **ఖాళీలు:** 26 (6 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు. 2 హైడ్రో కేడర్ వారికి)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

3. ఎయిర్ ఫోర్స్ అకాడమి(ఐఎఫ్ఏ-హైదరాబాద్)

- **ఖాళీలు:** 32 (3 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు.)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ లేదా ఎంపీసీతో ఇంటర్ చదివి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
- **వయస్సు:** 2026 జూలై 1 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి (2002 జూలై 2 నుంచి 2006 జూలై1 తేదీలోపు జన్మించి ఉండాలి). డీసీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అయితే 26 సంవత్సరాల వయస్సు వరకు అర్హులు.

4. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి(ఓటీఏ-చెన్నై)(పురుషుల నాన్ టెక్నికల్ కోర్స్)

- **ఖాళీలు:** 276
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై 1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

5. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి (ఓటీఏ-చెన్నై)(మహిళల నాన్ టెక్నికల్ కోర్స్)

- **ఖాళీలు:** 19
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన మహిళలు, పిల్లలు లేకుండా విడాకులు పొందిన మహిళలు/ భర్త చనిపోయిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.


ఎంపిక విధానం:

1. రాత పరీక్ష(ఆబ్జెక్టివ్)

- ఐఎమ్ఏ, ఐఎన్ఏ, ఏఎఫ్ఏ: ఇంగ్లిష్, జీకే, ఎలిమెంటరీ మేథ్స్(300 మార్కులు)
- ఓటీఏ: ఇంగ్లిష్, జీకే(200 మార్కులు)

2. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ(సైకలాజికల్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ)

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 14
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/



సీఎస్ఐఆర్ యూజీసీ నెట్



సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇది జేఆర్ఎఫ్‌తోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉపయోగపడుతుంది.

పరీక్ష పేపర్లు

- కెమికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ పాసై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్ఎఫ్‌కు అర్హత విషయానికి వస్తే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 జూలై 1 తేదీ నాటికి 30 సంవత్సరాల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం: పరీక్ష కంప్యూటర్ బేస్డ్ విధానంలో, మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, జనరల్, ఈడబ్ల్యూఎస్/ఓబీసీ(నాన్ క్రిమిలేయర్) రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ అభ్యర్థులకు రూ.325/-.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 23

పరీక్ష తేదీలు: 2025 జూలై 26, 27, 28

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

వెబ్‌సైట్: https://csirnet.nta.ac.in/

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి

మొత్తం ఖాళీలు: 406

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి ఎగ్జామినేషన్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూలై 1 నుంచి ప్రారంభం అయ్యే ఎన్‌డీఏ 156 కోర్, ఇండియన్ నేవల్ అకాడమి 118 కోర్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఇది. ఆసక్తిగల అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు యూపీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

1. నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) 370 పోస్టులు

- **ఆర్మీవింగ్:** 208 (మహిళలకు 10)
- **నేవీ వింగ్:** 42 (మహిళలకు 5)
- **ఎయిర్‌ఫోర్స్ వింగ్:** ఫ్లైయింగ్ బ్రాంచ్ 92(మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్):** 18 (మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్):** 10 (మహిళలకు 2)

2. నేవల్ అకాడమి(10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) 36 పోస్టులు

- మొత్తం 36 పోస్టులు (మహిళలకు 4)

వయస్సు: 2007 జనవరి 2 నుంచి 2010 జనవరి 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.

విద్యార్హత: ఆర్మీ వింగ్ పదో తరగతి పాసై ఉండాలి

ఎయిర్ ఫోర్స్ అండ్ నేవల్ వింగ్/ ఎన్ఏ కేడెట్ ఎంట్రీ స్కీమ్: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ పాసై ఉండాలి.

ఎంపిక విధానం:

రాత పరీక్ష: మేథ్స్ 300 మార్కులు, జీకే+ఇంగ్లిష్ 600 మార్కులు(మొత్తం 900 మార్కులు). తప్పుగా గుర్తించిన సమాధానానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్: 900 మార్కులు

ఎయిర్‌ఫోర్స్ కేడెట్స్: కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) పాస్ కావాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 17

పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 14

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

చిత్రజ్యోతి

SINCE 1965







అంగరంగ వైభవంగా అఖిల్ రిసెప్షన్



యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని వివాహ రిసెప్షన్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. మహేశ్ బాబు, రామ్‌చరణ్ కుటుంబంతో సహా విచ్చేశారు. తమిళ హీరో సూర్యతోపాటు దర్శకుడు వెంకీ అట్లూరి హాజరయ్యారు. వీరితోపాటు పలువురు సినీ సెలబ్రెటీలు కూడా సందడి చేశారు. ఈనెల 6న అఖిల్, జైనబ్ వివాహ బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు.

బాలకృష్ణతో మరోసారి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణతో మరోసారి సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మా కాంబో చేసే గర్జన మరింత ఎక్కువగా ఉండబోతోంది. చరిత్రలో నిలిచిపోయే చిత్రమిది" అని పేర్కొన్నారు. మంగళవారం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఇది ఆయన నటించనున్న 111వ చిత్రం. వెంకట్ సతీష్ కిలారు నిర్మించనున్నారు. కాగా, బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో 'వీరసింహా రెడ్డి' అనే చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.

అఖండ 2 టీజర్ వచ్చేస్తోంది

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. వారి కలయికలో నాలుగోసారి తెరకెక్కుతోన్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమా టీజర్‌ను నేడు విడుదల చేయనున్నారు మేకర్స్.

'మాగంటి'కి చిత్రపరిశ్రమతో అనుబంధం



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికైన మాగంటి గోపీనాథ్‌కు చిత్ర పరిశ్రమతో కూడా అనుబంధం ఉంది. సినీ ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయి. నిర్మాతగా నాలుగు సినిమాలు నిర్మించారు. శ్రీ సాయినాథ్ ఆర్ట్ క్రియేషన్స్ బేనర్‌పై సురేశ్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో 'పాత బస్తీ' అనే సినిమాను 1995లో నిర్మించారు. అనంతరం 2000 సంవత్సరంలో ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై రాజశేఖర్, కృష్ణతో 'రవన్న' అనే చిత్రాన్ని నిర్మించారు. 2004లో దివ్య అక్షర నాగ మూవీస్ బేనర్‌పై తారకరత్నతో 'భద్రాద్రి రాముడు', 2009లో రాజశేఖర్‌తో ' నా స్టైలే వేరు' సినిమాలు నిర్మించారు.



శివుడే నన్ను ఎంచుకున్నాడు

మంచు విష్ణు

విష్ణు కథానాయకుడిగా ముఖేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు మాట్లాడుతూ "దాదాపు ఏడెనిమిదేళ్ల కష్టపడి ఈ సినిమా తీశాం. ఇందులో నటించమని అడిగిన వెంటనే అంగీకరించిన మా బావ ప్రభాస్‌కు కృతజ్ఞతలు. ఈ సినిమాను శివుడు ఆశీర్వదించాడు" అని అన్నారు. "ఈ సినిమాలో ఎవరెవరు పనిచేయాలి అనేది శివాజ్ఞతోనే జరిగింది. ఈ చిత్ర ప్రయాణం నన్ను చాలా మార్చింది. 'కన్నప్ప' కథను మరోసారి చెప్పరా అని శివుడు నన్ను ఎంచుకున్నాడని భావిస్తున్నా" అని మంచు విష్ణు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, రఘుబాబు, శివబాలాజీ, కౌశల్ పాల్గొన్నారు.

సరికొత్త కథాంశంతో 'పయనం'



'రోటీ కపడా రొమాన్స్' ఫేమ్ సుప్రజ్, సంగీర్తన విపిన్ జంటగా 'పయనం' అనే చిత్రంలో నటిస్తున్నారు. చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా చందురామ్ మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి

సునీల్ నారంగ్ రాజీనామా

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇటీవల కాలంలో ఇండస్ట్రీలో పలు వివాదాలకూ, సంచలనాలకు కారణమైన సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూసివేత అంశం తాజాగా కొత్త మలుపు తీసుకుంది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ ఆదివారం రాజీనామా చేశారు. శనివారం జరిగిన టీఎఫ్‌సీసీ ఎన్నికల్లో నారంగ్ అధ్యక్షుడిగా ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నికవడం ఇది మూడోసారి. అయితే అధ్యక్ష పదవి చేపట్టి 24 గంటలు కూడా గడవకముందే ఆయన రాజీనామా చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో సంచలనం కలిగించింది. 'నాకు సంబంధం లేకుండా నా పేరుతో పబ్లిక్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. సినీ పరిశ్రమ నుంచి ఏదైనా ప్రకటన ఇచ్చేముందు, ఇంటర్వ్యూ, ప్రెస్ మీట్ నిర్వహించే ముందు నాకు సమాచారం ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కొనసాగలేను' అని ఆయన టీఎఫ్‌సీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కానీ ఆయన రాజీనామా కోసం తెరవెనుక పెద్ద తతంగమే నడిచిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

శ్రీధర్ విమర్శలపై ఇండస్ట్రీ ఆగ్రహం

కొత్త కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ టాలీవుడ్ అగ్రహీరోలను ఉద్దేశించి చేసిన పరుష వ్యాఖ్యలు ఇండస్ట్రీలోని కొన్ని వర్గాలకు రుచించలేదని సమాచారం. 'నీ ప్రోద్భలం లేకుండా నీ సమక్షంలోనే అతను అంత దురుసుగా ఎలా మాట్లాడతాడు, నువ్వు అక్కడే ఎందుకు ఖండించలేదు' అంటూ ఇండస్ట్రీ శక్తులు కొన్ని నిప్పులు చెరగడంతో ఎటూ పాలు పోని పరిస్థితుల్లో సునీల్ రాజీనామా చేశారనే మాట వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని అడ్డుకునేందుకే థియేటర్ల మూసివేత అంశాన్ని తెరపైకి తెచ్చారని జరిగిన ప్రచారంలో ఆ నలుగురు(అల్లు అరవింద్, దిల్‌రాజు-శిరీష్, సురేశ్‌బాబు) లో సునీల్‌నారంగ్ పేరు ప్రముఖంగా వినిపించిన విషయం తెలిసిందే. అయితే 'అందులో నేను లేను, పవన్ కల్యాణ్ సినిమా అడ్డుకునే సాహసం ఎవరూ చేయలేరు' అని శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సునీల్ నారంగ్ వివరణ ఇచ్చారు. కానీ అదే ప్రెస్‌మీట్‌లో శ్రీధర్ ఇద్దరు దర్శకులు, ఇద్దరు హీరోలు చేసిన కుట్రలో భాగమే ఇదంతా అంటూ చేసిన వ్యాఖ్యలు సునీల్ నారంగ్ మెడకు చుట్టుకున్నాయి.

పవన్ సినిమా రాకుంటే మా పరిస్థితి ఏమిటి?



అసలు ఇంతకీ మీడియా సమావేశంలో శ్రీధర్ ఏమన్నారంటే 'వరల్డ్‌వైడ్ రూ. 2 కోట్ల వసూళ్లు రాని హీరోకి రూ. 13 కోట్ల పారితోషికం ఇచ్చారు. ఒకప్పుడు రెండు మూడు సినిమాలు చేసేవాళ్ల హీరోలు. ఇవ్వాళ రెండేళ్లకో సినిమా తీస్తున్నారు. భారీగా పారితోషికం తీసుకోవడమే దానికి కారణం. పవన్ కల్యాణ్ సినిమా వస్తుందని మేం థియేటర్లు అన్నీ ఖాళీ పెట్టుకున్నాం. ఇప్పుడు ఈ నెల మొత్తం వృథాగా పోయినట్లే. హీరోలకు ఈ స్టార్‌డమ్ ఎక్కడ నుంచి వచ్చింది. ఒక హీరో ఏడాదికి రెండు సినిమాలైనా చేయక పోతే సింగిల్ స్క్రీన్లు నడవవు. లేదంటే గోదాములు, సూపర్ మార్కెట్లు అవుతాయి. తెలంగాణ ఎగ్జిబిటర్ల నుంచి థియేటర్ల ప్రతిపాదన రాలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలే దీని వెనుక ఉన్నారు. టైమ్ వచ్చినప్పుడు పేర్లు చెబుతాను' అని సీరియస్ వ్యాఖ్యలు చేశారు.

హీరోలు అంటే దేవుళ్లు

సినీ పెద్దల ఆగ్రహాన్ని చల్లబరిచే ప్రయత్నంలో భాగంగానే సునీల్ నారంగ్ రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ సినిమాతో పాటు మా కుబేర సినిమా కూడా అదే సమయంలో విడుదలవుతుండగా, మేం థియేటర్లను మూయాలని ఎందుకు అనుకుంటాం అని ప్రశ్నించారు. డిజిటల్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూల్లో సైతం ఆయన హీరోలను ఆకాశానికి ఎత్తారు. 'మనదేశంలో డబ్బున్నోళ్లు చాలామంది ఉన్నారు. కానీ హీరోలవ్వలేదు. కోటి మందిలో ఒక హీరో పుడతాడు. వాళ్లు దేవుళ్లు. హీరో అవ్వడం అంత వీజీ కాదు. 145 కోట్ల జనాభాలో 40 మంది హీరోలున్నారు' అంటూ స్పందించారు. తాజా వివాదానికి ఆజ్యం పోసిన శ్రీధర్ వ్యాఖ్యలతోనూ తనకు సంబంధం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. 'శ్రీధర్ చెప్పిన మాట వినడు. నిన్న నేను ఆయన్ను చూసి వెనక్కు వెళుతుంటే బలవంతంగా తీసుకెళ్లి ప్రెస్‌మీట్‌లో కూర్చోబెట్టారు. ఆయనకు ఎవరు రాసిచ్చారో, ఆయనతో ఎవరు అలా మాట్లాడించారో నాకు తెలియదు.



నేను ప్రెసిడెంట్‌ని, ఆయన సెక్రటరీ... కాబట్టి నా పక్కన కూర్చొని మాట్లాడాడు. దాంతో నాకేం సంబంధం లేదు. ఆయన మాటల వెనుక నా ప్రోద్భలం ఉండి ఉంటే మీడియా సమావేశంలో ఆయన పక్కన ఎందుకు కూర్చుంటాను. అసలు ప్రెస్‌మీట్‌లో ఆయన ఏం మాట్లాడతాడనేది కూడా నాకు తెలియదు. ఆయన మాటలతో నేను షాక్‌కు గురయ్యాను. 'హీరోలు ఎన్ని సినిమాలు చేయాలో చెప్పడానికి నువ్వెవరు' అన్నాను. ఆయనకు మాట్లాడడం రాదు. నా స్నేహితుడు అయినంత మాత్రాన ఆయన ఏం చేసినా దానికి నేను పూచీ కాదు' అని బదులిచ్చారు.

అందుకే హీరోలతో కలిసి థియేటర్ల నిర్మాణం

'మల్టీప్లెక్స్‌ల్లో రెండు సినిమాలు విడుదలైతే ఒకటి ఫ్లాప్ అయినా, ఒకటి హిట్ అవుతుంది. దానికి షోలు పెంచుతాం. సేఫ్ అయిపోతాం. సింగిల్ థియేటర్‌లో వేసిన సినిమా ఫ్లాప్ అయితే ఇక ఏం చేయలేం. అందుకే టాలీవుడ్ అగ్రహీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం చేపట్టాం. అది భాగస్వామ్య వ్యాపారం. అందులో తప్పేం ఉంది. ప్రాజెక్ట్‌కి క్రేజ్ వస్తుంది. అలాంటి ఆలోచనతో ఇంకెవరూ వెళ్లలేదు. మేం వెళ్లాం. వాళ్లు ఓకే చేశారు. ఆ స్టార్‌కి కూడా లాభం ఉంటుంది. పైగా ఇలాంటి మల్టీప్లెక్స్‌లు పది కట్టుకుంటే 'ఆ నలుగురు', గుత్తాధిపత్యం లాంటి నిందలు అన్నీ పోతాయి' అన్నారు.

విమానాల నవీకరణపై రిలయన్స్ ఇన్‌ఫ్రా ఫోకస్



రూ.5,000 కోట్ల వ్యాపార లక్ష్యం

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా విమానాలు, హెలికాప్టర్ల ఆధునీకరణ వ్యాపారం చేపట్టింది. వచ్చే 7-10 సంవత్సరాల్లో ఈ కొత్త వ్యాపారం ద్వారా రూ.5,000 కోట్ల ఆదాయం ఆర్జించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇప్పటికే జెనిసిస్ అనే అమెరికా కంపెనీతో పొత్తు పెట్టుకుని 55 డోర్నియర్-228 విమానాల ఆధునీకరించి రూ.350 కోట్లు సంపాదించింది. వీటి పనితీరుపై భారత వైమానిక, నౌకా దళాలు, తీర ప్రాంత గస్తీ దళాలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. మన దేశానికి చెందిన ఒక ప్రైవేటు కంపెనీ సొంతంగా విమానాల ఆధునీకరణ రంగంలోకి ప్రవేశించడం ఇదే మొదటిసారి.

భారీ అవకాశం: సాధారణంగా విమానాలు, హెలికాప్టర్ల జీవిత కాలం 30 నుంచి 40 సంవత్సరాలు. అయితే కాలానికి అనుగుణంగా మధ్యలో వీటిలో ఉండే కీలక పరికరాలను మార్చాల్సి ఉంటుంది. వీటి ఖర్చులు విమానం లేదా హెలికాప్టర్ కొన్న ధర కంటే రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా వీటిని తయారు చేసే కంపెనీలు లేదా ఎంఆర్‌ఓ సంస్థలు ఈ పని చేస్తుంటాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైనిక విమానాలు, హెలికాప్టర్ల ఆధునీకరణ వ్యాపారం ఏటా రూ.5 లక్షల కోట్ల వరకు ఉంది. వచ్చే ఏడేళ్లలో ఇది రూ.7 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. మన దేశంలోనూ పౌర, సైనిక విమానాలు, హెలికాప్టర్ల సంఖ్య పెరుగుతోంది. ముందు ముందు ఇది పెద్ద వ్యాపార అవకాశం అవుతుందని రిలయన్స్ గ్రూప్ భావిస్తోంది.

ఎల్ఐసీ తాత్కాలిక సీఈఓగా సత్ పాల్ భానూ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సీనియర్ అధికారి సత్ పాల్ భానూకు అదనపు బాధ్యతలను అప్పగించారు. కేంద్ర ఆర్థిక సర్వీసుల శాఖ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ నియామకం సెప్టెంబరు వరకు అంటే మూడు నెలల పాటు లేదా రెగ్యులర్ సీఈఓ నియామకం జరిగేంత వరకు అమలులో ఉంటుంది. సిద్ధార్థ మొహంతీ పదవీకాలం ముగియడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ



హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	530
చిత్తూరు	613	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

వడ్డీరేట్లు తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఓబీ

న్యూఢిల్లీ: దేశంలో రుణాలపై వడ్డీరేట్ల కోత కొనసాగుతోంది. తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) రెపో ఆధారిత రుణ వడ్డీరేటు (ఆర్‌ఎల్ఎల్ఆర్) అర శాతం తగ్గించింది. ఇక నుంచి తన ఆర్ఎల్ఎల్ఆర్ 8.15 శాతం నుంచి ప్రారంభమవుతుందని బీఓబీ తెలిపింది. ఈ తగ్గింపు శనివారం నుంచే అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రం అదనపు నిధుల సమీకరణ వ్యయం ఆధారంగా వసూలు చేసే వడ్డీరేటును (ఎంసీఎల్ఆర్) మాత్రమే 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. శుక్రవారం ప్రకటించిన ఆర్థిక, ద్రవ్య విధానంలో ఆర్‌బీఐ రెపోరేటు అర శాతం, సీఆర్ఆర్ ఒక శాతం తగ్గించింది. దాంతో బ్యాంకులు వరుస పెట్టి తమ రెపో ఆధారిత రుణాల వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), యూకో బ్యాంకులు ఇప్పటికే వడ్డీరేట్లు తగ్గించాయి.

అదానీ వేతనం రూ.10.41 కోట్లు

పోటీదారుల కన్నా తక్కువే



న్యూఢిల్లీ: దేశంలో రెండో సంపన్నుడుగా పేరొందిన గౌతమ్ అదానీ ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.10.41 కోట్లు వేతనం తీసుకున్నారు. తన సొంత వ్యాపార విభాగాల కీలక ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర పారిశ్రామిక దిగ్గజాలు పొందిన వేతనం కన్నా ఆదానీ తీసుకున్న వేతనం తక్కువే. తమ వ్యాపార సామ్రాజ్యంలోని 9 లిస్టెడ్ కంపెనీల్లో 2 కంపెనీల నుంచి ఆయన వేతనం పొందినట్టు ఇటీవల అదానీ గ్రూప్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పొందిన రూ.9.26 కోట్లతో పోలిస్తే గత ఏడాది వేతనం 12% అధికం. దేశంలో కుటుంబ యాజమాన్యంలోని వ్యాపార సంస్థల అధిపతుల కన్నా కూడా అదానీ వేతనం తక్కువగా ఉంది. దేశంలో కొవిడ్-19 విజృంభణ తర్వాత అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ తన వేతనం మొత్తం వదులుకున్నారు. అంతకు ముందు ఆయన వేతనం రూ.15 కోట్లుండేది.

ఏటీఆర్ విమానాలకు పెరుగుతున్న గిరాకీ

వచ్చే పదేళ్లలో 300 విమానాలు అవసరం

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానయానం అభివృద్ధితో మన దేశంలో స్వల్పదూర ప్రయాణించే ఏటీఆర్ విమానాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం ఇండిగో, అలయెన్స్ ఎయిర్, ఫ్లై91 వంటి సంస్థలు ఈ తరహా విమానాలు 70 వరకు వినియోగిస్తున్నాయి. వచ్చే పదేళ్లలో భారత్‌లో 300కు పైగా ఏటీఆర్ విమానాలకు డిమాండ్ ఉంటుందని ఏటీఆర్ కంపెనీ అంచనా. ఇందుకోసం ఇప్పటికే భారత్‌లోని పలు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు కంపెనీ ఎండీ ఫేలీ క్రైస్టెన్ చెప్పారు. భారత్‌లో వచ్చే ఐదేళ్లలో కొత్తగా మరో 50 కొత్త విమానాశ్రయాలు రానున్నాయి. దీంతో ప్రాంతీయ విమానయానం మరింత పుంజుకుంటుందని ఏటీఆర్ కంపెనీ భావిస్తోంది.

స్టార్టప్స్‌కు నిబంధనల సంకెళ్లు: మోహన్‌దాస్ పాయ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ స్టార్టప్ విధానంపై ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్/సీఎఫ్ఓ, ఆరిన్ క్యాపిటల్ ఛైర్మన్ మోహన్‌దాస్ పాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియంత్రణలు ఈ రంగానికి పెద్ద గుది బండలా మారాయన్నారు. దీంతో దేశీయ స్టార్టప్స్ తమకు అవసరమైన పెట్టుబడుల్లో 80 శాతం విదేశాల నుంచి సమకూర్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. "2014-2024 మధ్య కాలంలో స్టార్టప్స్‌పై చైనా 83,500 కోట్ల డాలర్లు, అమెరికా 2.32 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడిగా పెట్టాయి. మనం కేవలం 16,000 కోట్ల డాలర్లతో సరిపెట్టాం. మళ్లీ అందులో 80 శాతం నిధులు విదేశాల నుంచి వచ్చాయి. అంటే మన స్థానిక పెట్టుబడులు పెద్దగా లేవని అర్థం" అన్నారు. ఈ కారణం చేతే స్టార్టప్స్ సంఖ్యలో మన దేశం 1.65 లక్షల స్టార్టప్స్‌తో ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నా, నవ కల్పనలు పెద్దగా లేవని మోహన్ దాస్ పాయ్ స్పష్టం చేశారు. ఈ కంపెనీలను ఆదుకునేందుకు ప్రారంభించిన ఫండ్ ఆఫ్ ఫండ్స్ మూల నిధిని ప్రస్తుత రూ.10,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచాలని కోరారు.

టెక్ వ్యూ: 25,000 స్థాయి కీలకం



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో మరింత బలహీనత ప్రదర్శించినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించి చివరికి 25,000 సమీపంలో ముగిసింది. ముందు వారంతో పోల్చితే 250 పాయింట్ల వరకు లాభపడింది. గత నాలుగు వారాలుగా 24500-25000 స్థాయిలో సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణిలో ట్రేడయిన అనంతరం గరిష్ఠ స్థాయిల్లో పటిష్ఠంగా ముగిసింది. మిడ్‌క్యాప్ సూచీ 1600 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 700 పాయింట్ల మేరకు బలమైన ర్యాలీ సాధించాయి. టెక్నికల్‌గా మార్కెట్ ప్రస్తుతం పాజిటివ్ ధోరణిలోనే ఉన్నప్పటికీ ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయి 25,150 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఈ కారణంగా ఈ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: ర్యాలీని మరింతగా కొనసాగించాలంటే నిఫ్టీ తప్పనిసరిగా 25,150 కన్నా పైన నిలదొక్కుకోవాలి. పైన ప్రధాన నిరోధ స్థాయిలు 25300, 25500.

బేరిష్ స్థాయిలు: 25000 వద్ద పరీక్షలో విఫలమైన అంతకన్నా దిగజారితే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,800. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ బలమైన ర్యాలీ సాధించి 830 పాయింట్ల లాభంతో 56,580 వద్ద ముగిసింది. మానసిక అవధి 57,000. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. 56,000 వద్ద రియాక్షన్ ఏర్పడి అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

ప్యాటర్న్: మార్కెట్ మూడో సారి 25,000 స్థాయిలో పరీక్షకు సమాయత్తం అవుతోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 25,000 స్థాయిలోనే "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదురవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని నిలవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	25,150, 25240
మద్దతు	24,920, 24800

ఈ వారం మరింత ముందుకే...

గత వారం నిఫ్టీ కీలక మద్దతు స్థాయి 25,000 పాయింట్లను అధిగమించడం శుభ పరిణామం. దీంతో ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ మరింత మెరుగ్గా రాణించే అవకాశం కనిపిస్తోంది. ఆర్‌బీఐ రెపో రేటు, సీఆర్ఆర్ రేట్లు తగ్గించడం, ద్రవ్యోల్బణం మరింత తగ్గుముఖం పట్టవచ్చన్న అంచనాలు, దిగొస్తున్న క్రూడ్ ధరలు, ఆర్థిక వృద్ధి పుంజుకుంటుందన్న ఆశలు వంటి సానుకూల అంశాలు సెంటిమెంట్‌ను మరింత పెంచుతున్నాయి. ఈ వారం డిఫెన్స్, రైల్వే, ఫైనాన్స్, బ్యాంకింగ్, డిపాజిటరీ సర్వీసెస్, మ్యూచువల్ ఫండ్స్ కంపెనీల షేర్లలో బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేర్లలో ప్రస్తుతం మొమెంటం కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా క్రమంగా పెరుగుతోంది. గత మూడు నెలల్లోనే ఈ షేర్లు 23 శాతం పెరిగాయి. కీలకమైన రూ.70 మార్క్‌ను దాటి గత వారం రూ.71.5 వద్ద ముగిశాయి. రూ.84/90 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.68/70 రేంజ్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.65ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం అప్‌ట్రెండ్‌లోకి మారే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండు నెలల్లోనే ఈ కంపెనీ షేర్లు దాదాపు 35 శాతం లాభపడ్డాయి. కీలకమైన రూ.650 వద్ద కన్సాలిడేట్ అయ్యాక పుంజుకున్నాయి. గత వారం 3.2 శాతం లాభంతో రూ.694 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.820 టార్గెట్‌తో రూ.680 వద్ద ఈ కౌంటర్లో ప్రవేశించవచ్చు. రూ.660 స్టాప్‌లాస్‌ని కచ్చితంగా పాటించాలి.

బజాజ్ ఫైనాన్స్: అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో షార్ట్, మీడియం టర్మ్ మొమెంటం పెరుగుతోంది. గత శుక్రవారం 4.9 శాతం లాభంతో రూ.9,372 వద్ద ముగిశాయి. రూ.9,900 టార్గెట్‌తో మదుపరులు రూ.9,300/9,200 రేంజ్‌లో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.9,150.

శ్రీరామ్ ఫైనాన్స్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు అత్యంత బలంగా ఉన్నాయి. గత వారం నెలవారీ గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసింది. పైగా వీసీపీ ప్యాటర్న్ ఫామ్ అవుతోంది. గత శుక్రవారం ఈ కంపెనీ షేర్లు 5.7 శాతం లాభంతో రూ.688 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.740/820 టార్గెట్‌తో రూ.680/670 రేంజ్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.650ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్: గత రెండేళ్లుగా ఈ కంపెనీ షేర్లు కన్సాలిడేట్ అవుతున్నాయి. ఇప్పటికే మూమెంటం, రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్స్ పెరుగుతున్నాయి. కీలకమైన రూ.250 మద్దతు స్థాయిని అధిగమించిన గత శుక్రవారం 4 శాతం లాభంతో రూ.275 వద్ద ముగిశాయి. రూ.320/345 టార్గెట్‌తో మదుపరులు రూ.270 సమీపంలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.260ని స్టాప్‌లాస్ పాటించి తీరాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్: పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

వైభవంగా రింకూ నిశ్చితార్థం



లఖ్‌నవూ: క్రికెటర్ రింకూ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ యువ ఎంపీ ప్రియా సరోజ్ నిశ్చితార్థం ఆదివారం ఇక్కడ జరిగింది. ఓ హోటల్‌లో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో ఓ భావోద్వేగ సన్నివేశం చోటుచేసుకుంది. తన చేతికి రింకూ సింగ్ నిశ్చితార్థ ఉంగరం తొడుగుతున్న సమయంలో ప్రియా సరోజ్ తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకోవడం కనిపించింది. ఆ భావోద్వేగం నుంచి బయటపడేందుకు ఆమెకు కొంచెం సమయం పట్టింది. తేరుకున్న ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్న రింకూ సింగ్..ఇద్దరి చేతులను పైకెత్తారు. అంగరంగ వైభవంగా జరిగిన రింకూ-ప్రియా ఎంగేజ్‌మెంట్‌కు క్రికెటర్లు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వీరిలో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఎంపీలు జయాబచ్చన్, డింపుల్ యాదవ్, ప్రొఫెసర్ రాంగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా, క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పియూష్ చావ్లా, యూపీ రంజీ జట్టు కెప్టెన్ ఆర్యన్ జుయల్ ఉన్నారు.

టీమిండియా ప్రాక్టీస్ ప్రారంభం

లండన్: ఇంగ్లండ్ జట్టుతో ఐదు టెస్ట్‌ల సుదీర్ఘ సిరీస్‌కు భారత జట్టు సన్నాహాలు ప్రారంభించింది. శనివారం ఇక్కడకు చేరుకున్న శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా మరుసటి రోజే సాధన మొదలు పెట్టింది. పేసర్లు బుమ్రా, ప్రసిధ్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, కెప్టెన్ గిల్, వైస్-కెప్టెన్ పంత్, ఆల్‌రౌండర్ జడేజా ఆదివారం ప్రాక్టీస్ చేశారు. కోచ్ గంభీర్ సాధనను ఆసాంతం పర్యవేక్షించాడు. భారత టెస్ట్ జట్టులోని ఇతర సభ్యులు..ఇండియా 'ఎ' పర్యటనలో భాగంగా ఇప్పటికే ఇంగ్లండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్ లయన్స్‌తో 'ఎ' జట్టు రెండో అనధికార టెస్ట్‌లో తలపడుతోంది. ఇక.భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్ట్ ఈ నెల 20న హెడింగ్లీలో ప్రారంభం కానుంది.

టెస్ట్ సిరీస్ టిక్కెట్లు.. హాట్ కేకులు

భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌కు టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఐదు టెస్ట్‌లకు టిక్కెట్లు దాదాపు అమ్ముడయ్యాయి. హెడింగ్లీలో జరిగే తొలి టెస్ట్, ఎడ్జ్‌బాస్టన్ ఆతిథ్యమిచ్చే రెండో టెస్ట్‌ నాలుగో రోజు ఆటకు సంబంధించిన టిక్కెట్లు మాత్రమే..అదీ కొద్ది సంఖ్యలో అందుబాటులో ఉన్నాయట.

అదరగొట్టిన భారత అథ్లెట్లు

చివరి రోజు ఆరు స్వర్ణాలు

తైవాన్ ఇంటర్నేషనల్ మీట్





తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండో రోజు భారత క్రీడాకారులు అదరగొట్టారు. తొలి రోజు ఆరు పసిడి పతకాలు కొల్లగొట్టిన మనోళ్లు..ఆదివారం మరో ఆరు స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. చివరి రోజు.. జాతీయ చాంపియన్ విత్య రామ్‌రాజ్, రోహిత్ యాదవ్, పూజ, కృష్ణకుమార్, అన్నూరాణి, పురుషుల 4x400 మీటర్ల రిలే జట్టు పసిడి పతకాలు దక్కించుకున్నారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో పాలాక్ష (42.22సె.) వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్‌తో రజతం నెగ్గాడు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్య (56.53 సె.) చాంపియన్‌గా నిలిచింది. పురుషుల జావెలిన్ త్రోలో రోహిత్ యాదవ్ (74.42మీ.) టైటిల్ అందుకున్నాడు. మహిళ 800మీ. పరుగు ఫైనల్లో పూజ (2.02.79 సె.) మీట్ రికార్డుతో విజేతగా నిలిచింది. భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌదరి రజతం నెగ్గింది. పురుషుల 800 మీటర్ల పరుగు ఫైనల్లో క్రిషన్ కుమార్ (1.48.46సె.) అగ్రస్థానం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్ త్రోలో 56.82మీ. దూరం ఈటెను విసిరిన అన్నూరాణి టైటిల్ దక్కించుకుంది. పురుషుల 4x400 మీ. రిలేలో సంతోష్, విశాల్, ధరమ్‌వీర్, మనుతో కూడిన భారత బృందం (3.05.58సె.) మీట్ రికార్డుతో టైటిల్ కైవసం చేసుకుంది. మహిళల లాంగ్‌జంప్‌లో శైలీసింగ్ (6.41మీ.) రజతం, ఆన్సీ సోజన్ (6.39మీ.) కాంస్య పతకం గెలుపొందారు.

ఇంగ్లండ్‌దే సిరీస్

రెండో టీ20లోనూ వెస్టిండీస్ ఓటమి

బ్రిస్టల్: వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఇంగ్లండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు నాలుగు వికెట్లతో నెగ్గింది. మొదట వెస్టిండీస్ 20 ఓవర్లలో 196/6 స్కోరు చేసింది. కెప్టెన్ హోప్ (49), చార్లెస్ (47), పావెల్ (34) రాణించారు. ల్యూక్ ఉడ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఇంగ్లండ్ 18.3 ఓవర్లలో 199/6 స్కోరు చేసి గెలుపొందింది. బట్లర్ (47), కెప్టెన్ బ్రూక్ (34), డకెట్ (30), బాంటన్ (30 నాటౌట్) తలో చేయి వేశారు. అల్జరి జోసెఫ్ రెండు వికెట్లు తీశాడు.

వారెవ్వా.. ఏం గెలిచాడు!

5 గంటలా 29 నిమిషాల ఫైనల్..

సూపర్ టైబ్రేక్‌లో అల్కారజ్ విజయం

స్పెయిన్ స్టార్ ఖాతాలో రెండో ఫ్రెంచ్ ఓపెన్

పోరాడి ఓడిన సినర్

వారెవ్వా ఏం మ్యాచ్.. అల్కారజ్-సిన్నర్ల మధ్య జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టేలా చేసింది. ఎవరిది పైచేయో తేల్చుకునేందుకు ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఐదు గంటల 29 నిమిషాల పాటు కొదమ సింహాల్లా తలపడిన ఈ వరల్డ్ టాప్-2 ఆటగాళ్లు సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఎన్నెన్నో మలుపుల మధ్య.. ఒకరి గెలుపు అవకాశాలను మరొకరు అడ్డుకుంటూ సాగించిన ఉత్కంఠ సమరంలో చివరకు 21 ఏళ్ల అల్కారజ్ మట్టి కోట రారాజుగా టైటిల్‌ను కాపాడుకున్నాడు.





పారిస్: ఉత్కంఠభరితంగా సాగిన ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో నయా స్పెయిన్ బుల్ కార్లోస్ అల్కారజ్ పైచేయి సాధించాడు. ఆదివారం నువ్వా.. నేనా అనే రీతిలో సాగిన ఈ తుది పోరులో అల్కారజ్ 4-6, 6-7(4-7), 6-4, 7-6(7-3), 7-6 (10-2)తో వరల్డ్ నెంబర్‌1 జానిక్ సిన్నర్ (ఇటలీ)ని ఓడించి ఇక్కడ రెండోసారి చాంపియన్‌గా నిలిచాడు. గతేడాది ఇక్కడ టైటిల్ నెగ్గే క్రమంలో సెమీస్‌లో సిన్నర్‌ను ఓడించిన అల్కారజ్.. ఈసారి తుదిపోరులోనూ అంతేస్థాయిలో విజృంభించాడు. అల్కారజ్‌కు ఇది ఐదో గ్రాండ్‌స్లామ్. గతంలో రెండుసార్లు వింబుల్డన్ (2023, 24), ఓసారి యూఎస్ ఓపెన్ (2022) నెగ్గాడు.

తొలి రెండు సెట్లు సిన్నర్ గెలిచి..: ఇద్దరు యువ ఆటగాళ్లే కావడంతో ఒక్కో పాయింట్ కోసం పట్టు వదలకుండా కోర్టులో చిరుతలా కదిలారు. దీంతో తొలి గేమ్ ముగిసేందుకే 12 నిమిషాలు పట్టింది. సిన్నర్ 1-0తో సర్వీస్ కాపాడుకుని శుభారంభం చేయగా.. అటు ప్రేక్షకులు భారీ మద్దతు పలికిన అల్కారజ్ తొలి బ్రేక్ పాయింట్ సాధించి 3-2తో ఆధిక్యం చూపాడు. ఆ తర్వాత సిన్నర్ ఆరో గేమ్‌ను బ్రేక్ చేసి, ఏడో గేమ్‌లో సర్వీస్ కాపాడుకోవడంతో 4-3తో నిలిచాడు. అదే జోరులో మరో బ్రేక్ పాయింట్‌తో 6-4తో సెట్‌ను సైతం దక్కించుకున్నాడు. ఇక రెండో సెట్‌లో సిన్నర్ పదునైన సర్వీస్, బేస్‌లైన్ ఆటతీరుతో 4-1తో దూసుకెళ్లాడు. అయితే అల్కారజ్ తొమ్మిదో గేమ్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత సర్వీస్ కాపాడుకుని 5-5 స్కోరుతో సమమైంది. ఇద్దరి పట్టుదల కారణంగా సెట్ టైబ్రేక్‌కు వెళ్లినా సిన్నర్ 7-6తో ముగించాడు. మూడో గేమ్‌లో అల్కారజ్ మెరుపైన ప్రదర్శన కనబర్చాడు. మొదటే తన సర్వీస్‌ను కోల్పోయినా తర్వాత సూపర్ మూడు పాయింట్లతో ఆధిక్యం చూపాడు. ఎలాంటి తడబాటు లేకుండా ఆడి ఐదో గేమ్‌ను ఫోర్ హ్యాండ్ విన్నర్‌తో బ్రేక్ చేసి పోటీలో నిలిచాడు. దీంతో సిన్నర్ 31 వరుస గ్రాండ్‌స్లామ్ సెట్ల విజయాలకు బ్రేక్ పడింది.

మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకుని...: మరోవైపు గంటా ఏడు నిమిషాల పాటు సాగిన నాలుగో సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలుపుకుంటూ ముందుకు సాగారు. ఏడో గేమ్‌ను సిన్నర్ బ్రేక్ చేసిన తర్వాత సర్వీస్ కాపాడుకుని 5-3తో పైచేయి సాధించాడు. కానీ తొమ్మిదో గేమ్‌లో ప్రత్యర్థి అల్కారజ్ మూడు చాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకోవడం విశేషం. ఈ కీలక సమయంలో పుంజుకున్న అతడు బ్రేక్‌తో పాటు వరుస మూడు పాయింట్లతో 6-5కు వెళ్లడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ 12వ గేమ్‌లో బ్రేక్ పాయింట్‌తో సిన్నర్ టైబ్రేక్‌కు వెళ్లినా.. ఈ సెట్‌ను 7-6తో అల్కారజ్ నెగ్గాడు. నిర్ణాయక ఐదో సెట్‌ను అల్కారజ్ బ్రేక్ పాయింట్‌తో ఆరంభించాడు. అనంతరం ఆరో గేమ్‌లో ప్రత్యర్థి చాంపియన్‌షిప్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, తర్వాత మ్యాచ్ పాయింట్‌తో సిన్నర్ 6-6తో పోటీలోకి వచ్చాడు. కానీ సిన్నర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్కారజ్ టైబ్రేక్‌కు తీసుకెళ్లాడు. ఇక్కడ ఒత్తిడికి లోనుకాకుండా వరుస పాయింట్లతో అల్కారజ్ 7-6 (10-2)తో మ్యాచ్‌ను ముగించాడు.

1 ఫ్రెంచ్ ఓపెన్‌లో అత్యంత సుదీర్ఘంగా (5 గంటల 29 నిమిషాలు) సాగిన ఫైనల్ మ్యాచ్ ఇదే. కాగా, ఓవరాల్ గ్రాండ్‌స్లామ్‌లో సుదీర్ఘంగా సాగిన రెండో ఫైనల్ ఇది. 2012లో జొకోవిచ్-నడాల్ మధ్య ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ 5 గంటలా 53 నిమిషాల పాటు సాగింది.

రాహుల్, అభిమన్యు అర్ధ శతకాలు

● భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 163/4
● లయన్స్ తొలి ఇన్నింగ్స్ 327 ఆలౌట్
● నాలుగు వికెట్లతో చెలరేగిన ఖలీల్



ఖలీల్ (4/70)

నార్తాంప్టన్: ఇంగ్లండ్‌తో మొదటి టెస్ట్‌కు ఓపెనర్ రేస్‌లో నిలిచిన కేఎల్ రాహుల్ మరోసారి సత్తా చాటాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికార టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో శతకొట్టిన రాహుల్..రెండో ఇన్నింగ్స్‌లోనూ ఫిఫ్టీ అనిపించాడు. రాహుల్ (51), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80) అర్ధ శతకాలతో మెరవడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆటకు ఆఖరికి భారత్ 'ఎ' 163/4 స్కోరు చేసింది. రాహుల్, ఈశ్వరన్ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. కాగా..మొదటి ఇన్నింగ్స్‌లో లభించిన 21 పరుగులతో కలిపి..భారత్ 'ఎ' మొత్తం 184 రన్స్ ఆధిక్యంలో నిలిచింది. పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 348 రన్స్ చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 192/3తో మూడో రోజు..మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ లయన్స్ 327 పరుగులకు ఆలౌటైంది. పేసర్ ఖలీల్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో (4/70) ప్రత్యర్థి బ్యాటర్ల పనిబట్టాడు.

ఎర్రాని జోడీకి డబుల్స్ టైటిల్



ఒలింపిక్ చాంపియన్ సారా ఎర్రాని-వవోలిని (ఇటలీ) ఫ్రెంచ్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో తొలిసారి చాంపియన్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో వీరు 6-4, 2-6, 6-1 తేడాతో అన్నా డానిలినా (కజకి)-అలెక్సాండ్రా క్రూనిక్ (సెర్బియా)పై నెగ్గారు. కాగా, ఇదే టోర్నీలో రెండ్రోజుల క్రితం మిక్స్‌డ్ విభాగంలో విజేతగా నిలిచిన ఎర్రాని.. తాజాగా మహిళల డబుల్స్ ట్రోఫీతో 'డబుల్' అందుకుంది.

వారికి చెవులున్నా వినపడవు..
నోరున్నా మాట్లాడరు

» కిషన్‌రెడ్డిపై రాజాసింగ్ పరోక్ష విమర్శలు



హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): 'సీఎం రేవంత్‌రెడ్డి సహాయం అడుగుతున్న వారికి చెవులు ఉన్నా వినపడవు.. నోరున్నా చెప్పరు' అంటూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి హాట్ కామెంట్ చేశారు. పరోక్షంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శిల్పాకళా వేదికలో ఆదివారం జరిగిన గవర్నర్ దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తాను కలిస్తే తెలంగాణ అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుందని అన్నారు. ఆయన సహకరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దీనిపై రాజాసింగ్ హాట్ కామెంట్ చేశారు. అలాంటి మహానుభావులను అడిగితే ఏం సహాయం చేస్తారని విమర్శించారు. అలాగే రాజాసింగ్ ఇటీవల ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు మద్దతుగా మాట్లాడారు. మా వాళ్లకు మంచి ప్యాకేజీ ఇస్తే పార్టీని ఎప్పుడో బీఆర్ఎస్‌లో కలిపేసేవారని అన్నారు. పార్టీ నుంచి పాత సామానును పంపించాల్సి ఉందని ఆయన అధిష్ఠానాన్ని కోరుతూ గతంలో వ్యాఖ్యానించారు. రాజాసింగ్‌కు పార్టీ నోటీసులు ఇస్తుందని ఇటీవల ప్రచారం జరగడంతో.. తనను సస్పెండ్ చేస్తే అందరి బాగోతం బయటపెడతానని హెచ్చరించారు. ఇలా రాజాసింగ్ ఏదో ఒక అంశంపై చేస్తున్న వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.

నేడు మావోయిస్టు నేత సుధాకర్ అంత్యక్రియలు

పెదపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు సుధాకర్(65) అంత్యక్రియలు ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో సోమవారం జరగనున్నాయి. ప్రభుత్వ అనుమతితో సుధాకర్ భౌతికకాయాన్ని ఆయన కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత గ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుధాకర్ అంత్యక్రియలు సత్యవోలులో జరగనుండటంతో బంధువులతో పాటు గ్రామ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అంత్యక్రియల్లో పలువురు ప్రజాసంఘాల నేతలు, సానుభూతిపరులు పాల్గొనే అవకాశం ఉంది.

నక్సలిజానికి మరణమే ముగింపు కాదు..!

» లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవొచ్చు

» చివరి అవకాశమంటూ పోలీసుల ప్రచారం

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): "నక్సలిజానికి ముగింపు మావోయిస్టుల మరణం కాదు. లొంగిపోతే జనజీవన స్రవంతిలో కలవొచ్చు" అంటూ భద్రత బలగాలు ప్రచారాన్ని మొదలు పెట్టాయి. వేలల్లో ఉండే మావోయిస్టు క్యాడర్.. 'ఆపరేషన్ కగార్' తర్వాత కుదేలైపోయింది. కొవిడ్ కల్లోలంతో అడవుల్లో అన్నలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడి, హరిభూషణ్ లాంటి అగ్రనేతలను కోల్పోగా.. గత ఏడాది నుంచి ఆకురాలే కాలాల్లో భద్రత బలగాలు వ్యూహాత్మకంగా జరిపిన దాడుల్లో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బలు తగిలాయి. చలపతి, సుధాకర్, భాస్కర్‌లాంటి పెద్ద నాయకులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఉద్యమంలో నేలకొరిగారు. ఇప్పుడు హిడ్మా లక్ష్యంగా ఆపరేషన్ సాగుతోంది. దండకారణ్యంపై మావోయిస్టులు పట్టు కోల్పోతుండగా.. బలగాలు పదుల సంఖ్యలో కొత్త క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాయి. అబూజ్‌మడ్‌లోకి కూడా చొచ్చుకుపోతున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా మావోయిజాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా.. క్షేత్రస్థాయిలో బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో.. మావోయిస్టులు హింసను వీడి లొంగుబాట్లపై దృష్టిసారించాలని అటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఇటు తెలంగాణ సరిహద్దు జిల్లాల ఎస్పీలు ప్రకటనలు చేస్తున్నారు. "మావోయిస్టులు కాల్పులను విరమించాలని కోరుతున్నారు. ప్రజా సంఘాలు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంతకాలం కాల్పులను విరమించి, నిర్దిష్ట గడువును ప్రకటించి, లొంగిపోయేందుకు మావోయిస్టులకు అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఉన్నాం" అని ఓ అధికారి వివరించారు. అగ్రనాయకులు అడవుల్లోనే చావోరేవో తేల్చుకుంటున్నారని, లొంగిపోతున్న వారిలో కింది స్థాయి క్యాడర్ ఎక్కువగా ఉంటోందని వివరించారు. తాజా ప్రతిపాదనపై పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న అగ్రనాయకత్వం స్వచ్ఛందంగా లొంగిపోయే అవకాశాలున్నట్లు ప్రభుత్వాలు భావిస్తున్నాయి. "ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత చలపతి చనిపోయారు. వృద్ధాప్యం కారణంగా ఆయన రెండు కర్రల సాయంతో నడిచేవారు. చనిపోయిన సమయంలోనూ ఆయన రెండు వైపులా రెండు కర్రలు పడి ఉన్నాయి. ఇలాంటి వారికి లొంగిపోయే అవకాశం కల్పించాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి" అని ఆ అధికారి పేర్కొన్నారు. అయితే.. మావోయిస్టులు లొంగుబాట పడతారా? లేదా.. చావోరేవో రణరంగంలోనే తేల్చుకుంటారా? అనేదానిపై స్పష్టత లేదు.

రష్యాతో యుద్ధం వస్తే..
జర్మనీ ముందు జాగ్రత్త చర్యలు

» భవనాల బేస్‌మెంట్లను బంకర్లుగా మార్చే ప్రణాళిక

బెర్లిన్, జూన్ 8: రష్యా..జర్మనీపై యుద్ధానికి దిగుతుందా? పోరాటం జరగవచ్చని అనుమానిస్తున్న జర్మనీ అప్పుడే ముందు జాగ్రత్త చర్యలను ప్రారంభించింది. బాంబు దాడుల నుంచి ప్రజలను రక్షించడానికి పెద్ద సంఖ్యలో బంకర్లు, బాంబు షెల్టర్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో సుమారు 2000 బంకర్లను నిర్మించగా వాటిలో కేవలం 580 మాత్రమే ప్రజలకు రక్షణ కల్పించే స్థితిలో ఉన్నాయి. అవి 4,80,000 మంది ప్రజలు, అంటే కేవలం 0.5శాతం మంది అవసరాలను మాత్రమే తీరుస్తాయి. అందువల్ల బాంబు షెల్టర్లు, బంకర్లను నిర్మించాలని భావిస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర పౌర రక్షణ విభాగం అధిపతి రాల్ఫ్ టైస్లెర్ వెల్లడించారు. భవిష్యత్తులో రష్యాతో యుద్ధం జరుగుతుందన్న వాస్తవాన్ని అంగీకరించాల్సి ఉంటుందని, ప్రస్తుత సన్నద్ధత అందుకు తగినంతగా లేదని తెలిపారు. దాడుల నుంచి ప్రజలను రక్షించే నిమిత్తం దేశ వ్యాప్తంగా ఉన్న సొరంగాలు, సబ్‌వే స్టేషన్లు, అండర్‌గ్రౌండ్ గ్యారేజీలు, పార్కింగ్ ప్రదేశాలు, భవనాల బేస్‌మెంట్లను బంకర్లు, బాంబు షెల్టర్లుగా మార్చే ఆలోచన ఉందని తెలిపారు. ఇలాంటి మార్పులు చేస్తే లక్షలాది మందికి సత్వరమే రక్షణ కల్పించడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఉన్నవాటినే షెల్టర్లుగా మార్చాలని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై త్వరలోనే సమగ్రమైన ప్రణాళికను విడుదల చేస్తామని వెల్లడించారు.

స్కూలు బీజేపీ.. కాలేజీ టీడీపీ..
ఉద్యోగం రాహుల్ దగ్గర!

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. "నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబును చూపిస్తూ, ఇదిగో మీ సహచర సీఎం ఇక్కడ ఉన్నారు అని సరదాగా అన్నారు. అప్పుడు నేను ఆయన దగ్గరకు వెళ్లి.. 'నా స్కూలు బీజేపీలో, కాలేజీ చదువు టీడీపీలో; ఇప్పుడు రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నా' అని నవ్వుతూ చెప్పా" అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. జాతీయ రాజకీయాల్లో దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పేయికి ఉన్న గౌరవం, రాష్ట్రస్థాయిలో బండారు దత్తాత్రేయకు ఉందని చెప్పారు. తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో దత్తాత్రేయ, పీజేఆర్‌ల స్ఫూర్తి ఉంటుందని తెలిపారు. అలయ్‌బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శిల్పకళా వేదికలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. దత్తాత్రేయ కుటుంబంతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. దత్తాత్రేయతో పాటు దివంగత కాంగ్రెస్ నేత పీజేఆర్‌లు జంట నగరాల పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. పేదలు పాన్ డబ్బా పెట్టుకుంటే దాన్ని ప్రారంభించేందుకు కూడా దత్తాత్రేయ అందుబాటులో ఉండేవారని, జంట నగరాల్లో ఇలాంటి నాయకుల కొరత స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చు అన్నట్లుగా మంత్రులంతా దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణకు హాజరయ్యారని రేవంత్ సరదాగా వ్యాఖ్యానించారు. అలయ్‌బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అజాతశత్రువు అనే పదం దత్తాత్రేయకు వందశాతం సరిపోతుందని రేవంత్ అన్నారు. కోవింద్ మాట్లాడుతూ.. దత్తాత్రేయ ప్రతి ఒక్కరికీ మిత్రుడన్నారు. కేంద్ర కార్మికశాఖ మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు లక్షలాది మంది శ్రామికులకు ప్రయోజనం చేకూర్చాయని తెలిపారు. యూపీ తనకు పుట్టినిల్లు అయితే, తెలుగు రాష్ట్రాలు రెండో ఇల్లు అని కోవింద్ చెప్పారు. దత్తాత్రేయ డిక్షనరీలో శత్రువు, ప్రత్యర్థి అన్న పదాలు ఉండవేమోనని వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు.

జెంటిల్మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ: బాబు

జెంటిల్మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. దత్తాత్రేయ అని పిలిచేవారికంటే, అభిమానంతో దత్తన్న అని పిలిచేవారే ఎక్కువ ఉంటారని తెలిపారు. ఆయనది పేరుకు హిందుత్వం.. మతం భారతీయం అని అన్నారు. తాను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై దత్తాత్రేయ ఎన్నో లేఖలు రాశారని, ఆయన లేఖలకు బ్రాండ్ అంబాసిడర్ అని సరదాగా వ్యాఖ్యానించారు. ప్రజా జీవితంలో దత్తాత్రేయ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. హైటెక్‌సిటీ అంటే చంద్రబాబు గుర్తుకొస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఆయన వల్లే హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని తెలిపారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న దత్తాత్రేయ, కోవింద్, చంద్రబాబు, వెంకయ్య, కిషన్‌రెడ్డి తదితరులు

డైపర్లు మార్చినట్లు పార్టీలు మారుస్తున్నారు

చిన్నపిల్లలకు డైపర్లు మార్చినట్లుగా ప్రస్తుత నాయకులు పదవుల కోసం పార్టీలు మార్చేస్తున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. పిల్లలకు ఉదయం, సాయంత్రం డైపర్లు ఎందుకు మారుస్తారో అందరికీ తెలుసన్నారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ ఎంత ముఖ్యమో.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. బూతులు మాట్లాడేవారిని, పైశాచిక ఆనందం పొందే నాయకులను ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ఓడించి బుద్ధి చెప్పారని వెంకయ్య గుర్తుచేశారు. ఆరెస్సెస్ గురించి కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. సమాజ శ్రేయస్సునే ఊపిరిగా సంఘ్ తమకు బోధించిందని తెలిపారు. వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఈ స్థాయిలో ఉండడానికి దత్తాత్రేయే కారణమని చెప్పారు. సిద్ధాంతాలు వేరైనా ఆయన, ఎప్పుడూ ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదని తెలిపారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ సమయంలో అజ్ఞాతంలో ఉన్నప్పుడు తామిద్దరం కలిసి పనిచేశామన్నారు. ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ.. దత్తాత్రేయ పేరు వినగానే ఆయన భుజంపై వేసుకునే కండువా, అలయ్‌బలయ్ గుర్తుకు వస్తాయన్నారు. ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. దత్తాత్రేయకు ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ధైర్యంగా మళ్లీ పోటీ చేసి గెలిచారన్నారు. యువతరానికి దత్తాత్రేయ రచించిన పుస్తకం స్ఫూర్తిదాయకమన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. ఏ పదవిలో ఉన్నా దత్తాత్రేయ అందరికీ అందుబాటులో ఉండే నాయకుడన్నారు.

కార్యకర్తలే నా ఆస్తి: దత్తాత్రేయ

బీజేపీ కార్యకర్తలే తన ఆస్తి అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వారి కృషి వల్లే తాను ఈ స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. కార్యకర్తలతో పాటు తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన సతీమణి వసంతకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. సమాజం కోసం పనిచేయడమే రాజకీయ నాయకుల లక్ష్యం కావాలని ఆకాంక్షించారు. ఆరెస్సెస్సే తన సర్వస్వం అని.. అసలు రాజకీయాల్లోకి వస్తానని తాను అనుకోలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ప్రభాకర్‌రావు

హైదరాబాద్ చేరుకున్న ప్రభాకర్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

హాజరవ్వాలని సూచించింది. దాంతో.. అమెరికాలోని రాయబార కార్యాలయం వన్‌టైమ్ ఎంట్రీ పాస్‌పోర్టును ప్రభాకర్‌రావుకు అందజేసింది. శనివారం నుంచి అమెరికా నుంచి ఎమిరేట్స్ విమానంలో ప్రయాణమైన ప్రభాకర్‌రావు.. దుబాయ్‌కి, అక్కడి నుంచి ఆదివారం రాత్రి 8.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తవ్వడానికి దాదాపు మూడున్నర గంటల సమయం పట్టినట్లు తెలిసింది. ఆ వెంటనే సిట్ అధికారులు ప్రభాకర్‌రావును బయటకు తీసుకువచ్చారు. సిట్ కార్యాలయాన్ని రెండు వారాల క్రితం పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయానికి మార్చారు. అయితే.. ప్రభాకర్‌రావు విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఠాణాలోని రెండో అంతస్తులో విచారణకు ఏర్పాట్లు చేశారు. సిట్ కార్యాలయం వద్ద మీడియా హడావుడి ఉండే అవకాశాలుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దర్యాప్తు అధికారులు విచారణను వీడియో రికార్డింగ్ చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రభాకర్‌రావు సిట్ విచారణకు హాజరవ్వనున్నట్లు తెలిసింది. సిట్ అధికారులు ఇప్పటికే ప్రశ్నావళిని సిద్ధం చేశారని సమాచారం. ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టయిన పోలీసు అధికారులు– టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావులు విచారణలో "ప్రభాకర్‌రావు చెబితేనే చేశాం" అంటూ వాంగ్మూలమిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావు వాంగ్మూలం కీలకంగా మారింది. "ఫోన్ ట్యాపింగ్ అధికారికంగా జరిగిందా? ఎవరెవరి అనుమతులతో ట్యాపింగ్ చేశారు? ఒకవేళ అనధికారికమైతే.. ఎవరి ఆదేశాలను పాటించారు?" అనే కోణంలోనే విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ప్రభాకర్‌రావు శంషాబాద్ విమానాశ్రయానికి రాగానే.. ఓ కస్టమ్స్ అధికారి స్వాగతం పలికారు. దీనిపై పోలీసులు సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ విభాగానికి ఫిర్యాదు చేసేందుకు నగర పోలీసులు సిద్ధమయ్యారు. ఓ నిందితుడికి విధుల్లో ఉన్న అధికారి స్వాగతం పలకడం చట్ట విరుద్ధమని నగర పోలీసులు చెబుతున్నారు.

భగ్గుమన్న అమరావతి మహిళలు

అనుచిత వ్యాఖ్యలపై పెల్లుబికిన నిరసనలు

కొమ్మినేని, కృష్ణంరాజులపై ఫిర్యాదులు

సాక్షి కార్యాలయాల ఎదుట ధర్నాలు

భారతీరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ జర్నలిస్టుల ముసుగులో ఉన్న వ్యక్తులు నోరు పారేసుకోవడంపై మహిళా లోకం భగ్గుమంది. రోత చానల్ లైవ్ డిబేట్‌లో అమరావతి మహిళలపై వారు చేసిన వ్యాఖ్యలపై ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. అత్యంత జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుతో పాటు కొమ్మినేని శ్రీనివాసరావును తక్షణం అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు జిల్లాల్లోని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. నిరసన ర్యాలీలు నిర్వహించారు. 'సాక్షి' కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. 'సాక్షి' చానల్‌లో మహిళలను అగౌరవపరుస్తుంటే ఆ సంస్థ యాజమాని భారతీరెడ్డి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. భారతీరెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను అగౌరవపరిచేలా వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజకు అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో మహిళలు, నేతలు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు రాష్ట్ర మహిళా విభాగం, ఎస్సీ సెల్, జనసేన, బీజేపీ, మానవ హక్కుల సంఘాల తరపున వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఘటనపై పరిశీలన చేస్తున్నామని, త్వరితగతిన చర్యలు ఉంటాయని చైర్‌పర్సన్ తెలిపారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు తెలుగు మహిళలు నల్లచీరలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజధానిపై విషం చిమ్ముతున్న సాక్షి పత్రిక, చానల్‌ను బ్యాన్ చేయాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లా సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట తెలుగు మహిళ రాష్ట్ర నేతలు స్వప్న, సంగా తేజస్విని ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. యూనిట్ కార్యాలయానికి ఉన్న 'సాక్షి' అక్షరాలను తొలగించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కళ్యాణదుర్గంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు. టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ ఖండవిల్లి లక్ష్మి ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని సాక్షి పత్రిక కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అమరావతి దళిత జేఏసీ నాయకులు ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్‌కు వినతిపత్రం అందజేశారు. 'అమరావతి మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడించిన సాక్షి చానల్‌ను, మాట్లాడినవారిని రైతు జేఏసీ వదిలిపెట్టదు. తగిన శాస్తి చేశాకే వారిని చట్టానికి అప్పగిస్తాం. భారతీ రెడ్డిని విమర్శించిన చేబ్రోలు కిరణ్‌ను హుటాహుటిన అరెస్టు చేసిన ప్రభుత్వం, కొమ్మినేనిని, కృష్ణంరాజును ఎందుకు అరెస్టు చేయలేకపోయిందో చెప్పాలి' అంటూ రాజధాని అమరావతి రైతు సమన్వయ కమిటీ భగ్గుమంది. రాజధాని అమరావతిపై, మహిళలపై, రాష్ట్ర ప్రజల మీద తప్పుడు ప్రచారాలకు దిగితే, ఎంతటివారికైనా బడిత పూజ తప్పదని కమిటీ నేతలు తెగేసి చెప్పారు. తమ తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

విషం చిమ్మడంలో గట్టు దాటారు: చంద్రబాబు

మీడియా విశ్లేషణల పేరుతో రాజధాని అమరావతి మహిళలపై దారుణ వ్యాఖ్యలు చేయడాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టుదాటి ప్రవర్తించారని, మన తల్లులు, చెల్లెళ్లపై ఇలాంటి దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం విచారకరమని అన్నారు.

ఆ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర: పవన్

'రాజధాని అమరావతిపై కుల ముద్రలు వేసి, మహిళలను అవమానిస్తారా..? ఇక్కడ వెలసిల్లిన బౌద్ధాన్నీ అవహేళన చేస్తారా..?' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపడ్డారు. అమరావతి మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజధానిపై కుట్రలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాల'మే' మారింది!

» 124 ఏళ్లలో మే నెలలో అత్యధిక వర్షం.. 126.7 మి.మీ నమోదు

» సగటు కంటే 106% అధికం



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మే.. అంటే వేసవి.. వేసవి అంటే మే నెల ఠక్కున గుర్తుకొస్తాయి! అయితే.. తీవ్రమైన ఎండలు, వడగాడ్పులతో నిప్పుల కుంపటి వాతావరణం నెలకొనాల్సిన మే నెలలో.. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈశాన్య భారతంలో పలు రాష్ట్రాల్లో, పడమర తీరంలో ముంబైలో వరదలు ముంచెత్తాయి. ఉత్తరాదిలో ఏడు వెస్ట్రన్ డిస్ట్రబెన్స్‌లు ప్రయాణించడం, వారం ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశ భూభాగంలోకి ప్రవేశించడంతో మే నెలలో 126.7 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇది దీర్ఘకాలిక సగటు కంటే 106 శాతం ఎక్కువ. ఈ విధంగా నమోదుకావడం గడచిన 124 సంవత్సరాల్లో (1901 నుంచి) ఇదే ప్రథమమని వాతావరణ శాఖ తెలిపింది. దేశంలో 36 వాతావరణ సబ్‌డివిజన్లకుగాను 25 సబ్‌డివిజన్లలో అత్యంత అధికం నుంచి అధిక వర్షపాతం, ఆరు సబ్ డివిజన్లలో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ మేరకు మే నెలకు సంబంధించి వర్షపాతం, ఉష్ణోగ్రతలపై బులెటిన్ విడుదల చేసింది. 50 ఏళ్ల దీర్ఘకాలిక సగటు ప్రకారం మే నెలలో 61.4మి.మీ.ల వర్షపాతం నమోదు కావాలి. ప్రాంతాలవారీగా చూస్తే దక్షిణ భారతంలో 199.7 మి.మీలు కురిసింది. ఇది 1901 తరువాత రెండో అత్యధికం.

దేశవ్యాప్తంగా అతిభారీ వర్షపాతం!

మరోవైపు రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించి పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల వరకు విస్తరించడంతో వర్షాలు ముంచెత్తాయి. మే నెల ప్రారంభం నుంచి దేశంలో అనేక ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. అనేకచోట్ల వడగాడ్పుల ప్రభావం లేదు. అయితే 1991 నుంచి 2020 వరకు 30 ఏళ్ల సగటు ఉష్ణోగ్రతల మేరకు మే నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.17 డిగ్రీలుకాగా సగటు ఉష్ణోగ్రత 30.38గా నమోదుకావల్సి ఉంది. కానీ మే నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 35.08, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.07, సగటు ఉష్ణోగ్రత 29.57 డిగ్రీలు నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 1.52, కనిష్ఠ ఉష్ణోగ్రత 0.10, సగటు ఉష్ణోగ్రత 0.81 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఈ నేపథ్యంలో మే నెలలో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. ఇంకా వర్షాలతో కృష్ణా బేసిన్‌లో వరద వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

రాష్ట్రానికి వర్ష సూచన !

4 రోజుల పాటు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వర్షసూచన చేసింది. సోమవారం నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. మంగళవారం 20 జిల్లాలకు వర్షాలకు సంబంధించిన ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై, కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా రాష్ట్రంలో ఆదివారం గరిష్ఠంగా 38.2, కనిష్ఠంగా 25.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.



బాసరకు పోటెత్తిన భక్తులు

బాసర, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగింపు వేళ నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్షరాభ్యాస పూజలు భారీగా నమోదయ్యాయి. 1390 మంది చిన్నారులు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాస పూజలు జరిపించుకున్నారు. పూజల కోసం భక్తులు క్యూ లైన్లలో 3 నుంచి 5 గంటల వరకు వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విరామం లేకుండా అక్షరాభ్యాస పూజలు కొనసాగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

యాదగిరి ప్రదక్షిణం

నృసింహ నామస్మరణతో హోరెత్తిన పుణ్యక్షేత్రం





యాదగిరిగుట్ట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్ట లక్ష్మీనృసింహస్వామి 'స్వాతి' జన్మ నక్షత్రం సందర్భంగా భక్తులు ఆదివారం గిరి ప్రదక్షిణ చేశారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతోపాటు వారాంతపు సెలవు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి తరలి వచ్చిన సుమారు 25వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 5.30 గంటలకు అర్చకుల వేద మంత్రాల పఠనం, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ఆలయ వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఈఓ ఎస్.వెంకట్రావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించి, గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రత్యేక వేషధారణలో కళాకారుల నృత్యాలు, భక్తుల భజనలు, కీర్తనలతో ప్రదక్షిణ మార్గం హోరెత్తింది. 2.5 కి.మీ దూరం గల కొండ చుట్టూ సుమారు 45 నిమిషాల పాటు గిరి ప్రదక్షిణ సాగింది. కాగా, ఆదివారం ఒక్క రోజే వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ.85,57,558 ఆదాయం సమకూరింది. కాగా, ఆలయ ముఖ మండపంలో పవిత్ర జలాలు, పంచామృతాలు నింపిన 108 కలశాలపై నూతన వస్త్రాలు కప్పి, కొబ్బరి కాయలు పేర్చిన అర్చకులు పంచసూక్త పఠనాలతో హోమం చేశారు. ఉత్సవ మూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్ర నామార్చన చేశారు. అటుపై వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా 108 సువర్ణ పుష్పాలతో అర్చన, అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నృసింహస్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలుచేశారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) ప్రధానాలయంలో బారులు తీరిన దృశ్యం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టితో మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర, తుమ్మల, జూపల్లి, పొన్నం, కోమటిరెడ్డి, వివేక్

తొలిసారి.. తీన్మార్

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలుపగా.. వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పదవీ ప్రమాణ స్వీకారం చేసేందుకు మంత్రుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చదివారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మజ్లిస్ శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ కోదండరాం, డీజీపీ జితేందర్ తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నూతనంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల కుటుంబసభ్యులు హాజరయ్యారు.

కాగా, ముగ్గురు నూతన మంత్రుల ప్రమాణం కేవలం 9నిమిషాల్లోనే పూర్తయింది. మధ్యాహ్నం 12.13 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం.. 12.23 గంటలకే ముగిసింది. అయితే మంత్రుల ప్రమాణ స్వీకారానికి సంబంధించి రాజ్‌భవన్ ముద్రించిన ఆహ్వాన పత్రికల్లో కార్యక్రమం మధ్యాహ్నం 12.19 గంటలకు ఉంటుందని పేర్కొంది. కానీ, చెప్పిన దానికంటే 6 నిమిషాల ముందుగానే కార్యక్రమం మొదలైంది. కాగా, కొత్త మంత్రులకు సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు నూతన మంత్రులకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వారితోపాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న జాటోతు రాంచందర్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ఎన్నికల తరువాత మరో ముగ్గురికి!

ఆదివారం చేపట్టిన మంత్రివర్గ విస్తరణతో రేవంత్ క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 14కు చేరింది. మరో మూడు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. అయితే రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల తరువాత మిగిలిన ఆ మూడు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణ సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రేపు, మాపు అంటూ పలు దఫాలుగా విస్తరణను వాయిదా వేశారు. దీంతో మంత్రివర్గంలో చోటు కోసం ఆశావహుల పేర్లతో జాబితా రోజు రోజుకూ పెరిగిపోయింది. అదే స్థాయిలో పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి పెరిగింది. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి పలు దఫాలు సమావేశమయ్యారు. చివరికి సుమారు 17 నెలల తర్వాత శనివారం రాత్రి పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సామాజిక సమీకరణాల సమతూకం పాటిస్తూ మాల, మాదిగ, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురితో మంత్రివర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్తరించారు.

విధేయతకు పట్టం

- విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లోనే వాకిటి శ్రీహరి
- తొలి పోటీలోనే ఎమ్మెల్యేగా గెలుపు.. మంత్రి పదవి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఉమ్మడి పాలమూరు జిల్లాకు మరింత ప్రాధాన్యం



మహబూబ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో వాకిటి శ్రీహరికి చోటు దక్కడం.. కాంగ్రెస్ పార్టీ విధేయుడికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీహరి.. విద్యార్థి దశ నుంచి నేడు మంత్రి అయ్యేదాకా కాంగ్రెస్‌లోనే తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వచ్చారు. బీఏ చదివిన వాకిటి శ్రీహరి 1990 నుంచి 1993వరకు ఎన్‌ఎస్‌యూఐ మక్తల్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 1993 నుంచి 1996 వరకు మక్తల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1996 నుంచి 2001 వరకు మక్తల్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2001లో మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మరోవైపు 2001 నుంచి 2006 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్‌లోనే వివిధ బాధ్యతల్లో పనిచేసిన శ్రీహరి.. 2014లో మక్తల్ నుంచి జడ్పీటీసీగా గెలుపొందారు. అదే సమయంలో జిల్లా పరిషత్తులో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. పార్టీలో డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2022లో నారాయణపేట డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శ్రీహరి భార్య లలిత కూడా ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. కాగా, 2024 పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సమయంలో ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. ముదిరాజ్ వర్గం నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చి.. రేవంత్ తన మాటను నిలబెట్టుకున్నారు. క్యాబినెట్‌లో శ్రీహరికి చోటు కల్పించడం ద్వారా సీఎం సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు మరింత ప్రాధాన్యం కల్పించినట్లయింది. ఉమ్మడి జిల్లా నుంచి సీఎం రేవంత్‌తోపాటు ఇప్పటికే జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్నారు.

పెద్దన్న తుమ్మల.. చిన్నాయన వాకిటి

- రాష్ట్ర మంత్రివర్గంలో అంతా 50 ఏళ్ల పైబడినవారే

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా మరో ముగ్గురికి అవకాశం దక్కింది. దీంతో సీఎం రేవంత్ మినహా మంత్రుల సంఖ్య 14కు చేరింది. అయితే, వయసు పరంగా మంత్రివర్గంలో అందరి కంటే పెద్ద తుమ్మల నాగేశ్వరరావు. ప్రస్తుతం ఆయన వయస్సు 72 ఏళ్లు. కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి అందరికంటే పిన్నవయస్కులు. ఆయన వయసు 53 ఏళ్లు. ఇక, రాష్ట్ర మంత్రివర్గంలో అందరూ 50 ఏళ్లు పైబడిన వారే ఉన్నారు. 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు ముగ్గురు, 53 ఏళ్ల వయస్సు వారు ఇద్దరు ఉన్నారు. తుమ్మల తర్వాత జూపల్లి కృష్ణారావు అత్యంత పెద్దవారు. ఆయన వయసు 69 ఏళ్లు. గడ్డం వివేక్ (67), దామోదర రాజనర్సింహ (66), భట్టివిక్రమార్క (63), ఉత్తమ్‌కుమార్ రెడ్డి(62), కోమటిరెడ్డి వెంకటరెడ్డి(60), పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్(59), పొన్నం ప్రభాకర్ గౌడ్(58), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (56), ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (55), ధనసరి అనసూయ(సీతక్క), వాకిటి శ్రీహరి (53) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సీతక్క 1971లో, శ్రీహరి 1972లో జన్మించారు.

కొత్త మంత్రులకు నేడో, రేపో శాఖలు

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చోటు దక్కించుకున్న ముగ్గురికి నేడో, రేపో శాఖలు కేటాయించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం పొద్దుపోయాక కొత్త మంత్రులకు శాఖలు కేటాయిస్తారనే ప్రచారం సాగింది. సామాజిక మాధ్యమాల్లో వారికి ఏయే శాఖలు కేటాయిస్తారో కూడా ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం మాత్రం ఆయా మంత్రులకు శాఖల కేటాయింపుపై సోమ లేదా మంగళవారం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలనే కొత్తవారికి ఇచ్చే చాన్స్ ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా ఎవరికీ కేటాయించని శాఖలు చాలా ఉన్నాయి. అవన్నీ కూడా సీఎం వద్దే ఉన్నాయి. వాటిలో విద్య, పురపాలక, హోం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, కమర్షియల్ ట్యాక్స్, పశుసంవర్ధకశాఖ, న్యాయ, కార్మిక, మైన్స్ అండ్ జియాలజీ, క్రీడలు యువజన శాఖతో పాటు మరి కొన్ని శాఖలు సీఎం వద్దనే ఉన్నాయి. కాగా గడ్డం వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేతల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించే అవకాశముందన్న ఆతృతతో ఉన్న కొత్త మంత్రుల అనుచరులు, శ్రేయోభిలాషులు, నియోజకవర్గ నేతలు గాంధీభవన్, సచివాలయ వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తొలిదశ మంత్రివర్గ కూర్పు సమయంలో శాఖల కేటాయింపుపై హైకమాండ్ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈమారు కూడా అధిష్ఠానం సూచనలు, సలహాల మేరకే శాఖల కేటాయింపు ఉంటుందా? లేక సీఎం సొంతంగా నిర్ణయించి ఇస్తారా అన్నది వేచి చూడాలి.

మూడు జిల్లాలకు ముగ్గురేసి మంత్రులు..

తాజా మంత్రివర్గ విస్తరణతో ఉమ్మడి జిల్లాలైన కొన్నింటికి ముగ్గురేసి చొప్పున మంత్రులయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఉండగా.. తాజాగా అడ్లూరి లక్ష్మణ్ అమాత్యుల జాబితాలో చేరిపోయారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌తో పాటు జూపల్లి కృష్ణారావు ఉన్నారు. ఇప్పుడు వాకిటి శ్రీహరి చేరడంతో ఆ జిల్లా నుంచి కూడా మంత్రివర్గంలో ముగ్గురికి ప్రాతినిధ్యం దక్కినట్లు అయింది. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఇప్పటికే తుమ్మల, పొంగులేటి, భట్టి విక్రమార్క ఉన్నారు. నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున, ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ నుంచి ఒక్కొక్కరికి ప్రాధాన్యం దక్కింది. గడ్డం వివేక్‌కు మంత్రి పదవి రావడంతో తొలిసారి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం దక్కినట్లయింది. కాగా నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ఇప్పటిదాకా చోటు దక్కలేదు. మలి విస్తరణలో ఈ మూడు జిల్లాలకు అవకాశం దక్కుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

అసంతృప్తులకు చెక్!

విస్తరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించడం ద్వారా.. అసంతృప్తులకు కాంగ్రెస్ అధిష్ఠానం చెక్ పెట్టింది. సామాజిక న్యాయం అంశాన్ని తెరపైకి తెచ్చి మంత్రి పదవుల్లో ఒకటి బీసీ, రెండు ఎస్సీలకు.. డిప్యూటీ స్పీకర్ పోస్టును ఎస్టీ లంబాడాకు కేటాయించడంద్వారా ఎవరూ తమ అసంతృప్తిని బాహాటంగా వ్యక్తపరచలేని పరిస్థితిని కల్పించింది. అదే సమయంలో అసంతృప్తులకు ఆశలు కల్పిస్తూ.. మూడు బెర్తులను పెండింగ్‌లో పెట్టింది. ఆశించిన పదవి దక్కక నారాజ్ అయిన నేతలను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ బుజ్జగించే పనిలో పడ్డారు. ఏదేమైనా మంత్రివర్గ విస్తరణతో ఏర్పడిన తుపాను.. టీ కప్పులో తుపానుగానే తేలిపోతుందన్న ధీమాను పార్టీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిందేనంటూ రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి పట్టుపడుతూ వస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తనకు చోటు కల్పించాలంటూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గట్టి ప్రయత్నమే చేశారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి చోటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రేమ్‌సాగర్‌రావుకు చోటు కోసం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇక.. మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించాలంటూ ఆ వర్గం ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి పెంచారు. ఓసీల్లో రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు.. మంత్రివర్గంలో చోటుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో సామాజిక న్యాయాన్ని అజెండాగా తీసుకున్న అధిష్ఠానం.. అదే అస్త్రాన్ని రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ విషయంలోనూ ప్రయోగించింది.

బుజ్జగింపులు..

విస్తరణలో చోటు దక్కుతుందని గట్టి విశ్వాసంతో ఉన్న రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి అధిష్ఠానం నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మల్‌రెడ్డి తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రాహుల్‌గాంధీకి లేఖ రాసి.. ఆ లేఖను విడుదల చేసేందుకు పత్రికా సమావేశం పెట్టాలని కూడా నిర్ణయించుకున్నారు. విషయం తెలిసి వెంటనే రంగంలోకి దిగిన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ బుజ్జగింపుల పర్వానికి తెరతీశారు. తొలుత ప్రేమ్‌సాగర్‌రావు, సుదర్శన్‌రెడ్డి నివాసాలకు వెళ్లి వారిని కలిశారు. ఇది అధిష్ఠానం తీసుకున్న నిర్ణయమని వారికి వివరించారు. అయితే కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నామని గుర్తుచేసిన వారు.. పార్టీ గెలుపు కోసం తాము ఏ విధంగా కష్టపడిందీ వివరించారు. "మంత్రివర్గంలో చోటు దగ్గరికి వచ్చేసరికి కులం అడ్డొచ్చిందా" అని సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే పార్టీ గెలుపు కోసం వారు చేసిన కృషి అధిష్ఠానం దృష్టిలో ఉందని, తగిన సమయంలో తప్పకుండా న్యాయం చేస్తుందని మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ వారికి భరోసా ఇచ్చారు. అలాగే చిలుకూరు దగ్గర ఓ ఫామ్‌హౌస్‌లో ఉన్న రాజగోపాల్‌రెడ్డిని కలిసిన మీనాక్షి నటరాజన్.. తగిన సమయంలో పార్టీ న్యాయం చేస్తుందని ఆయనకు హామీ ఇచ్చారు. ఆ సమయంలో ఆమెతోపాటు మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా.. వివేక్ వెంకటస్వామికి, తనకు మంత్రి పదవి ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సంగతిని రాజగోపాల్‌రెడ్డి గుర్తు చేశారు. పార్టీ గెలుపుకోసం తాను ఎంతగానో కృషి చేశానని, లోక్‌సభ ఎన్నికల్లోనూ భువనగిరి సీటును గెలిపించుకొచ్చానని వివరించినట్లు సమాచారం. దీంతో.. ముగ్గురితోనే మంత్రివర్గ విస్తరణ ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో మీనాక్షి నటరాజన్ ఆయనకు వివరించినట్లు తెలుస్తోంది. ఇక.. మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మలక్‌పేట తిరుమలాహిల్స్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో చర్చలు జరిపారు. గత ప్రభుత్వాల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో సముచిత స్థానం ఉండేదని.. అలాంటిది ఈ ప్రభుత్వంలో అవకాశం ఇవ్వకపోవడంపై పార్టీ క్యాడర్‌కూడా కొంత అసంతృప్తిలో ఉందని.. మల్‌రెడ్డి వారికి వివరించే ప్రయత్నం చేశారు. వచ్చే స్థానిక సంస్థలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ జిల్లాలవారికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని మల్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. దీనికి మహేశ్‌గౌడ్.. పార్టీ తగిన సమయంలో గుర్తింపును ఇస్తుందంటూ ఆయనకు హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడిన మల్‌రెడ్డి.. రాష్ట్రంలో సగం జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రి వర్గంలో చోటు కల్పించకుంటే పార్టీకి నష్టమనే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

పదవులు.. సామాజిక న్యాయం!

జాతీయ స్థాయిలో సామాజిక న్యాయం అంశాన్ని అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. దాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు ఉపక్రమించింది. తాజా విస్తరణతో రాష్ట్రంలో మంత్రివర్గ సభ్యుల సంఖ్య 15కు చేరింది. వీరిలో అగ్రకులాలవారు ఏడుగురు (సీఎం రేవంత్‌రెడ్డి సహా నలుగురు రెడ్లు, ఒక కమ్మ, ఒక వెలమ, ఒక బ్రాహ్మణ).. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి (వాకిటి శ్రీహరి సహా బీసీ సామాజిక వర్గం నుంచి ముగ్గురు, అడ్లూరి లక్ష్మణకుమార్ సహా ఎస్సీ మాదిగ సామాజికవర్గం నుంచి ఇద్దరు, గడ్డం వివేక్ సహా ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి ఇద్దరు, ఎస్టీ ఆదివాసీ నుంచి సీతక్క) ఎనిమిది మంది ఉన్నారు. తదుపరి విస్తరణలో మిగిలిన మూడు మంత్రి పదవులకుగాను ఒకటి ముస్లిం మైనారిటీలకు, ఒకటి బడుగు, బలహీన వర్గాలకు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి చెందిన రాంచందర్‌నాయక్‌ను ఎంపిక చేయడంతో.. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలవారిని ఎంపిక చేసినట్లయిందని రాజకీయ వర్గాలు విశ్లేషించాయి. ఇప్పటి దాకా విప్‌లుగా పనిచేసిన అడ్లూరి లక్ష్మణకుమార్, రాంచందర్ నాయక్ స్థానాల్లోనూ ఆయా సామాజిక వర్గాల వారినే ఎంపిక చేసే అవకాశం ఉందనీ చెబుతున్నాయి.

కలలోనూ ఊహించలే

కార్యకర్తను కాంగ్రెస్ మంత్రిని చేసింది: 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్



హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తనకు మంత్రి పదవి వస్తుందని కలలో కూడా ఊహించలేదని నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తన లాంటి సామాన్య కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ మంత్రిని చేసిందన్నారు. 42 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నానని, ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నానని తెలిపారు. పేదల కష్టం తెలిసిన వాడినని, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని, కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తానని చెప్పారు. ఆదివారం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత లక్ష్మణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "1982 నుంచి కాంగ్రెస్‌లో ఉన్నా. ఉమ్మడి ఏపీలో టీడీపీ హవా, రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణలో బీఆర్ఎస్ హవా ఉన్నా.. నేను పార్టీ మారలేదు. సామాన్య కార్యకర్తగా ఉన్న నాకు కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. గతంలో వరుసగా మూడుసార్లు ఓటమిపాలయ్యాను. ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచిన నాకు.. ఇప్పుడు మంత్రి పదవి ఇచ్చింది. ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ పెద్దలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు. రాజకీయంగా కాంగ్రెస్‌లో నన్ను మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, టి.జీవన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు, నా నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే నాకు ఈ అవకాశం వచ్చింది. నియోజకవర్గ ప్రజలకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు" అని మంత్రి లక్ష్మణ్ అన్నారు.

కాంగ్రెస్‌లోనే సామాజిక న్యాయం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే సామాజిక న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను పనిచేస్తానని, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళతానని చెప్పారు. రాష్ట్రంలో 32 లక్షల మంది ఉన్న మాదిగ జాతికి ప్రతినిధిగా తనకు మంత్రిగా అవకాశం లభించిందని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎస్సీ కులాల వర్గీకరణ చేసింది. బీసీలకు 42% శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లులో ఆమోదించాం. మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం ఇవ్వాలని రాష్ట్రం నుంచి ఢిల్లీ వరకు పార్టీ పెద్దలను కలిసి విజ్ఞప్తులు చేశాం. ఆ సమయంలో కూడా నాకు మంత్రి పదవి ఇవ్వాలనిగానీ, నాకు ఇస్తారనిగానీ నేను అనుకోలేదు. మా జాతిలో ఉన్న ఎమ్మెల్యేల్లో ఒకరికి ఇవ్వాలని కోరాం. శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌ను కలిసినప్పుడూ ఇదే చెప్పాం. కానీ, ఆదివారం ఉదయం 9.15 గంటలకు ముఖ్యమంత్రి నుంచి ఫోన్ వచ్చింది. 'కాబోయే మంత్రివర్యులకు కంగ్రాచ్యులేషన్స్' అంటూ సీఎం రేవంత్ చెప్పారు. సీఎం అలా చెప్పేసరికి నాకు ఒక్కసారిగా ఏం చెప్పాలో కూడా అర్థం కాలేదు. చాలా సంతోషించా. అన్ని వర్గాలను కలుపుకొని పోవాలని, బాగా పనిచేసి.. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సీఎం సూచించారు. ఆయన సూచనలను కచ్చితంగా పాటిస్తా. నాకు పదవి రావడం పట్ల మిగిలిన మా మాదిగ ఎమ్మెల్యేలు కూడా సంతోషం వ్యక్తం చేశారు. అందరం కలిసికట్టుగానే ఉంటాం. ఇక సీఎం రేవంత్.. నాకు ఏ శాఖ ఇచ్చినా శక్తివంచన లేకుండా పనిచేస్తా" అని మంత్రి లక్ష్మణ్ అన్నారు.

సామాన్య కుటుంబంలో జన్మించి..

లక్ష్మణ్ సామాన్య దళిత కుటుంబం నుంచి వచ్చారు. 1966 ఏప్రిల్ 1న పెద్దపల్లిలో నాగయ్య, లక్ష్మి దంపతులకు జన్మించిన లక్ష్మణ్.. డిగ్రీ వరకు చదువుకున్నారు. ఆయన భార్య కాంతకుమారి డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. 1982 నుంచి 1985 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, 1986-94 వరకు ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 2006లో ధర్మారం నుంచి జడ్పీటీసీగా గెలుపొందారు. 1999లో మేడారం నుంచి, 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అంతకుముందు 2009 నుంచి 2011 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. 2013-14 మధ్య కాలంలో ఉమ్మడి ఏపీలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పనిచేశారు. 2023లో ధర్మపురి నుంచి మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

మీ మేలు మర్చిపోను.. అన్న!

మంత్రిగా ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌తో అడ్లూరి కరచాలనం చేస్తూ 'మీ మేలు ఎప్పుడూ మర్చిపోను.. అన్న!' అంటూ ధన్యవాదాలు చెప్పారు. అంతకుముందు అడ్లూరికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ప్రజాసేవకు మరో అవకాశం

- ఏ శాఖ ఇవ్వాలో సీఎం నిర్ణయిస్తారు: వివేక్



హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడానికి తనకు మరో అవకాశం లభించిందని నూతన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్యకర్తల కోరిక మేరకు తన తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చానని, సుదీర్ఘ ప్రయాణం తరువాత ఇప్పుడు మంత్రి పదవి దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆదివారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వివేక్ మీడియాతో మాట్లాడారు. "మా నాన్న వెంకటస్వామి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నేను ఆయనకు ఎలక్షన్ ఏజెంట్‌గా పనిచేశాను. ఆయన రాజకీయాల నుంచి రిటైర్ అవడంతో కార్యకర్తల కోరిక మేరకే 2009లో రాజకీయాల్లోకి వచ్చాను. గతంలో తెలంగాణ కోసం పోరాడాను. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ అవినీతిపైనా కొట్లాడాను. మా నాన్నను ఇప్పటికీ చాలా మంది గుర్తుంచుకున్నారు. ఆయన నిత్యం పేదప్రజల కోసమే పనిచేశారు. అవే విలువలు, వారసత్వాన్ని మాకు నేర్పించారు. అదే ఆలోచనలను నేను పాటిస్తూ, ముందుకు వెళ్తాను. రేవంత్‌రెడ్డికి అండగా ఉంటూ, ప్రజా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేస్తాను" అని వివేక్ అన్నా రు. మంత్రిగా తనకు ఏ శాఖ ఇచ్చినా సమర్థంగా నిర్వహిస్తానని, ఏ శాఖ ఇవ్వాలనేదానిపై సీఎం రేవంతే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. "మా ప్రాంతంలో సింగరేణి ఉంది. అక్కడ కొత్త గనులు వచ్చేలా ప్రయత్నం చేస్తా. గనులు వస్తే.. ఉద్యోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. దాంతో సింగరేణి కూడా మరింత బలోపేతమవుతుంది. ఇక ఎన్నికల సమయంలో నేతకాని కార్పొరేషన్, లిడ్‌క్యాప్ సంస్థ పునఃప్రారంభం, మాల కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని చెప్పాను. వాటిని అమలుచేసే దిశగా ముఖ్యమంత్రితో చర్చిస్తాను" అని వివేక్ చెప్పారు. మంత్రి పదవి కోసం తమ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్ కూడా ప్రయత్నించారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. అయితే సామాజిక సమీకరణాలు, గతంలో తన తండ్రి చేసిన సేవలను అధిష్ఠానం పరిశీలించి నిర్ణయం తీసుకుందని తెలిపారు.

వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి


కేంద్ర మాజీ మంత్రి, దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) కుమారుడైన వివేక్ వెంకటస్వామి 1957 నవంబరు 30న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివారు. తండ్రి వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. 2009లో పెద్దపల్లి ఎంపీగా గెలుపొంది.. రాష్ట్రం కోసం ఢిల్లీ స్థాయిలో కృషిచేశారు. తెలంగాణ ఇవ్వకుండా కాంగ్రెస్ జాప్యం చేస్తుందన్న కారణంతో 2013లో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్)లో చేరారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత మళ్లీ 2014లో కాంగ్రెస్‌లో చేరారు. ఆ తరువాత 2016లో బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2019లో బీజేపీలో చేరారు. ఆ తరువాత 2023 నవంబరు 21న తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. వెంటనే జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున చెన్నూరు నియోజవర్గంలో పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుంచి తన కుమారుడు వంశీకృష్ణను బరిలో దింపి ఎంపీగా గెలిపించడంలో సఫలీకృతులయ్యారు. వివేక్ సోదరుడు వినోద్ ప్రస్తుతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

తనయుడి సంబరాలు!

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో.. తనయుడు ఎంపీ వంశీకృష్ణ సంబరాలు చేసుకున్నారు. వివేక్ మంత్రి పదవి చేపట్టనున్న విషయం తెలిసి కార్యకర్తలు, అనుచరులు ఆయన ఇంటికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఎంపీ తీన్మార్ స్టెప్పులు వేశారు.

డిప్యూటీ స్పీకర్‌గా ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

» 2023లో తొలిసారిగా చట్టసభలో అడుగు



మహబూబాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్‌నాయక్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవి వరించింది. వృత్తి రిత్యా వైద్యుడైన రాంచందర్‌నాయక్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్‌పై ఘన విజయం సాధించి తొలిసారి చట్టసభలో అడుగుపెట్టారు. 18 నెలలుగా ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్న రాంచందర్‌నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం.. మహబూబాబాద్ జిల్లాకు దక్కిన గౌరవమని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం బొమ్మకల్లు సర్పంచ్‌తండాకు చెందిన జాటోతు రాంచందర్‌నాయక్ ఉస్మానియా నుంచి ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ సర్జన్ పట్టాలు పొందారు. సూర్యాపేటలో శివసాయి ఆస్పత్రి స్థాపించి, వైద్య సేవలందించారు. రాంచందర్‌నాయక్ సతీమణి ప్రమీల కూడా వైద్యురాలే. ఆమె గైనకాలజిస్టుగా వైద్య వృతిలో కొనసాగుతున్నారు. వైద్యుడిగా కొనసాగుతుండగా.. టీడీపీ అనుబంధ ఆరోగ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంచందర్‌నాయక్ 2006లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున డోర్నకల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగి ఓటమి చవిచూశారు. 2023లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించారు.

20న ఎల్బీ స్టేడియంలో యోగా వేడుకలు

» ఎమర్జెన్సీకి 50 ఏళ్లు నిండిన సందర్భంగా.. యువతకు అవగాహన కార్యక్రమాలు: కిషన్‌రెడ్డి



బర్కత్‌పుర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించి పదేళ్లు నిండుతున్న సందర్భంగా ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో యోగా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. యోగా వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు. 20న ఉదయం 5 గంటలకు నిర్వహించే వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో యోగా వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి 50 ఏళ్లు నిండుతున్న సందర్భంగా నాటి చీకటి రోజుల వాస్తవాలను, ప్రజలు పడిన ఇబ్బందులను నేటి యువతకు తెలియజేయడానికి విస్తృతంగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన జాతీయ వాదులను ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసి జైల్లో పెట్టిందని, ఆ చీకటి రోజులను ప్రజలు నేటికీ మరచిపోలేదని చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లు నిండుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


నేడు కాచిగూడ స్టేషన్‌లో ఫసాడ్ లైటింగ్ ప్రారంభం

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దాదాపు రూ.2.23 కోట్లతో ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను సోమవారం సాయంత్రం 6 గంటలకు కిషన్‌రెడ్డి జాతికి అంకితం చేస్తారని స్టేషన్ డైరెక్టర్ బాలాజీ తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 785 లైట్లతో స్టేషన్ సముదాయం చూడముచ్చటగొలుపుతుందని చెప్పారు. స్టేషన్ ప్రారంభమై 109 ఏళ్లు పూర్తయ్యాయని బాలాజీ వెల్లడించారు.

అమరావతిలో అపోలో ఆస్పత్రి!

» ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అపోలో చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ వచ్చిన ఏపీ సీఎంతో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి ఆస్పత్రిని నిర్మించాలని అపోలో చైర్మన్‌ను చంద్రబాబు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అమరావతిలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అపోలో ఆస్పత్రిని నిర్మిస్తామని చంద్రబాబుకు తెలిపారు.



అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

తొలి రోజు ఐసెట్‌కు 90.49% మంది హాజరు

హైదరాబాద్, నల్లగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ అడ్మిషన్ల కోసం మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) ఆధ్వర్యంలో ఆదివారం ఐసెట్‌ను సజావుగా నిర్వహించినట్టు తెలంగాణ ఐసెట్-2025 కన్వీనర్ ఆచార్య అల్వాల రవి ఓ ప్రకటనలో తెలిపారు. మూడు విడతల్లో కంప్యూటర్ ఆధారితంగా ఈ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు 93 పరీక్ష కేంద్రాల్లో, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 91 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ఉదయం పరీక్షకు 24,330 మంది అభ్యర్థులకు 21,897 మంది (90 శాతం), మధ్యాహ్నం పరీక్షకు 24,330 అభ్యర్థులకు గానూ 22,136 మంది (90.98 శాతం) హాజరయ్యారు. రెండు విడతల్లో కలిపి 90.49 శాతం హాజరు నమోదైంది. ఈ పరీక్షలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తంతోపాటు యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పరిశీలించారు. యూనివర్సిటీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కన్వీనర్ రవి పరీక్ష నిర్వహణ సరళిని సమీక్షించి తగు సూచనలు చేశారు.

ఏపీ ఈఏపీసెట్‌లో.. తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు

» ఇంజనీరింగ్‌లో అనిరుధ్‌రెడ్డికి 1వ, త్రిశూల్‌కు ఎనిమిదో ర్యాంకు
» అగ్రి, ఫార్మసీలో నిషాంత్‌కు 2వ, వై.షణ్ముఖ్‌కు నాలుగో ర్యాంకు
» తెలంగాణ తరహాలో స్థానికులకే.. సీట్లివ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం
» మొత్తంగా 75.67 % మంది అర్హత



ఆవనగంటి అనిరుధ్‌రెడ్డి



శాగంటి త్రిశూల్



యంద్రపతి షణ్ముఖ్



అక్షింతల షణ్ముఖ నిశాంత్

అమరావతి/జేఎన్టీయూకే, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్‌లో తెలంగాణ విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్‌కు చెందిన ఆవనగంటి అనిరుధ్‌రెడ్డి ఫస్ట్ ర్యాంకు, హన్మకొండకు చెందిన శాగంటి త్రిశూల్ 8ర్యాంకు సాధించారు. అగ్రి-ఫార్మసీ విభాగంలో రంగారెడ్డి జిల్లా మియాపూర్‌కు చెందిన అక్షింతల షణ్ముఖ నిషాంత్ 2వ స్థానంలో, హనుమకొండకు చెందిన యంద్రపతి షణ్ముఖ్ 4వ స్థానంలో నిలిచారు. మొత్తంగా ఏపీ ఈఏపీసెట్‌లో 75.67 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 71.65 శాతం మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.8 శాతం మంది అర్హులయ్యారు. ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాలను జేఎన్టీయూ(కాకినాడ) వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం విడుదల చేశారు. ఇంజనీరింగ్, అగ్రి-ఫార్మసీ రెండు విభాగాల్లోనూ టాప్ 10 ర్యాంకులను అబ్బాయిలే దక్కించుకున్నారు. అయితే ఉత్తీర్ణతశాతంలో అమ్మాయిలు కొంత ముందున్నారు. మొత్తంగా ఇతర రాష్ట్రాల నుంచి ఇంజనీరింగ్‌లో 8,233 మంది, అగ్రి- ఫార్మసీలో 1,162 మంది అర్హత సాధించారు. అయితే ఏపీ విద్యార్థులకు సీట్లు ఇవ్వకూడదని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల వారికి సీట్లు కేటాయించకూడదంటూ ఏపీ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంజనీరింగ్ టాపర్లు

1. ఎ.అనిరుధ్‌రెడ్డి(రంగారెడ్డి, తెలంగాణ), 2. ఎం.భానుచరణ్‌రెడ్డి (తిరుపతి), 3. కె. యశ్వంత్ సాత్విక్(పశ్చిమగోదావరి), 4. యు. రామచరణ్ రెడ్డి(నంద్యాల), 5. ఎ. భూపతి నితిన్(అనంతపురం), 6. టి. విక్రమ్ (గుంటూరు), 7. డి. మనిదీప్ రెడ్డి(చిత్తూరు), 8. ఎస్. త్రిశూల్(హన్మకొండ, తెలంగాణ) 9. డి. జ్ఞాన రుత్విక్ సాయి(శ్రీకాకుళం), 10. బి. వెంకటమణి ప్రీతమ్(నెల్లూరు).

అగ్రికల్చర్, ఫార్మసీ టాపర్లు

1. ఆర్. వెంకటనాగ సాయి హర్షవర్ధన్(కృష్ణా), 2. ఎ. షణ్ముఖ నిషాంత్(రంగారెడ్డి, తెలంగాణ), 3. డి. అకీరానంద వినయ్ మల్లేశ్ కుమార్(కోనసీమ), 4. వై. షణ్ముఖ్(హన్మకొండ, తెలంగాణ), 5. వై. సత్య వెంకట్(పశ్చిమగోదావరి), 6. ఎస్. శ్రీసాయి గోవర్ధన్(కాకినాడ), 7. జి. లక్ష్మీ చరణ్ (విశాఖపట్నం), 8. డి. కార్తీక్ రామ్ కిరీటి(తూర్పుగోదావరి), 9. కె. మోహిత్ శ్రీరామ్(తూర్పుగోదావరి), 10. డి. సూర్య చరణ్(కాకినాడ).

నిర్ణయాలు మీరే తీసుకుని ఫైళ్లు మా వద్దకు తెస్తే ఎలా?

ఓ ఐఏఎస్ అధికారిపై సీఎం రేవంత్ అసహనం

ఓ లీజు గడువు పెంచిన అధికారిపై ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): "మీరే నిర్ణయాలు తీసుకుని.. ఫైళ్లు మా దగ్గరకు తీసుకువస్తే ఎలా? ఇది ఎంతవరకు సమంజసం?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఓ ఐఏఎస్ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. సీఎంతోపాటు మరో మంత్రి కూడా, "అలా ఎలా నిర్ణయాలు తీసుకుంటారు? సమాచారం ఇవ్వాలి కదా!" అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 5న సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్యాబినెట్ భేటీ సందర్భంగా.. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఓ పథకానికి సంబంధించిన ఫైలును ఆ శాఖ కమిషనర్ మంత్రివర్గం ముందు ఉంచారు. అయితే సదరు అంశం.. ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా అధికారి స్థాయిలో నిర్ణయం తీసుకోదగినది కాదు. అయినా ఆ అధికారి నిర్ణయం తీసుకుని.. ఆ తరువాత క్యాబినెట్ ముందుకు తేవడం చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఓ ముఖ్య శాఖకు కమిషనర్‌గా, ఎండీగా, వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అధికారి.. ఇటీవల తన శాఖ పరిధిలోని ఒక లీజు గడువు విషయంపై నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఆ శాఖ పరిధిలో ఉన్న భూములు, ఇతరత్రా ఆస్తులను లీజుకు ఇవ్వొద్దని గతం నుంచే ఉత్తర్వులు అమల్లో ఉన్నట్టు సమాచారం. ఒకవేళ ఆ ఉత్తర్వులు వచ్చేనాటికి ఏవైనా భూములు లీజులో ఉంటే.. వాటి లీజు గడువు ముగియగానే ఆ భూమిని/ఇతరత్రా ఆస్తులను శాఖ స్వాధీనం చేసుకోవాలనే నిబంధన ఉన్నట్టు తెలిసింది. కానీ, ఓ లీజు గడువు ముగిసే సమయానికి స్వాధీనం చేసుకోకపోగా, ఆ లీజు గడువును పొడిగిస్తూ సదరు అధికారి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మంత్రివర్గానికి తెలియజేయకుండా.. ప్రభుత్వం దృష్టికి తీసుకురాకుండానే లీజు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకోవడం, ఆ తరువాత మంత్రివర్గానికి నివేదించగా.. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

త్వరలో మరో ముగ్గురికి పదవులు!

» మల్‌రెడ్డికి అప్పుడు అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తాం
» ఈసారి కుల సమీకరణలతోనే ఆయనకు చోటు దక్కలేదు
» టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



మల్‌రెడ్డి రంగారెడ్డితో భేటీ అయిన మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం

చాదర్‌ఘాట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టే క్యాబినెట్ విస్తరణలో మరో మూడు మంత్రి పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కుల సమీకరణాల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి చోటు దక్కలేదని.. వచ్చేసారి ఆయనకు చోటు కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. మంత్రి పదవికి దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన మల్‌రెడ్డి రంగారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్న విషయం తెలిసి మహేశ్ గౌడ్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి హుటాహుటిన మలక్‌పేట తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చి బుజ్జగించారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మూడు స్థానాలతోనే క్యాబినెట్ విస్తరణ జరిగిందని మహేశ్ గౌడ్ చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని అధిష్ఠానానికి కూడా వివరించామన్నారు. రాష్ట్రంలోని 40 శాతం జనాభా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉంటుందని, భవిష్యత్తులో ఈ జిల్లాలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహానికి గురికాకుండా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

విస్తరణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం పాటించింది: జాజుల

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంకల్పంలో భాగంగానే ఈసారి మంత్రివర్గ విస్తరణలో బడుగులకు పదవులు లభించాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మూడు మంత్రి పదవులను ఎస్సీ, బీసీ వర్గాలకే కేటాయించడం హర్షణీయమన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ పదవుల్లోనూ కాంగ్రెస్ సామాజిక న్యాయం పాటించిందని, అలాగే ఆ పార్టీలోని 66 ఉన్నత పదవుల్లో 40 పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక న్యాయం అమలు కోసం కృషి చేస్తున్న రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సీనియర్లను పక్కనపెడతారా?

» అన్యాయం జరుగుతున్నా పార్టీ లైన్‌లోనే ఉన్నా: మల్‌రెడ్డి రంగారెడ్డి

చాదర్‌ఘాట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పతనమైన దశలో తిరిగి అధికారంలోకి తెచ్చాం. పార్టీకి కార్యకర్తలే బలం. కార్యకర్తలకు న్యాయం చేసేందుకే వారి డిమాండ్ మేరకు మంత్రి పదవి అడుగుతున్నా తప్ప పదవీ వ్యామోహంతో కాదు. ఇచ్చిన జిల్లాలకే రెండు, మూడు మంత్రి పదవులిస్తున్నారు. రాష్ట్రంలోనే దాదాపు 40 శాతం జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు గతంలో ఆరుగురు మంత్రులున్నారు. ఇప్పుడు ఆ జిల్లాలను పట్టించుకోవట్లేదు. కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి మంత్రివర్గంలో స్థానం కల్పించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన సీనియర్లను పక్కనపెట్టారు' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. మలక్‌పేట తిరుమలహిల్స్‌లోని తన నివాసంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రి పొన్న ప్రభాకర్‌తో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం పెద్దల సూచనలతో ప్రెస్‌మీట్ వాయిదా వేసుకున్నానని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను కాపాడిన వారిలో తాను ముఖ్యపాత్ర పోషించానన్నారు. 'పదవుల విషయంలో నాకు జరుగుతున్న అన్యాయాన్ని ఓర్చుకుంటూ ఇంకా పార్టీ లైన్‌లోనే ఉన్నాను. ఇక ముందు కూడా ఉంటాను. అలాగని పార్టీ అధిష్ఠానం పొరపాట్లు చేయవద్దని కోరుతున్నాను. పార్టీలో కొత్తగా వచ్చిన వాళ్లకు పదవులిస్తే కార్యకర్తలు బాధపడుతున్నారు' అని చెప్పారు.

స్థానిక పోరు తర్వాత.. పునర్వ్యవస్థీకరణ?

» జూలైలోనే స్థానిక ఎన్నికలు!
» ఆగస్టు 15 కల్లా పూర్తి
» స్థానిక ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పునర్వ్యవస్థీకరణలో అవకాశాలు

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మంత్రి వర్గ విస్తరణలో ముగ్గురికే అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఏకంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను చేపట్టనుందా ?అంటే కాంగ్రెస్ పార్టీ వర్గాలు అవుననే అంటున్నాయి. అంతేకాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశముందనే చర్చ కూడా ఆ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలను జూలై, ఆగస్టు నెలల్లో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జూలై మొదటి వారంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల తర్వాత పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలనూ నిర్వహించనున్నట్లు సమాచారం. మొత్తమ్మీద ఆగస్టు 15 కల్లా స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని చూస్తున్నట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకున్నా పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళ్లే ఆస్కారం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరును ఆధారంగా చేసుకుని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశముందని విశ్వసనీయ సమాచారం. నిజానికి, ఇటీవల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎన్నికలపైన సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. మంత్రుల పనితీరుపై పార్టీ అధిష్ఠానం రూపొందించిన ప్రగతి నివేదికను సీఎం ఈ సందర్భంగా మంత్రుల ముందు పెట్టినట్లు సమాచారం. ఇప్పటివరకూ ఆయా శాఖల్లో మంత్రుల పనితీరు, పార్టీకి నష్టం చేకూర్చే చర్యల ఆధారంగా అధిష్ఠానం మంత్రులకు ఏ, బీ, సీ గ్రేడ్లు ఇచ్చినట్లు తెలిసింది. ఆయా వివరాలను మంత్రుల ముందు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. పనితీరును మెరుగు పరుచుకోవాలని పలువురికి సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో ఆయా మంత్రుల పనితీరుపై అధిష్ఠానం దృష్టిసారిస్తుందని స్పష్టం కూడా చేసినట్టు తెలిసింది. శాఖల పరంగా ఇద్దరి నుంచి ముగ్గురు మంత్రుల పనితీరు అస్సలు బాగా లేదన్న అభిప్రాయంతో ఉన్న అధిష్ఠానం.. వారికి సీ గ్రేడు కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే, స్థానిక ఎన్నికల్లో సరైన పనితీరు చూపించని, శాఖల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించని మంత్రులను ఆయా శాఖల నుంచి తప్పించి వారికి వేరే శాఖలు కేటాయించే అవకాశం ఉందని చెబుతున్నారు. మంత్రివర్గం, శాఖల పునర్వ్యవస్థీకరణ చేపట్టే క్రమంలోనే పెండింగ్‌లో ఉన్న మూడు పదవులనూ కూడా భర్తీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

చేప ప్రసాదం కోసం పోటెత్తిన రోగులు

అరకొర ఏర్పాట్లతో ప్రజలకు ఇక్కట్లు





చేప మందు ప్రసాదాన్ని స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, భారీగా హాజరైన రోగులు

గోషామహల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా బత్తిని కుటుంబం పంపిణీ చేసే చేప మందు ప్రసాదం కోసం ప్రజలు పోటెత్తారు. కానీ, ప్రభుత్వ యంత్రాంగం అరకొర ఏర్పాట్లతో రోగులు ఇబ్బందుల పాలయ్యారు. ఆదివారం జరిగిన చేప మందు పంపిణీలో అపశృతి చోటు చేసుకుంది. క్యూలో నిలుచున్న మెదక్ జిల్లాకు చెందిన రిటైర్డు ఉద్యోగి సత్యనారాయణ (75) అనే వృద్ధుడు గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. నిర్వాహకులు వెంటనే అక్కడి వైద్య శిబిరానికి తరలించి సపర్యలు చేసినా, అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు 35 కౌంటర్లలో 1.50 లక్షల చేప పిల్లలు పంపిణీ చేశారు. బత్తిని అమర్నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు వి.హన్మంతరావు, మధుయాష్కీలతో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమాన్ని ప్రారంభించి తొలుత చేప ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ 170 ఏళ్ల క్రితం దూద్‌బౌలిలో ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుని నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకుందన్నారు. చేప మందు పంపిణీతో ప్రజలకు బత్తిని కుటుంబం నిస్వార్థ సేవ చేస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు భోజన వసతి, ఇతర ఏర్పాట్లు చేసిన స్వచ్ఛంద సంస్థలను మంత్రి పొన్నం అభినందించారు. రాష్ట్ర మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక్కో చేపపిల్లకు రూ.40 టోకెన్ జారీ చేశామని చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు చేప ప్రసాదం కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, భోజన వసతి కల్పించి మానవత్వం చాటుకున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.